www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 27-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 119
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి రా. 9.20 తదుపరి అష్టమి; నక్షత్రం: రేవతి మ. 1.00 తదుపరి అశ్విని; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.5.56-7.23, అమృతఘడియలు: ఉ.10.45-12.15, తె.4.57; రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.46

ఒలింపిక్స్‌పై కుట్ర

- ఫ్రాన్స్‌లో హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌పై దాడులు
- ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలకు ముందు ఐదు కీలక ప్రాంతాల్లో పట్టాల ధ్వంసం
- రైల్వే కేబుళ్లు, సిగ్నల్ బాక్సులకు నిప్పు
- వామపక్ష తీవ్రవాదులు, పర్యావరణ ఆందోళనకారులపై అనుమానాలు

2


రైల్వే సేవల్లో అంతరాయంతో పారిస్‌లోని ఓ రైల్వేస్టేషన్‌లో చిక్కుకున్న ప్రయాణికులు

దీపావళి తర్వాత
స్థానిక ధమాకా!

నవంబరులో నోటిఫికేషన్.. డిసెంబరులో ఎన్నికలు.. బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై తర్జనభర్జన

- ఓటర్ల జాబితా ప్రకారం బీసీ గణనకు సర్కారు నిర్ణయం.. ఈసీ నుంచి దానిని తీసుకోనున్న పంచాయతీరాజ్
- దాంతో గ్రామాలు, వార్డులు, మండలాల వారీ సర్వే.. బీసీలకు రిజర్వేషన్లు ఎంతనే అంశంపై కమిషన్ సిఫారసు


తెలంగాణ విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న ఫైర్‌మెన్లకు జ్ఞాపిక అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు డిసెంబరులో జరగనున్నాయా!? ఇందుకు నవంబరులో నోటిఫికేషన్ విడుదల కానుందా!? ఈ ప్రశ్నలన్నిటికీ 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. డిసెంబరులో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేలా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఈ మేరకు నవంబరులోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని ఆ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో సర్పంచ్‌ల పదవీ కాలం జనవరిలో; ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవీ కాలం జూలై మొదటి వారంతో ముగిసింది. పదవీ కాలాలు ముగిసేలోపే ఎన్నికలను నిర్వహించి కొత్తవారిని ఎన్నుకోవాలి. సర్పంచిల పదవీ కాలం ముగిసి ఇప్పటికే ఆరు నెలలు దాటేసింది. ఫలితంగా, స్థానిక

మిగతా 13వ పేజీలో...

90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు

- భర్తీకి పరీక్షలు నిర్వహిస్తాం
- నిరసనలు, ఆందోళనలు వద్దు: సీఎం రేవంత్‌రెడ్డి
- నిరుద్యోగులకు అన్నగా అండగా ఉంటానని హామీ

13

సిద్ధం కండి!

- స్థానిక ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయండి
- కోటాపై గడువులోగా బీసీ కమిషన్ నివేదికివ్వాలి
- అధికారులకు సీఎం నిర్దేశం

13

ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం

- పైలట్ ప్రాజెక్టుగా ఓ మండలాన్ని తీసుకోండి
- ధరణిపై సమీక్షలో రేవంత్ రెడ్డి

13

'ఎల్‌ఆర్‌ఎస్' పరిశీలనకు జిల్లాకో బృందం!

- మొత్తం 33 బృందాల ఏర్పాటు
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు
- కొత్త దరఖాస్తులకు చాన్స్?



పాకిస్థాన్ ఆట కట్టిస్తాం

2

- గతం నుంచి అది ఏమీ నేర్చుకోలేదు
- దాయాది ఉగ్ర కుట్రలు అణచివేస్తాం
- ఆర్మీలో గొప్ప సంస్కరణ అగ్నిపథ్
- యుద్ధ సన్నద్ధతా పెరిగింది: మోదీ
- కార్గిల్ విజయ్ దివస్‌కు పాతికేళ్లు
- ద్రాస్‌లో సైనికులతో గడిపిన ప్రధాని
- **ఆర్మీ మీద రుద్దిన స్కీమ్ అగ్నిపథ్**
- కార్గిల్‌పైనా రాజకీయాలా: కాంగ్రెస్

నేడే నీతి ఆయోగ్ భేటీ

- వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంపై చర్చలు
- సమావేశాన్ని బహిష్కరించాలని ఇండియా కూటమి సీఎంల నిర్ణయం
- హాజరు కాబోనని ఇప్పటికే ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భేటీకి హాజరై బెంగాల్ విభజన ప్రతిపాదనపై నిలదీస్తానని మమత వెల్లడి
- నీతి ఆయోగ్‌ను రద్దు చేసి ప్రణాళికా సంఘాన్ని పునరుద్ధరించాలని డిమాండ్
- పాల్గొననున్న ఏపీ సీఎం చంద్రబాబు.. హేమంత్ సోరెన్ హాజరుపై అనిశ్చితి

NITI Aayog

న్యూఢిల్లీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం శనివారం జరగనుంది. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ భేటీలో చర్చించనున్నారు. ఈమేరకు.. 'వికసిత్ భారత్-2047' పేరుతో నీతి ఆయోగ్ ఇప్పటికే ఒక ఆధారపత్రాన్ని రూపొందించింది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ సంక్షేమ

మిగతా 2వ పేజీలో...

2 వరకు గడువు

- కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి కాళేశ్వరం నీటిని ఎత్తిపోయాలి
- లేదంటే 50వేల మంది రైతులతో కదిలి మోటార్లు రన్ చేస్తాం
- రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ నేత కేటీఆర్ హెచ్చరిక
- పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో కన్నెపల్లి, మేడిగడ్డ సందర్శన


మేడిగడ్డ వద్ద గోదావరిని పరిశీలిస్తున్న కేటీఆర్ తదితరులు

వరంగల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి, గోదావరి ఎగువన ఉన్న రిజర్వాయర్లను నింపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలకు పోయి రైతులను ఆగం చేయొద్దని కోరారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో

మిగతా 12వ పేజీలో...



ఎన్‌డీఎస్‌ఏ చెబితే బ్యారేజీల్లో నింపుతాం

- నివేదిక వచ్చేదాకా నీటిని నిల్వ చేయం
- అన్నారం, సుందిళ్లలో నిల్వ చేస్తేనే నీటి పంపింగ్‌కు అవకాశం
- మేడిగడ్డ కుంగినప్పుడే నీటిని ఖాళీ చేయాలన్న ఎన్‌డీఎస్‌ఏ
- సిగ్గులేకుండా మాట్లాడుతున్న కేటీఆర్ పేరును గోబెల్స్‌గా మార్చుకోవాలి
- ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు 2-3 రోజుల్లో పంపింగ్: మంత్రి ఉత్తమ్

12

ఒలింపిక్స్‌పై కుట్ర

» ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలకు ముందు ఐదు కీలక ప్రాంతాల్లో పట్టాల ధ్వంసం.. రైల్వే కేబుళ్లు, సిగ్నల్ బాక్సులకు నిప్పు

ప్రపంచం నలుమూలల నుంచీ అత్యుత్తమ క్రీడాకారులందరూ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు పారిస్ మహానగరానికి వచ్చిన వేళ.. ఆ క్రీడా సంబరాల ప్రారంభానికి కొన్ని గంటల ముందు.. గుర్తు తెలియని వ్యక్తులు ఫ్రెంచ్ హైస్పీడ్ రైల్ (టీజీవీ) నెట్‌వర్క్‌పై వరుస దాడులు చేశారు. పారిస్ నగరాన్ని దేశంలోని నలుమూలలకూ అనుసంధానం చేసే ట్రాకులను లక్ష్యంగా చేసుకున్నారు. తెల్లవారితే శుక్రవారం అనగా రాత్రి ఒంటిగంట నుంచి తెల్లవారుజామున 5.30 గంటలవరకూ విధ్వంసం సృష్టించారు. కొన్నిచోట్ల పట్టాలను ధ్వంసం చేశారు. కొన్నిచోట్ల సిగ్నల్ బాక్సులకు నిప్పుపెట్టారు. కేబుళ్లను ముక్కలు ముక్కలు చేసి తగలబెట్టారు. ఈ

ఫ్రాన్స్‌లో హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌పై దాడులు


దెబ్బతిన్న కేబుళ్లను సరిచేస్తున్న సిబ్బంది

అనూహ్యదాడులతో చాలా రైళ్లను రద్దు చేయాల్సి వచ్చిందని, కొన్ని రైళ్లను దారి మళ్లించామని ఫ్రాన్స్ రైల్వే వ్యవస్థ ఎస్ఎన్‌సీఎఫ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. "మా టీజీవీ నెట్‌వర్క్‌ను స్తంభింపజేసేందుకు పెద్ద ఎత్తున జరిపిన దాడి ఇది" అని పేర్కొంది. ముఖ్యంగా.. ఈ నెట్‌వర్క్‌లో అత్యంత కీలకమైన ఐదు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగినట్టు వివరించింది. ఈ ఐదు ప్రాంతాలూ పారిస్‌ను తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణాల్లో ఉన్న నాలుగు ప్రధాన నగరాలను కలిపే కీలకమైన స్ట్రాటజిక్ నెర్వ్ సెంటర్స్ అని వెల్లడించింది. పెద్ద సంఖ్యలో రైళ్లు రద్దుకావడం, దారి మళ్లడంతో పలు రైల్వే స్టేషన్లు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడిపోయాయి. అథ్లెట్లు, సాధారణ ప్రయాణికులు కలిపి.. 80 వేలమందికి పైగా ఈ అంతరాయంతో ఇబ్బంది పడ్డారు. కాగా.. ఈ దాడులపై దర్యాప్తు ప్రారంభించినట్టు అధికారులు తెలిపారు. దాడులు ఎవరి పని అనే విషయం ఇప్పటివరకూ తెలియనప్పటికీ.. వామపక్ష తీవ్రవాదులు, అరాచకవాదులే ఈ దాడులకు పాల్పడినట్టు నిఘా వర్గాలు తెలిపాయంటూ ఫ్రెంచ్ మీడియా కథనాలను ప్రచురించింది. అదే సమయంలో.. ఇది పర్యావరణ ఆందోళనకారుల పనేనన్న వాదనలూ వినిపిస్తున్నాయి. మరోవైపు.. ఉక్రెయిన్‌పై దాడికి పాల్పడినందుకు నిరసనగా రష్యాను ఈ ఒలింపిక్స్‌కు ఆహ్వానించలేదని, కాబట్టి ఈ దాడుల వెనుక పుతిన్ హస్తాన్నీ కొట్టిపారేయలేమని కొందరు భద్రతా నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఫుట్‌బాల్ మ్యాచులు సహా.. పలు ఈవెంట్లు పారిస్ నగరానికి ఆవల జరగనున్న నేపథ్యంలో అక్కడికి వెళ్లడానికి ఇప్పటికే రైలు టికెట్లు బుక్ చేసుకున్నవారి ప్రణాళికలు శని, ఆదివారాల్లో ఈ మార్గంలో తిరగాల్సిన రైళ్లలో నాలుగోవంతు రైళ్లను రద్దు చేశారు.

-సెంట్రల్ డెస్క్



పాక్ ఆట కట్టిస్తాం

గతం నుంచి అది ఏమీ నేర్చుకోలేదు

» ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్వరం

» కార్గిల్ యుద్ధ విజయ్ దివస్‌కు పాతికేళ్లు

» ద్రాస్‌లో సైనికులతో గడిపిన ప్రధాని

» కార్గిల్ అమరులకు సీడీఎస్ నివాళులు


కార్గిల్ యుద్ధస్మారకం వద్ద మోదీ


జలంధర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కార్గిల్ అమరవీరుడి ఫొటోను ముద్దాడుతున్న ఓ సైనికుడి తల్లి

ద్రాస్ (లద్దాఖ్), జూలై 26 : దాయాది పాకిస్థాన్ ఉగ్ర కుట్రలను సైన్యం తిప్పికొడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. "ఉగ్రవాద ఘాతుకాలు, దొంగ యుద్ధాలతో కవ్వింపు చర్యలకు పాకిస్థాన్ పాల్పడుతూనే ఉంది. దాని ఆట కట్టిస్తాం. ముష్కరుల దుశ్చర్యలను అణచివేస్తాం" అంటూ తీవ్ర స్వరం వినిపించారు. భారత వీర జవాన్ల శౌర్యానికి ప్రతీకగా నిలిచిన కార్గిల్ యుద్ధానికి నేటితో పాతికేళ్లు. విజయ్‌దివస్‌గా ఈ సందర్భాన్ని భారతావని శుక్రవారం ఘనంగా జరుపుకొంది. ఆ యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన అమర జవాన్లకు, ఆ యుద్ధం జరిగిన కార్గిల్ ప్రాంతంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాళులు అర్పించారు. విధుల్లో ఉన్న సైనికులతో కలిసి విజయ్‌దివస్‌ను జరుపుకొన్నారు. అక్కడ ఏర్పాటుచేసిన కార్గిల్ యుద్ధ స్మారకాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌కు మోదీ గట్టి హెచ్చరిక చేశారు. జమ్మూను కేంద్రం చేసుకుని గత నెల రోజుల్లోనే ఉగ్రవాదులు ఆరుకు పైగా భారీ దాడులు చేశారు. ఈ నేపథ్యంలో మోదీ తీవ్రంగా స్పందించారు. "పాక్ చరిత్ర అంతా ఓటములతో నిండిపోయింది. అయినా ఇప్పటికీ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. వారి నీచ ఉద్దేశ్యాలు ఏనాటికీ నెరవేరవు. ఉగ్రవాద పోషకులు కూడా వినగలిగే చోటులో నిలబడి నేను ఈ మాట చెబుతున్నాను" అని హెచ్చరించారు. అసత్య కథనాలు, ఉగ్రవాద ఉన్మాదంపై సత్యం సాధించిన విజయమే కార్గిల్ యుద్ధమని మోదీ అభివర్ణించారు. కార్గిల్‌లో భారత్ యుద్ధాన్ని మాత్రమే గెలవలేదని, తిరుగులేని తన సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, అసాధారణ రీతిలో సత్యాన్ని ఆవిష్కరించిందని మోదీ అన్నారు. కాగా, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్... కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగాలు వృథా కాబోవన్నారు. కాగా, పార్లమెంటులో సభ్యులు కార్గిల్ అమరవీరుల కోసం మౌనం పాటించారు. వారి మహోన్నత త్యాగాలకు దేశం రుణపడి ఉంటుందని రాహుల్‌గాంధీ అన్నారు.

అగ్ని వీరులకు ఉద్యోగాలు

ప్రధాని మోదీ అభిలాష మేరకు అగ్నివీరులుగా పనిచేసి వచ్చిన వారికి పోలీసు, ప్రాదేశిక సైనిక దళాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తాజాగా బీజేపీ పాలిత ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ప్రకటించాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా సైతం అగ్నివీరులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయి. హరియాణా ఇదివరకే ఈ తరహా ప్రకటన చేసింది.

అగ్నిపథ్.. గొప్ప సంస్కరణ

అగ్నిపథ్ పథకంపై విపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రధాన మంత్రి మోదీ తిప్పికొట్టారు. జవాన్లను యుద్ధ సన్నద్ధులను చేయడానికి ఈ పథకం ఎంతగానో తోడ్పడిందన్నారు. యువసేనగా ఆర్మీని మార్చాలని దశాబ్దాలుగా పార్లమెంటులో, వివిధ కమిటీల్లో జరుగుతున్న చర్చలు అగ్నిపథ్ రూపంలో సాకారం అయ్యాయన్నారు. ఆర్మీలో సేవలు అందిస్తున్న జవాను వయసు ప్రపంచవ్యాప్త వయోసగటుతో పోల్చితే భారత్‌లోనే నిన్నటివరకు అధికంగా ఉండేదని గుర్తు చేశారు. ఎంతగానో బాధిస్తున్న ఈ సమస్యను గుర్తించి, దానిపై ముఖ్యమైన సంస్కరణను సైన్యం చేపట్టిందన్నారు. అయినా, జాతీయ భద్రతతో ముడిపడిన ఇటువంటి సున్నితమైన అంశంపైనా కొందరు రాజకీయం చేస్తున్నారని, స్వప్రయోజన కాంక్షతో అబద్ధాలు వల్లిస్తున్నారని మోదీ మండిపడ్డారు. కాగా, అగ్నిపథ్‌పై మోదీ వ్యాఖ్యలను విపక్షాలు తప్పుబట్టారు. కార్గిల్ విజయ దివస్ నాడు కూడా మోదీ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. ఆర్మీ కోరితేనే కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని అమలు చేస్తోందన్న రీతిలో మోదీ వ్యాఖ్యలు ఉన్నాయని, ఇది పచ్చి అబద్ధమన్నారు. శౌర్య జవానులకిది మరిచిపోలేని అవమానమని మండిడ్డారు. ఈ పథకాన్ని రద్దు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. అగ్నిపథ్‌ను సైన్యానికి తెలియకుండా హఠాత్తుగా కేంద్రం ప్రవేశపెట్టిందని కాంగ్రెస్‌కు చెందిన మరో నేత జైరామ్ రమేశ్ విమర్శించారు. ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ఈ పథకాన్ని ఏకపక్షంగా తెచ్చారని అదే పార్టీకి చెందిన ఎంపీ వివేక్ టంఖా అన్నారు.

ఏనుగుల దాడుల్లో 2,853 మంది మృతి

గడిచిన ఐదేళ్ల గణాంకాల వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 26: ఏనుగుల దాడుల వల్ల గత ఐదేళ్ల కాలంలో 2,853 మంది మృత్యువాత పడినట్లు ప్రభుత్వ గణాంకాలు పేర్కొన్నాయి. ఈ ఐదేళ్లలో అత్యధికంగా 2023 సంవత్సరంలో 628 మంది చనిపోయారు. 2019లో 587 మంది, 2020లో 471 మంది, 2021లో 557 మంది, 2022 లో 610 మంది, 2023లో 628 మంది మృతికి ఏనుగులు కారణమైనట్లు కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గురువారం రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు. ఐదేళ్లకాలంలో ఒడిశాలో 624 మంది మృత్యువాత పడగా.. ఝార్ఖండ్‌లో 474 మంది, బెంగాల్‌లో 436 మంది, అసోంలో 383 మంది, ఛత్తీస్‌గఢ్‌లో 303 మంది, తమిళనాడులో 256 మంది, కర్ణాటకలో 160 మంది, కేరళలో 124 మంది చనిపోయారని గణాంకాలు చెబుతున్నాయి.

ఐదేళ్లలో 628 పులుల మృత్యువాత

గత ఐదేళ్ల కాలంలో దేశంలో 628 పులులు మృత్యువాత పడినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. వేటాడటంతో సహా సహజ, ఇతర కారణాల వల్ల ఈ మరణాలు సంభవించాయి. అలాగే ఇదే కాలంలో పులుల దాడుల వల్ల 349 మంది మరణించారు. ఇందులో ఒక్క మహారాష్ట్రలోనే 200 మరణాలు నమోదయ్యాయి. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ప్రకారం.. 2019లో 96, 2020లో 106, 2021లో 127, 2022లో 121, 2023లో 178 పులులు మరణించాయి. 2012 నుంచి చూస్తే 2023లో అత్యధికంగా పులులు మృత్యువాతపడ్డాయి. కాగా 2019, 2020లో 49 మంది చొప్పున, 2021లో 59 మంది, 2022లో 110 మంది, 2023లో 82 మంది పులుల దాడుల్లో మృతి చెందారని కీర్తి వర్ధన్ సింగ్ గురువారం రాజ్యసభలో తెలిపారు.

నీట్-యూజీ ఫలితాల ప్రకటన

» పాత టాపర్లలో 44 మందికి ఫుల్ మార్కులు

న్యూఢిల్లీ, జూలై 26: వివాదాస్పదంగా మారిన నీట్-యూజీ పరీక్షల తుది ఫలితాలను జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శుక్రవారం ప్రకటించింది. ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉండడంతో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఆ బిట్‌కు మార్కులు ఇచ్చినట్టు ఎన్‌టీఏ తెలిపింది. దాని ప్రకారం ర్యాంకులు రూపొందించింది. ప్రస్తుత ఫలితాల్లో 44 మంది ఫుల్ మార్క్స్ సంపాదించి టాపర్లుగా నిలిచారు. తొలుత ఫలితాలు ప్రకటించినప్పుడు మొత్తం 67 మంది టాపర్లుగా గుర్తింపు పొందారు. కొన్ని పరీక్ష కేంద్రాల్లో పేపర్లు ఇవ్వడం ఆలస్యంగా కావడంతో ఆ నష్టాన్ని భర్తీ చేయడానికి ఎన్‌టీఏ మొదట గ్రేస్ మార్కులు ఇచ్చింది. అనంతరం ఆ గ్రేస్ మార్కులను ఉపసంహరించుకోవడంతో ఆరుగురు విద్యార్థులు టాపర్ల అర్హతను కోల్పోయారు. దాంతో సవరించిన ఫలితాల్లో 61 మంది టాపర్లుగా నిలిచారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మూడోసారి ర్యాంకుల తుది జాబితాను రూపొందించగా వారిలో 44 మంది టాపర్లుగా ఘనతను పొందారు. అభ్యర్థుల 'రీ-రివైజ్డ్ స్కోర్ కార్డులు' సిద్ధంగా ఉన్నాయని ఎన్‌టీఏ తెలిపింది.

'కావడి యాత్ర పేర్ల'పై సుప్రీం స్టే కొనసాగింపు

న్యూఢిల్లీ, జూలై 26: కావడియాత్ర మార్గంలో హోటళ్ల యజమానులు తమ పేర్లను, సిబ్బంది పేర్లను ప్రదర్శించాలంటూ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలపై ఇచ్చిన స్టే కొనసాగుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈనెల 22వ తేదీన ఈ అంశంలో సుప్రీంకోర్టు మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం విచారణ కొనసాగింది. హోటళ్ల యజమానులు ఎవరైనా స్వచ్ఛందంగా తమ పేర్లను ప్రదర్శించాలనుకుంటే ఆ పని చేయవచ్చని, కానీ, దీని కోసం ఎవరినీ బలవంతపెట్టవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వాలు, పిటిషన్‌దార్లు తమ వాదనలను సమర్పించాలని పేర్కొంటూ విచారణను ఆగస్టు 5వ తేదీకి వాయిదా వేసింది. కావడియాత్ర ఆగస్టు 6వ తేదీ వరకు కొనసాగనుంది.

కేరళ, బెంగాల్ గవర్నర్ల ఆఫీసులకు నోటీసులు

న్యూఢిల్లీ, జూలై 26: పలు బిల్లుల పెండింగ్ విషయమై కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల గవర్నర్ల కార్యాలయాలకు సుప్రీం కోర్టు శుక్రవారంనోటీసులు జారీ చేసింది. ఏ కారణం లేకుండా బిల్లులను గవర్నర్లు ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారంటూ ప్రతిపక్ష పాలిత కేరళ, బెంగాల్ ప్రభుత్వాలు వేసిన పిటిషన్లను సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం విచారించింది. ఈ వ్యవహారంలో కేంద్ర హోంశాఖతో పాటు ఆయా రాష్ట్రాల గవర్నర్ల కార్యదర్శులకు కూడా నోటీసులు జారీ చేసింది. విచారణలో ఇరు రాష్ట్రాల తరపు న్యాయవాదులు వాదిస్తూ.. 'శాసనసభలు ఆమోదించిన పలు బిల్లులను గవర్నర్లు కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉంచారు. ఇందుకు కారణాలు కూడా వెల్లడించడం లేదు' అని అన్నారు. దీనిపై స్పందించిన కోర్టు.. మూడు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలంటూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

'సంవిధాన్ హత్యా దివస్'పై 'పిల్' తిరస్కరణ

న్యూఢిల్లీ, జూలై 26: దేశంలో ఎమర్జెన్సీని విధించిన 1975 జూలై 25వ తేదీని సంవిధాన్ హత్యా దివస్‌గా పాటించాలంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన 'పిల్'ను శుక్రవారం ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. న్యాయవాది సమీర్ మాలిక్ ఈ పిల్‌ను దాఖలు చేశారు. రాజ్యాంగంలోని 352వ అధికరణం ప్రకారమే అత్యవసర పరిస్థితిని విధించారని గుర్తు చేశారు. 77వ అధికరణం ప్రకారం ప్రభుత్వ కార్యకలాపాలన్నీ రాష్ట్రపతి పేరునే జరుగుతాయని, దానిని విస్మరించి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని ఆరోపించారు. రాజ్యాంగం అన్నది సజీవ పత్రమని, దాన్ని హత్య చేశారనడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ చట్టం ప్రకారం ఇది నేరమని వాదించారు. అయితే, ప్రభుత్వం జూలై 12న జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఎమర్జెన్సీ విధింపును తప్పుపట్టలేదని తెలిపింది. ఆ పేరుతో జరిగిన అధికార దుర్వినియోగం, అకృత్యాలను మాత్రమే వ్యతిరేకించిందని పేర్కొంది.

దేశంలో 5 కోట్ల పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ, జూలై 26: దేశవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో 5 కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఓ లిఖితపూర్వక సమాధానం ద్వారా లోక్‌సభకు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 1.18 కోట్ల కేసులు, సుప్రీంకోర్టులో 84,045 కేసులు, వివిధ హైకోర్టుల్లో 60,11,678 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. తగినన్ని మౌలిక వసతులు, తగినంత మంది సిబ్బంది లేకపోవడం కూడా ఇందుకు కారణాలని తెలిపారు. సంక్లిష్టమైన అంశాల కారణంగా మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. నిబంధనలను కచ్చితంగా అమలు పరచడం వల్ల కూడా ఇంకొన్ని పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు.

ప్రచారం కోసమే నాపై పరువు నష్టం కేసు: రాహుల్


సుల్తాన్‌పూర్‌లో ఓ చెప్పుల షాపులో రాహుల్

సుల్తాన్‌పూర్ (యూపీ), జూలై 26: పరువు నష్టం కేసులో విచారణ నిమిత్తం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం సుల్తాన్‌పూర్‌లోని ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ప్రస్తుత కేంద్ర హోం మంత్రి, అప్పటి బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ 2018లో రాహుల్‌పై స్థానిక బీజేపీ నాయకుడు విజయ్ మిశ్ర ఈ దావా వేశారు. ప్రత్యేక జడ్జి శుభం వర్మ ముందు హాజరైన రాహుల్ తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. ఎవరినీ కించపరిచేలా తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. చౌకబారు ప్రచారం కోసమే ఈ దావా వేశారని ఆరోపించారు. వాదనలు విన్న జడ్జి తదుపరి విచారణను వచ్చే నెల 12కు వాయిదా వేశారు. కోర్టు నుంచి తిరిగి లఖ్‌నవూ వెళ్తూ దారిలో ఓ చెప్పులు కుట్టే షాపు దగ్గర రాహుల్ ఆగారు. షాపు యజమాని రాం చేట్ రాహుల్‌కు కూల్‌డ్రింక్ ఇచ్చారు. రాహుల్ అక్కడ అరగంట సేపు ఉన్నారు. కాగా, విపక్ష నేత రాహుల్‌గాంధీకి ఢిల్లీలోని సునేహ్రీబాగ్ మార్గంలో 5వ నంబరు బంగ్లాను లోక్‌సభ హౌస్ కమిటీ కేటాయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గతేడాది ఎంపీగా అనర్హత వేటు పడిన సమయంలో రాహుల్ తుగ్లక్ లేన్‌లోని తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన సంగతి తెలిసిందే.

గూగుల్‌కు పోటీగా.. ఓపెన్ ఏఐ 'సెర్చ్ జీపీటీ'

న్యూయార్క్, జూలై 26: సెర్చింజన్ అనగానే ప్రపంచంలో 99.9 శాతం మందికి మొదట గుర్తొచ్చే పేరు.. గూగుల్! ఈ విషయంలో గూగుల్‌ది ఏకచ్ఛత్రాధిపత్యమే!! దాని ధాటికి మైక్రోసాఫ్ట్ కూడా తట్టుకోలేకపోయింది. బింగ్, యాహూ, డక్‌డక్‌గో వంటి సెర్చింజన్లు చాలానే ఉన్నా అత్యధికులు వాడేది గూగుల్‌నే. కానీ.. ఇప్పుడు దానికో సవాల్ ఎదురవుతోంది. చాట్‌జీపీటీ పేరుతో కృత్రిమ మేధను సామాన్యులకూ అందుబాటులోకి తెచ్చిన ఓపెన్ ఏఐ సంస్థ గూగుల్‌కు పోటీగా అత్యంత శక్తిమంతమైన కృత్రిమ మేధ సెర్చింజన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమైంది. దాని పేరు.. సెర్చ్ జీపీటీ. ప్రస్తుతానికి ఇది టెస్టింగ్ దశలో ఉంది. ఈ సెర్చింజన్.. ఓపెన్‌ఏఐ ఇప్పటికే రూపొందించిన చాట్‌జీపీటీకి, చాట్‌బాట్‌కు అనుసంధానమై పనిచేస్తుందని సమాచారం.

ఆరెస్సెస్‌లో ఉద్యోగులు చేరకుండా నిషేధించడం తప్పే

» మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్య

ఇండోర్, జూలై 26: అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతలు పొందిన ఆరెస్సెస్‌లాంటి సంస్థలను నిషేధ సంస్థల జాబితాలో పెట్టడం తప్పిదమని గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వానికి యాభై ఏళ్లు పట్టిందని మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ఉద్యోగులు చేరకూడని సంస్థల జాబితాలో ఆరెస్సెస్ పేరును తప్పుగా పొందుపరిచిందని తెలిపింది. ఆరెస్సెస్ కార్యకలాపాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడాన్ని నిషేధిస్తున్న సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్-1964, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పలు ఆఫీస్ మెమొరాండంలను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని పరిష్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి పురుషోత్తం గుప్తా దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై తీర్పు వెలువరించింది. ఆరెస్సెస్‌లో ప్రభుత్వ ఉద్యోగులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ఈ నెల 9న జారీచేసిన మెమోను అధికారిక వెబ్‌సైట్‌లో ప్రముఖంగా ప్రచురించాలని కేంద్ర హోంశాఖ, సిబ్బంది-శిక్షణ శాఖలను ఆదేశించింది.

ఉగ్ర కలకలం.. జమ్మూలో హైఅలెర్ట్

న్యూఢిల్లీ, జూలై 26 : జమ్మూ ప్రాంతంలో భారత సైన్యం హైఅలెర్ట్ ప్రకటించింది. పంజాబ్, పఠాన్‌కోట్ జిల్లాలోని ఫంగోల్తీ గ్రామంలో ఏడుగురు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం సంచరించారు. దీనిపై అక్కడి ప్రజలు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన పంజాబ్ పోలీసులు, ఆర్మీ.. పఠాన్‌కోట్ పరిసర ప్రాంతాల్లో భారీ గాలింపు ఆపరేషన్ చేపట్టాయి. అలాగే, జమ్మూ ప్రాంతంలో భద్రతను పెంచారు. ఉగ్రదాడి ముప్పు నేపథ్యంలో ఆర్మీ స్థావరాలు, కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జమ్మూలోని బడులకు శనివారం వరకు సెలవులు ప్రకటించారు.

నేడే నీతి ఆయోగ్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పథకాలను సమర్థంగా చేర్చడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రజల జీవన నాణ్యతను పెంచడం అవసరమని ఈ ఆధారపత్రంలో పేర్కొన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని మోదీ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు, ప్రత్యేక ఆహ్వానితులు, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్, సభ్యులు పాల్గొంటారు. అయితే.. విపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల సీఎంలు ఈ భేటీకి రాబోమని ప్రకటించారు. కాగా, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వెళ్తారా? వెళ్లరా? అనే దానిపై అనిశ్చితి నెలకొంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని విభజించాలంటూ ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ సుకాంత్ మజుందార్ ప్రధాని మోదీకి ప్రతిపాదన చేసిన నేపథ్యంలో ఆ రాష్ట్ర సీఎం మమత, టీఎంసీ కీలక నేత డెరెక్ ఒబ్రెయిన్ మాత్రం నీతి ఆయోగ్ భేటీకి హాజరు కానున్నారు. బెంగాల్ విభజనపై నీతిఆయోగ్ సమావేశంలో ప్రస్తావిస్తానని.. దాన్ని ప్రతిఘటిస్తానని మమత ప్రకటించారు. భేటీలో పాల్గొనేందుకు శుక్రవారం ఢిల్లీకి చేరుకున్న మమత.. మీడియాతో మాట్లాడారు. నీతి ఆయోగ్‌ను రద్దు చేసి, ప్రణాళికా సంఘాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



'బెంగాల్ విభజన'పై రాజకీయ రగడ

పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర భాగాన్ని ఈశాన్య రాష్ట్రాల్లో కలపాలంటూ బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సుకాంత్ మజుందార్ ప్రధాని మోదీకి ప్రతిపాదన చేయడం రాజకీయంగా కలకలం రేపుతోంది. ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి కూడా అయిన మజుందార్.. ఉత్తర బెంగాల్‌ను ఈశాన్య భారతంలో కలిపితే కేంద్రం నుంచి అధిక నిధులు వస్తాయని, అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికీ అభ్యంతరం ఉంటుందని తాను భావించడం లేదన్నారు. తన ప్రతిపాదనపై మోదీ దృష్టిసారిస్తారని భావిస్తున్నట్లు చెప్పారు. ఢిల్లీ నుంచి ఈ మేరకు ఆయన వీడియో ప్రకటన విడుదల చేశారు. అయితే, మజుందార్ సూచనపై బెంగాల్ సీఎం మమత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్ విభజన అంటే దేశ విభజనే అని మండిపడ్డారు. కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు చేస్తున్న ఈ ప్రయత్నాలను శనివారం ప్రధాని ఆధ్వర్యంలో జరిగే నీతిఆయోగ్ సమావేశంలో నిలదీస్తానని తెలిపారు. ఒకవేళ పట్టించుకోకుంటే సమావేశం నుంచి వాకౌట్ చేస్తానని హెచ్చరించారు. "బడ్జెట్‌లో మా రాష్ట్రంపై ఆర్థిక వివక్ష చూపారు. ఇప్పుడు భౌగోళికంగానూ విభజన చేయాలని చూస్తున్నారు. పార్లమెంటు జరుగుతుండగానే కేంద్ర మంత్రి ప్రతిపాదన చేశారు. దీనిని సహించేది లేదు" అని మమత వ్యాఖ్యానించారు. కాగా.. ఉత్తర బెంగాల్‌లో బీజేపీకి పట్టు ఎక్కువ. ఇటీవలి ఎన్నికల్లో కూచ్‌బెహార్ తప్ప ఇక్కడి అన్ని ఎంపీ సీట్లనూ ఆ పార్టీనే గెలుచుకుంది. టీఎంసీకి మాత్రం దక్షిణ బెంగాల్‌లో గట్టి పట్టు ఉంది. అందుకే బీజేపీ 'ఉత్తర బెంగాల్' అంశాన్ని తెరపైకి తెస్తోందనే అభిప్రాయం వినిపిస్తోంది.

రైల్వే లెవల్ క్రాసింగ్ మధ్యలో స్కూల్ బస్సు

లోకో పైలెట్ అప్రమత్తతో 40 మంది విద్యార్థులకు తప్పిన ముప్పు

నాగ్‌పూర్, జూలై 26: స్థానికులు తక్షణం స్పందించడం, రైలు లోకో పైలెట్ సమయానికి బ్రేకులు వేయడంతో నాగ్‌పూర్‌లో ఓ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం త్రుటిలో ముప్పు తప్పింది. వారు ప్రయాణిస్తోన్న బస్సు రైల్వే లెవల్ క్రాసింగ్ మధ్యలో ఆగడమే ఇందుకు కారణం. నాగ్‌పూర్‌లోని ఓ లెవల్ క్రాసింగ్ దగ్గర గురువారం సాయంత్రం 4 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. రెడ్ సిగ్నల్ కనిపిస్తున్నా స్కూల్ బస్ డ్రైవర్ ఆపకుండా ముందుకు వెళ్లాడు. బస్సు రైలు పట్టాలపైకి వెళ్లాక రెండు వైపులా గేట్లు మూసుకున్నాయి. ఛింద్వారా నుంచి నాగ్‌పూర్‌లోని ఇట్వారి వెళుతోన్న ప్యాసింజర్ రైలు అప్పుడే వస్తోంది. చుట్టుపక్కల ఉన్న జనం తక్షణం స్పందించి రైలు పట్టాలపైకి చేరుకుని లోకో పైలెట్‌ను అప్రమత్తం చేసేందుకు ప్రయత్నించారు. రైలు పట్టాలపై చాలామంది జనం ఉండడం గమనించిన లోకోపైలెట్ అక్కడ ఏదో సమస్య ఉందని భావించి, బ్రేకులు వేసి సరిగ్గా లెవల్ క్రాసింగ్‌కు ముందు రైలును ఆపారు. ఆ వెంటనే స్కూల్ బస్సును పట్టాలపై నుంచి సురక్షితంగా పంపించారు.



సుందర్ పిచాయ్‌కు ఐఐటీ ఖరగ్‌పూర్ డాక్టరేట్

న్యూఢిల్లీ, జూలై 26: గూగుల్, ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. భారత్‌లోని ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఒకటైన ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ఆయన గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఐఐటీ ఖరగ్‌పూర్ డైరెక్టర్ వీకే తివారీ చేతుల మీదుగా ఆయన 'హానరరీ డాక్టర్ ఆఫ్ సైన్స్' పట్టాను అందుకున్నారు. కాగా, కెమికల్ ఇంజనీరింగ్‌లో సాధించిన విజయాలకు గానూ సుందర్ పిచాయ్ సతీమణి అంజలి పిచాయ్ కూడా విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డు అందుకున్నారు. ఈ విషయాన్ని సుందర్ పిచాయ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. 'నేను ఈ స్థాయికి చేరుకోవడానికి సహకరించిన నా పూర్వ సంస్థ ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ఈ గౌరవ డాక్టరేట్ అందుకోవడం ఆనందంగా ఉంది' అన్నారు.

కమలకు ఒబామా దంపతుల మద్దతు

» ఒక్క జూమ్ కాల్‌తో హారిస్‌కు రూ.16.74 కోట్ల విరాళాలు

» జూమ్ చరిత్రలోనే అతిపెద్ద గ్రూప్ కాల్‌గా రికార్డు



వాషింగ్టన్, జూలై 26: కమలా హ్యారిస్ అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఆయన సతీమణి మిషెల్ ఒబామా సమర్థించారు. దీనిపై వారు శుక్రవారం కమలకు ఫోన్ కాల్ చేసి మాట్లాడారు. 'మీకు మద్దతు ఇవ్వడానికి మేం ఎంతగానో గర్విస్తున్నాం. ఈ ఎన్నికల్లో మీరు గెలవడానికి చేయాల్సిందంతా చేస్తాం' అని కమలకు బరాక్ హామీ ఇచ్చారు. 'విఎమ్మల్ని చూసి గర్వపడుతున్నాం. ఇది చరిత్రాత్మకం కాబోతోంది' అంటూ మిషెల్ కూడా తన మద్దతు ప్రకటించారు. అందుకు హ్యారిస్ వారిద్దరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కాల్‌కు సంబంధించి దాదాపు ఒక నిమిషం నిడివి కలిగిన వీడియోను మిషెల్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. కమలను డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించిన తర్వాత ఆమె తరపున ప్రచార కార్యక్రమాల్లో కూడా బరాక్ ఒబామా పాల్గొనే అవకాశం ఉంది. మరోవైపు, కమలా హ్యారిస్‌కు డెమోక్రాటిక్ పార్టీ సభ్యులతో పాటు దాతలు, రాజకీయ నాయకుల నుంచి భారీ మద్దతు లభిస్తోంది. ఇప్పుడు పార్టీలో కీలక నేత ఒబామా మద్దతు సైతం లభించడం నిధుల సమీకరణకు దోహదపడనుంది. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని సాధించే దిశగా కమలా హారిస్ దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఆమె ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. గురువారం రాత్రి కమల కోసం నిర్వహించిన ఓ జూమ్ కాల్‌లో ఏకంగా 1,64,000 మంది మహిళలు పాల్గొని, విరాళాలతో హోరెత్తించారు. 90 నిమిషాల పాటు సాగిన ఈ జూమ్ కాల్‌లో ఏకంగా రూ.16.74 కోట్లకు పైగా విరాళాలు అందాయి. 'వైట్ ఉమెన్: ఆన్సర్ ద కాల్' పేరిట కమలకు మద్దతుగా నిర్వహించిన ఈ కార్యక్రమం జూమ్ చరిత్రలోనే అతి పెద్ద గ్రూప్ కాల్‌గా రికార్డు సృష్టించింది. జూమ్ మీటింగ్ ప్రారంభం కాగానే విపరీతమైన స్పందన వచ్చింది. సభ్యుల సంఖ్య పెరుగుతూ పోవడంతో కొద్దిసేపు సర్వర్ క్రాష్ అయింది. కాగా, కమలకు పిల్లలు లేరంటూ జేడీ వాన్స్ గతంలో చేసిన వ్యాఖ్యలపై ఆమె సవతి కుమార్తె ఎల్లా ఎంహాఫ్ తాజాగా స్పందించారు. మేమంతా ఉండగా ఆమె పిల్లలు లేనివారు ఎలా అవుతారని నిలదీశారు.

2034 నాటికి ఉద్యోగాల తీరే మారిపోతుంది!

» సంప్రదాయ పనివేళలు ఉండవు

» లింక్డిన్ సహ వ్యవస్థాపకుడు హాఫ్‌మన్



వాషింగ్టన్, జూలై 26: మరో పదేళ్లలో.. 2034 నాటికి సంప్రదాయ పని వేళలు (ఉదయం 9 నుంచి సాయంత్రం 5 తరహా) ఉండవని.. ఉద్యోగాలు, పనివేళలు పూర్తిగా మారిపోతాయని ప్రఖ్యాత ఆన్‌లైన్ సేవల సంస్థ లింక్‌డిన్ సహ వ్యవస్థాపకుడు రీడ్ హాఫ్‌మన్ అంచనా వేశారు. కృత్రిమే మేధో (ఏఐ) రంగంలో చోటు చేసుకునే మార్పులతో గిగ్ ఎకానమీ అనూహ్యంగా విస్తరిస్తుందని పేర్కొన్నారు. వ్యక్తులు డిమాండ్‌కు అనుగుణంగా అప్పటికప్పుడు సేవలు అందించి డబ్బులు సంపాదించుకోవటం, శాశ్వత ఉద్యోగాలనే భావన మటుమాయం కావటం గిగ్ ఎకానమీ లక్షణాలు. ఈ తరహా ఆర్థిక వ్యవస్థ విస్తరించి, వ్యక్తులు ఒకే రంగానికి పరిమితం కాకుండా వేర్వేరు రంగాలలో తమకు నచ్చిన పనులు (ఉద్యోగాలు) చేస్తుంటారని, కాబట్టి, ఆఫీసుకు వెళ్లటం, ఓ నిర్దిష్ట సమయంలో పని చేయటం అనే పరిస్థితులు క్రమంగా అంతరించిపోతాయని హాఫ్‌మన్ పేర్కొన్నారు.

ఐటీ రిటర్న్స్‌కు లంచం డిమాండ్ సీనియర్ ట్యాక్స్ అసిస్టెంట్‌పై సీబీఐ కేసు

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఆదాయపు పన్ను(ఐటీ) రిటర్న్స్‌కు లంచం తీసుకున్న ఆరోపణలపై సీనియర్ ట్యాక్స్ అసిస్టెంట్ ఖమర్ ఔలం ఖాన్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. మియాపూర్‌కు చెందిన ఆనంద్ రామస్వామి ఈ ఫిర్యాదు చేశారు. తాను కొన్ని సంవత్సరాలుగా ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తున్నానని, ఇటీవల తన పాత ఐటీ రిటర్న్స్ పరిశీలనకు సంబంధించి సీనియర్ ట్యాక్స్ అసిస్టెంట్ ఖాన్ తనకు ఫోన్ చేశారని సీబీఐకి ఇచ్చిన ఫిర్యాదులో ఆనంద్ పేర్కొన్నారు. ఐటీ రిటర్న్స్‌కు సంబంధించిన అన్ని పత్రాలు చూపించినా.. రూ.15 వేలు లంచం తీసుకున్నారని తెలిపారు. తర్వాత కూడా ఆ అధికారి తనను ఇబ్బందులకు గురిచేశారని రూ.6 లక్షలు ఇవ్వకపోతే పాన్ కార్డు, బ్యాంకు ఖాతా బ్లాక్ చేస్తానని బెదిరించారని వెల్లడించారు. దీనిపై పీఎంవోతోపాటు హోం మంత్రిత్వ శాఖ, ఆర్థిక శాఖ, ఐటీ విభాగం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని అధికారులకు వివరించారు. కాగా, తెలంగాణలో సీబీఐపై నిషేధం ఉన్న నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు విషయంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వం జీవో జారీ చేసింది.

కోల్‌బెల్ట్‌లో ఈఎస్ఐ ఆస్పత్రులు పెట్టండి

- ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్‌కు సింగరేణి సీఎండీ వినతి

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబసభ్యుల కోసం ఈఎస్ఐ ఆస్పత్రుల ఏర్పాటు చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కోరారు. ఈ మేరకు ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్ కమల్ కిషోర్ సోన్‌ను న్యూఢిల్లీలో గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. తొలుత కొత్తగూడెం, సింగరేణి థర్మల్ ప్లాంట్‌లో ఈఎస్ఐ ఆస్పత్రులు ప్రారంభించాలని కోరారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను సింగరేణి తరఫున కల్పిస్తామని చెప్పారు. ఇందుకు స్పందించిన ఈఎస్ఐ డీజీ.. తొలుత ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఏర్పాటు చేసి, వాటిని క్రమంగా ఆస్పత్రులుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఈఎస్ఐ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు.

పాఠశాలల్లో పారిశుధ్య పనులకు మహిళా గ్రూపుల వారిని నియమించాలి

- పీఆర్టీయూటీఎస్

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేయడానికి మహిళా గ్రూపుల నుంచి ఒకరిని నియమించి వారికి సరైన గౌరవ వేతనం ఇవ్వాలని పీఆర్టీయూటీఎస్ డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పీఆర్టీయూ నేతలు శుక్రవారం సమావేశమయ్యారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, కూర రఘోత్తం రెడ్డి, పీఆర్టీయూటీఎస్ నాయకులు శ్రీపాల్ రెడ్డి, కమలాకర్ రావు కలిసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీవో 317 వల్ల ఏర్పడిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. కేజీబీవీ, ఎస్ఎస్ఏ సిబ్బందికి మినిమం టైం స్కేల్ ఉత్తర్వులు విడుదల చేయాలని, పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని కోరారు.

కృష్ణమ్మ బిరబిరా.. శ్రీశైలం కళకళ!

సగానికి పైగా నిండిన ప్రాజెక్టు.. 2.58 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. అల్మట్టి నుంచి 3లక్షల క్యూసెక్కులు

- కాళేశ్వరం వద్ద 13 మీటర్ల ఎత్తులో గోదావరి
- భద్రాచలం వద్ద 48.6 అడుగుల ఎత్తులో ప్రవాహం
- పలుచోట్ల వర్షాలు.. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లిలో 7.4 సెం.మీ


ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండల పరిధిలోని ముంపు గ్రామాల ప్రజల కోసం పడవ మీద కూరగాయలను తరలిస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కృష్ణా పరిధిలో ఎగువన వర్షాలు, వరదలతో నది పరిధిలోని ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగుతోంది. కొన్ని రోజులుగా ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టుల నుంచి వరద వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టుకు జలకళ వచ్చేసింది. ఇప్పటికే ప్రాజెక్టు సగానికి పైగా నిండింది. పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 109.01 టీఎంసీల నీరు ఉంది. శ్రీశైలంలోకి ప్రస్తుతం 2.58 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది జలవిద్యుతత్తు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేస్తూ- 45 వేల క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. ఫలితంగా సాగర్‌కు వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 6,500 క్యూసెక్కుల వరద వస్తోంది. అంతే నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర జలాశయం నిండుకుండలా మారింది. 105.79 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 101.73 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయానికి 98392 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... 98,360 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండటంతో గోదావరి పరిధిలో వరద కొంత తగ్గినా మళ్లీ ఉధృతమైంది. కాళేశ్వరం వద్ద గోదావరి 13 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. ప్రాణహిత, ఇంద్రావతి నదులకు భారీగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మేడిగడ్డ బ్యారేజీకి 9.89 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, సమ్మక్క సాగర్ బ్యారేజీకి 10.74 లక్షల క్యూసెక్కులు, సీతమ్మసాగర్(దుమ్ముగూడెం)కు 11 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 47.8 అడుగుల ఎత్తులో ప్రవాహం సాయంత్రానికి 48.6 అడుగుల ఎత్తుకు చేరింది. ఫలితంగా మరోసారి రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

ప్రాజెక్టు	పూర్తిస్థాయి సామర్థ్యం	ప్రస్తుత సామర్థ్యం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
అల్మట్టి	129.72	84.54	2,10,000	3,00,000
నారాయణపూర్	37.64	31.06	2,61,397	2,65,360
తుంగభద్ర	100.86	101.73	98,392	98,360
జూరాల	9.66	6.81	2,49,000	2,54,127
శ్రీశైలం	215.81	109.01	2,58,069	45,236
నాగార్జునసాగర్	312.05	124.16	6,500	6,500
సింగూరు	29.91	13.96	1,120	0
శ్రీరాంసాగర్	80.5	28.69	25,150	581
కడెం	7.6	5.83	3,125	4,657
ఎల్లంపల్లి	20.18	16.29	16,682	331
మేడిగడ్డ	16.17	6.07	9,89,600	9,89,600
సమ్మక్క	6.94	6.94	10,74,200	10,74,200
సీతమ్మ	36.57	0.2	11,00,742	11,00,742

(టీఎంసీలు) (క్యూసెక్కులు)

ఆసిఫాబాద్‌లో జలదిగ్బంధంలో 12 గ్రామాలు

ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోండటంతో ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలోని తలాయి-పాపన్నపేట, కుశ్నపల్లి-సోమిని గ్రామాల మధ్య వంతెనలపై వరద నీరు ప్రవహిస్తోంది. ఫలితంగా ఆ పరిధిలో 12 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నాటు పడవల మీద దాటుతూ ప్రజలు నిత్యావసర సరుకులు తెచ్చుకుంటున్నారు. బ్యాక్‌వాటర్ పోటెత్తడంతో పత్తి, వరి తదితర పంటలు నీట మునిగాయి. ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కల్లెగ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కల్లెగాం జలపాతం కనువిందు చూస్తోంది. ప్రవాహాన్ని తిలకించేందుకు సందర్శకులు విచ్చేస్తున్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు పడ్డాయి. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లిలో 7.4 సెం.మీ, మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో 4.4 సెం.మీ, పెద్దపల్లి జిల్లా మంథనిలో 3.2 సెం.మీ, నిజామాబాద్ జిల్లా బాల్కొండలో 2.5 సెం.మీ, కామారెడ్డి జిల్లా డొంగ్లిలో 2.2 సెం.మీ, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 2.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం గుట్టపై ఉన్న డార్మిటరీ హాలు గోడలు, పిల్లర్ల జాయింట్ల నుంచి వర్షపు నీరు కారుతుండటంతో హాల్లో కూర్చునేందుకు భక్తులకు ఇబ్బందులెదురవుతున్నాయి.

‘టైమ్’ జాబితాలో మన ‘మనం చాక్లెట్’

- వరల్డ్స్‌గ్రేటెస్ట్ ప్లేసెస్ చిట్టాలో స్థానం
- దేశం నుంచి ఎంపికైన రెండింటిలో ఒకటి
- పశ్చిమ గోదావరిలో పండించిన కోకోతో హైదరాబాద్‌లో చాక్లెట్లు






హైదరాబాద్ సిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): "స్విస్ చాక్లెట్ లేదంటే బెల్జియన్ చాక్లెట్స్ మాత్రమే అత్యుత్తమం" అని చాలామంది అనుకుంటారు! కానీ.. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా రైతులు పండించిన కోకోతో ప్రపంచం మెచ్చే చాక్లెట్‌లను రూపొందించి సంచలనం సృష్టించిన హైదరాబాదీ 'మనం చాక్లెట్స్' సంస్థ ఇప్పుడు అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. సుప్రసిద్ధ టైమ్ మ్యాగజైన్ విడుదల చేసిన వార్షిక 'వరల్డ్స్ గ్రేటెస్ట్ ప్లేసెస్' జాబితాలో స్థానం సంపాదించుకుంది. 'మనం చాక్లెట్'తో పాటు భారతదేశం నుంచి ఈ ఏడాది ఈ జాబితాలో చోటు సాధించింది.. హిమాచల్‌ప్రదేశ్‌లోని 'నార్ రెస్టారెంట్' మాత్రమే కావడం విశేషం. వివిధ రంగాలలో తమదైన ప్రత్యేకతను చాటుతూ వైవిధ్యంగా నిలిచిన హోటల్స్, క్రూయిజెస్, రెస్టారెంట్లు, ఆకర్షణలు, మ్యూజియంలు, పార్కుల వంటి వాటితో ఈ జాబితాను టైమ్ మ్యాగజైన్ ఏటా విడుదల చేస్తుంటుంది. అలా ఈ ఏడాది చూడాల్సిన 100 అసాధారణ ప్రాంతాలలో ఒకటిగా బంజారాహిల్స్‌లోని మనం చాక్లెట్ ఖార్ఖానాను పేర్కొంది. చాక్లెట్ ప్రేమికుల స్వర్గధామంగా పేరొందిన ఈ ఖార్ఖానాలో.. చాక్లెట్ రుచులను ఆస్వాదించడంతో పాటుగా కోకో గింజలను చాక్లెట్‌గా మార్చేప్ర క్రియ మొత్తాన్నీ ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. రకరకాల రుచుల చాక్లెట్లను ఆస్వాదించవచ్చు. వాటిని తయారుచేసే సిబ్బందితో మాట్లాడవచ్చు. కోకో, చాక్లెట్ గురించి తెలియని విషయాలెన్నో ఇక్కడ తెలుసుకోవచ్చన్నది రెగ్యులర్‌గా ఈ సెంటర్‌కు వెళ్లేవారి మాట. ఇక్కడ దాదాపు 50కి పైగా విభాగాలలో 300కు పైగా రకాల చాక్లెట్‌లు ఉంటాయని 'మనం చాక్లెట్' వ్యవస్థాపకుడు చైతన్య ముప్పాల తెలిపారు. "ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చాక్లెట్ అండ్ కోకో టెస్టింగ్" నుంచి చాక్లెట్ టెస్టింగ్‌లో లెవల్ 1, 2 3 సర్టిఫికెట్లను పొందిన ఆయన.. ఇండియాలో ఏకైక లెవల్ 3 సర్టిఫైడ్ చాక్లెట్ టేస్టర్‌గా గుర్తింపు పొందారు. క్రాఫ్ట్ చాక్లెట్ అనుభవాలను భారతీయులకు అందించాలనే లక్ష్యంతో గత సంవత్సరమే 'మనం చాక్లెట్'ను ప్రారంభించామని చైతన్య చెప్పారు. ఇప్పుడు తమకు ఈ గౌరవం దక్కడం ఆనందం కలిగిస్తోందని పేర్కొన్నారు. కాగా.. యూకేకు చెందిన అకాడమీ ఆఫ్ చాక్లెట్ అవార్డులలో ఒక గోల్డ్, 10 సిల్వర్, 5 కాంస్య పతకాలతో సహా 17 అవార్డులను ఈ బ్రాండ్ గత ఏడాది అందుకోవడం మరో విశేషం. అంతేకాదు బ్రాండ్ ఎక్స్‌పీరియన్స్ విభాగంలో ఓవరాల్ విన్నర్‌గా కూడా 'మనం చాక్లెట్' నిలిచింది.

నకిలీ పురుగు మందుల కట్టడికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?

- కేంద్రంతో పాటు రాష్ట్ర సర్కారుకు హైకోర్టు నోటీసులు..
- మానసిక ఆరోగ్య కేంద్రాలపైనా వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు



హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నకిలీ పురుగుమందులను అరికట్టకపోతే ప్రజారోగ్యానికి, పంట భూములకు తీవ్ర నష్టం జరుగుతుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. నకిలీ పురుగుమందులను కట్టడి చేసేందుకు ఏయే చర్యలు తీసుకుంటున్నారో వివరణ ఇవ్వాలంటూ కేంద్ర వ్యవసాయ శాఖ, ఆరోగ్య భద్రతా విభాగం, రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. సరైన వ్యవస్థ లేకపోవడంతో మార్కెట్‌ను నకిలీ పురుగుమందులు ముంచెత్తుతున్నాయని.. దీంతో రైతులు, ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పంట నష్టం, భూములు నిస్సారంగా మారడం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ బీరంగూడకు చెందిన వట్టెం రవికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'నిబంధనల మేరకు పురుగుమందుల్లో నకిలీలను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలి. నకిలీ పురుగుమందులపై రైతులు, ప్రజలకు అవగాహన కలిగేలా ప్రకటనలు జారీ చేయాలి. నాణ్యమైన, గుర్తింపు పొందిన పురుగుమందులు మాత్రమే రైతులకు చేరేలా క్యూఆర్ కోడ్‌లు కేటాయించడం.. సంయుక్త టాస్క్‌ఫోర్స్ లేదా కమిటీలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టేలా ఆదేశించాలి' అని పిటిషనర్ కోరారు. దీనిపై స్పందించిన కోర్టు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వివరణ కోరుతూ విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.

మానసిక ఆరోగ్య కేంద్రాలపైనా..

మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం-2017 మేరకు తెలంగాణలో రాష్ట్ర అథారిటీ, జిల్లా కమిటీల ఏర్పాటుతో పాటు మానసిక ఆరోగ్య చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ న్యాయవాది రాపోలు భాస్కర్ రాసిన లేఖను సుమోటోగా తీసుకొని హైకోర్టు విచారించింది. మానసిక ఆరోగ్య కేంద్రాలు, సౌకర్యాలపై పూర్తి వివరణ ఇవ్వాలంటూ కేంద్ర, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

దొంగలను పట్టించిన యూపీఐ చెల్లింపు

- మహిళ మెడలోంచి పుస్తెలతాడు కొట్టేసే యత్నం
- అంతకు ముందు ఆమె కిరాణంలో పేటీఎం పేమెంట్
- బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా ఇద్దరి అరెస్ట్

కొత్తూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కిరాణా దుకాణం నడుపుతున్న మహిళ మెడలోంచి పుస్తెలతాడు కొట్టేసేందుకు యత్నించి ఇద్దరు దొంగలు అడ్డంగా బుక్కయ్యారు. అంతకు ముందు ఆమె దుకాణంలో సిగరెట్లు కొని.. చేసిన పేటీఎం చెల్లింపు వారి వివరాలను బట్టబయలు చేసింది. రంగారెడ్డి జిల్లా కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడిచర్ల తండా గ్రామ పంచాయతీ ఖాజీగూడ తండాలో కేతావత్ మంజుల కిరాణా దుకాణం నడుపుతోంది. కేశంపేట మండలం రాళ్లగండి తండాకు చెందిన పవన్, వెంకటేశ్‌లు గురువారం మంజుల షాపు వద్దకు వచ్చి సిగరెట్లు, బిస్కెట్లు కొని.. పేటీఎం ద్వారా డబ్బులు చెల్లించారు. అనంతరం ఆమె మెడలో నుంచి పుస్తెలతాడును తెంపేందుకు యత్నించారు. ఆమె ప్రతిఘటించడంతో ఇద్దరూ పారిపోయారు. ఈ కేసులో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. మంజుల షాపులో పేటీఎం ద్వారా డబ్బులు చెల్లించిన విషయాన్ని గుర్తించారు. నిందితుడి ఖాతా ఆధారంగా చిరునామాను కనుగొన్నారు. శుక్రవారం రాళ్లగండి తండాలో ఆ ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు పవన్ గతంలో స్మార్ట్ ఫోన్‌లో గేమ్‌లు ఆడి డబ్బులు పోగొట్టుకున్నాడని, తిరిగి డబ్బులు సంపాదించేందుకు దొంగతనాన్ని ఎంచుకున్నాడని, ఇందుకు వెంకటేశ్ సహాయం కోరాడని పోలీసుల విచారణలో తేలింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి ఎప్పటికి?

గాజా సంక్షోభం విషయంలో ఇక ఎంతమాత్రం మౌనంగా ఉండలేననీ, అక్కడి దయనీయమైన పరిస్థితులను చూస్తూ ఊరుకోలేనని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ గురువారం వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ అమెరికన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఓ కఠినమైన, తీవ్రమైన ప్రసంగం చేసిన తరువాత, అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులతో భేటీ అయ్యారు. ఆయనతో చర్చల సందర్భంగా తాను వీలైనంతవెంటనే హమాస్‌తో కాల్పుల ఒప్పందానికి రావాల్సిందిగా సూచించానని, గాజాలో పెరుగుతున్న మరణాలపై ఆందోళన వ్యక్తంచేశానని కమల తెలియచేశారు. ఎట్టిపరిస్థితుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఖరారుచేసుకోవాలని గట్టిగా చెప్పానని ప్రకటించారు. నెతన్యాహూతో ఇలా చెప్పా, అలా అన్నా అంటూ ఆమె మీడియాముందు చేసిన వ్యాఖ్యలు నిజానికి ఆయనతో అన్నవాటికంటే తీవ్రంగా ఉన్నాయని కొందరు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా, గత తొమ్మిదినెలలుగా గాజాలో దయనీయమైన, అమానవీయమైన పరిస్థితులు చూస్తున్నామంటూ వాటి వర్ణనలు, వ్యాఖ్యలు తీవ్రంగా, లోతుగా ఉండటం విశేషం. డెమోక్రాటిక్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా ఆమె ఖరారుకావడం ఖాయమని ప్రచారం జరుగుతున్న తరుణంలో ఆమె వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఉంటుంది. హమాస్‌పై తమ పోరు కొనసాగుతుందని, దానిని పూర్తిగా తుడిచిపెట్టేవరకూ, తమకు తుదివిజయం లభించేవరకూ యుద్ధం ఆగదని అమెరికన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి నెతన్యాహూ ఎంతో ఆవేశంగా ప్రసంగించిన విషయం తెలిసిందే.

యుద్ధానికి వెంటనే ముగింపుపలకాలని నెతన్యాహూతో భేటీకి ముందు మీడియాతో మాట్లాడుతూ డోనాల్డ్ ట్రంప్ కూడా అన్నారు. కానీ, ట్రంప్ కంటే కమలాహారిస్ మాటలు నెతన్యాహూ ప్రభుత్వాన్ని ఎక్కువగా కలవరపెట్టినట్టుగా కనిపిస్తోంది. గాజాలో ఘోరాలు జరిగిపోతున్నాయని ఆమె అనడం వల్ల శత్రువుకు అమెరికా–ఇజ్రాయెల్ మధ్య దూరం పెరిగిన సందేశం వెడుతుందని, బందీల విడుదల వెనకడుగువేసే ప్రమాదం ఉన్నదని ఇజ్రాయెల్ వ్యాఖ్యానించింది. బైడెన్ ప్రభుత్వం అప్పుడప్పుడు ఇజ్రాయెల్‌ను తప్పుబడుతూ, హెచ్చరిస్తూ, మారణకాండమీద ఆందోళన వెలిబుచ్చుతూ దానికి అందించాల్సిన సాయాన్ని మాత్రం నిరంతరాయంగా అందిస్తున్న విషయం తెలిసిందే.

రేపు అమెరికాలో ఎవరు అధికారంలోకి వచ్చినా, ఇజ్రాయెల్ విషయంలో సమూలమైన విధానమార్పులు ఉంటాయన్న భ్రమలు అక్కరలేదు. నెతన్యాహూ అమెరికా ప్రయాణంలో ఉండగానే గాజాపట్టీ అన్నిదిక్కుల్లోనూ ఇజ్రాయెల్ దాడులుచేసింది. గతంలో అనేక రోజుల పాటు మారణహోమం సాగించి వదిలిపెట్టిన ఖాన్ యూనిస్ నగరంమీద ఇప్పుడు మళ్ళీ విరుచుకుపడుతోంది. గతంలో ఆస్పత్రులను సైతం ధ్వంసం చేసి, రోగులను సజీవంగా పాతిపెట్టిన ఈ నగరం మీద మరోమారు దాడిచేసి నలభైఎనిమిది గంటల్లోనే యాభైమందిని పొట్టనబెట్టుకుంది. హమాస్ ఉగ్రవాదులు కందకాల్లో దాక్కున్నారని, సాధారణ పౌరులతో కలగలసిపోయారని వాదిస్తూ సామాన్యులను ఊచకోతకోయడం ఇజ్రాయెల్ యథేచ్ఛగా కొనసాగిస్తున్నది. అమెరికా అండదండలు దండిగా ఉన్నందున అంతర్జాతీయ సంస్థలు, వేదికలకు అది వెరవడం లేదు. భద్రతామండలి తీర్మానాలంటే భయంలేదు. ఐక్యరాజ్యసమితి హెచ్చరించినప్పుడు, ఆవేదన వెలిబుచ్చినప్పుడు ఆ సంస్థ అధినేత ఉగ్రవాదులతో అంటకాగుతున్నారంటూ ఇజ్రాయెల్ అత్యంత కఠినమైన ప్రతివిమర్శలు చేస్తోంది. తనను ప్రశ్నించినవారంతా ప్రపంచశాంతికి శత్రువులు, ఉగ్రవాదానికి మిత్రులు అంటోంది. నలభైవేలమందిని చంపి, లక్షలమందిని తరిమివేసిన ఇజ్రాయెల్ వైఖరిని తప్పుబడుతూ, శరణార్థులు తలదాచుకున్న స్థావరాలమీద సైనికదాడులు ఆపాలని, ఆహారసరఫరాలను అనుమతించాలని అంతర్జాతీయ న్యాయస్థానం గతంలో వెలువరించిన తీర్పు కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దశాబ్దాలుగా పాలస్తీనాభూభాగాలను ఇజ్రాయెల్ ఆక్రమించుకొని ఉండటం చట్టవిరుద్ధం, దీనిని సాధ్యమైనంత వెంటనే సరిదిద్దాలి అంటూ అంతర్జాతీయ న్యాయస్థానం ఈనెల 19న వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ వీటిని బేఖాతరుచేయవచ్చునేమో కానీ, ప్రజాభిప్రాయం దానికి వ్యతిరేకంగా ఉన్నదనీ, గాజాదుస్థితిపట్ల ప్రపంచవ్యాప్తంగా సానుభూతి పెరుగుతున్నదని అన్ని దేశాలూ గుర్తించాలి. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఇజ్రాయెల్‌ను దారికి తేవాల్సిన బాధ్యత ఐక్యరాజ్యసమితిమీద ఉన్నది. ప్రతీ సభ్యదేశం ఆ కర్తవ్యంలో భాగస్వామి కావలసిందే.

దగాపడిన పేదలు, యువకులు

సాధారణ జీవితంలో చాలా మంది వ్యవహార రీతులు లావాదేవీల సంబంధితంగా ఉండడం కద్దు. ఇద్దరు వ్యక్తుల మధ్య రెండు మానవ బృందాల మధ్య లావాదేవీల సంబంధమేమిటి? 'నేను ఆశిస్తున్నది మీరు ఇస్తే లేదా చేస్తే మీరు కోరింది నేను ఇస్తాను' అనేదే ఆ బంధం. దీన్నే వ్యవహారికంలో 'క్విడ్ ప్రొ కో' (ప్రతిఫల సిద్ధాంతం) అంటారు. అధికారిక నిర్ణయాలకు ముడుపులు చెల్లించడం ఇటువంటి లావాదేవీల వ్యవహారమే. ప్రశ్నపత్రాల లీకేజీ కూడా అంతే. ఈ తరహా ప్రవర్తనారీతుల స్థాయిని మోదీ ప్రభుత్వం పెంచింది. వాటిని బాగా ప్రోత్సహించింది. ఎన్నికల బాండ్లు ఇందుకొక ఉదాహరణ. వీటిని ఎందుకు కొనుగోలు చేశారు? ప్రభుత్వం తమకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలకు, తీసుకుబోయే నిర్ణయాలకు ప్రతిఫలంగానే కాదూ? ఎన్నికల బాండ్ల అసలు లక్ష్యం అందరికీ తెలుసు. సుప్రీంకోర్టు ఆలస్యంగానే అయినప్పటికీ ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దుచేయడం పూర్తిగా సరైన చర్యే అనడంలో సందేహం లేదు. అయితే ప్రభుత్వం ఆ పథకాన్ని ప్రవేశపెట్టడం వెనుక ఉన్న ఉద్దేశాలపై వ్యాఖ్యానించడలో బాగా సంయమనం పాటించింది.

జూలై 23, 2024న ఎన్డీఏ ప్రభుత్వం ఈ లావాదేవీల ప్రవర్తనను మరింత పై స్థాయికి తీసుకువెళ్లింది 2024–25 వార్షిక బడ్జెట్‌కు ప్రధాన ప్రేరణ 'ప్రభుత్వాన్ని ఎలా కాపాడుకోవాలి' అన్న ఆరాటమే సుమా! అది కుర్సీ బచావో బడ్జెట్. ఆ బడ్జెట్ రూపకర్త ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. ఆమె ఆ విధిని ఎలాంటి విచారభావానికి లోను కాకుండా నిర్వర్తించారు. బడ్జెట్‌పై ఆర్థికమంత్రి, ఆమె మంత్రిత్వ శాఖ కార్యదర్శులు ఇచ్చిన వివరణలను గమనిస్తే ప్రభుత్వ మనుగడకు రెండు మిత్రపక్షాల మద్దతును సాధించుకోవడానికి చేసిన ప్రయత్నమే బడ్జెట్ ప్రతిపాదనలు అని స్పష్టమవుతుంది. మోదీ మూడో ప్రభుత్వం ఏర్పాటుకు 16 మంది సభ్యులు ఉన్న తెలుగుదేశం పార్టీ, 12 మంది సభ్యులు ఉన్న జనతాదళ్ (యునైటెడ్) పార్టీల మద్దతుకు ప్రతిఫలంగా మోదీ సర్కార్ బిహార్‌కు పారిశ్రామిక కేంద్రాలు, కనెక్టివిటీ ప్రాజెక్టులు, విద్యుత్కేంద్రాలను మంజూరు చేసింది. ఇక ఆంధ్రప్రదేశ్‌కేమో పోలవరం పారిశ్రామిక కారిడార్‌లు, విద్యుత్కేంద్రాలు, పోలవరం ప్రాజెక్టుకు, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు మంజూరు చేసేందుకు సర్కార్ సమ్మతించింది. బాహ్య ఆర్థిక సహాయాన్ని సత్వరమే సమకూర్చేందుకు లేదా 'ఏర్పాటు' చేస్తామనే వింత హామీ నొకదాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చారు. అయితే ఇదొక అసాధ్య హామీ.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

కేంద్ర ప్రభుత్వం, బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య క్విడ్ ప్రొ కొ మూలంగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసిన రాష్ట్రాలు భారీగా నష్టపోయాయి. ఆ రాష్ట్రాలు పశ్చిమబెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర పంజాబ్, ఢిల్లీ. ఆ రాష్ట్రాల నుంచి ఎంపికైన ఎంపీలు అందరూ, బీజేపీకి ఓటు వేయని కారణంగా ఎన్డీఏ ప్రభుత్వం తమ రాష్ట్రాలకు ఎన్నడూ లేని రీతిలో దగా చేసిందని ఆక్రోశించారు.

దేశ జనాభాలో అత్యధికుల శ్రేయస్సు విషయమై అసలు శ్రద్ధే చూపలేదు. ఈ నిర్లక్ష్య వైఖరి మూలంగా యువత బాగా నష్టపోయింది. నిరుద్యోగిత ప్రబలిపోతోంది. యువజనులు నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. అఖిల భారత స్థాయిలో నిరుద్యోగిత రేటు జూన్ 2024లో 9.2 శాతంగా ఉందని సిఎమ్ఐఈ వెల్లడించింది. పట్టభద్రులలో 40 శాతం మంది నిరుద్యోగులే. ఉద్యోగులుగా ఉన్న వారిలో కేవలం 20.9 శాతం మంది మాత్రమే క్రమబద్ధంగా వేతనాలు పొందుతున్నారని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వెల్లడించింది. పెద్దగా చదువు సంధ్యలు లేనివారిలో చాలా తక్కువ మంది మాత్రమే నిరుద్యోగులుగా ఉండడం ఒక విచిత్ర విశేషం.



యువజనులు, పేద ప్రజల చేతిలో ఓటు అనే ఒక శక్తిమంతమైన ఆయుధం– ఉందనే వాస్తవాన్ని ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి గుర్తుంచుకోవాలి. 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వారు ఒక తీవ్ర హెచ్చరిక చేశారు. ఇటీవలి 13 ఉప ఎన్నికలలో దేశ పాలక పక్షానికి ఒక చెంపపెట్టు లాంటి తీర్పు నిచ్చారు. ఈ సంవత్సరాంతంలోగా మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. జూలై 23, 2024న ఎన్డీఏ ప్రభుత్వం తమకు చేసిన దగాను యువజనులు, పేద ప్రజలు ఎట్టి పరిస్థితులలోను మరచిపోరు.

ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగం ఉద్యోగ కల్పనకు ప్రోత్సాహకాల పథకంపై హామీ ఇచ్చింది. ఈ పథకం ప్రకారం యాజమాన్యాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం ద్వారా 290 లక్షల మందికి ఉద్యోగకల్పనకు ప్రభుత్వం హామీ పడుతుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల మంది యువజనులకు నైపుణ్యాల శిక్షణ నిచ్చేందుకు, 500 కంపెనీలలో 1 కోటి మందికి ఇంటర్న్‌షిప్ (అనుభవం గడిచే ఉద్యోగం) సమకూర్చేందుకుగాను యాజమాన్యాలకు భారీ ఆర్థిక పోత్సాహకాలు ఇస్తామని ఆమె పేర్కొన్నారు. భారీగా ఉన్న ఈ అంకెలు అన్నీ మరో బ్రహ్మాండమైన ఎన్నికల అనంతర వంచనను సూచిస్తున్నాయి.

మరి కేంద్ర ప్రభుత్వంలోను, ప్రభుత్వ నియంత్రణ సంస్థలలోను 30 లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీ విషయమేమిటి? ఈ విషయాన్ని ఆర్థికమంత్రి గానీ, ప్రభుత్వంలోని వేరే వారు గాని అసలు ప్రస్తావించడమే లేదు. అలాగే ఉత్పాదకతను పెంచేందుకు ప్రోత్సాహకాలు ఇచ్చే పథకం కింద వేల కోట్ల రూపాయలు వ్యయం చేశారు. అయినా చెప్పుకోదగిన ఫలితాలే లేవు. ఎందుకని? సరే, విద్యా రుణాల రద్దు విషయమేమిటి? విద్యాభ్యాసం కోసం తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నానా అవస్థలు పడుతున్నారు. ఆ రుణాలను పూర్తిగానో, పాక్షికంగానో రద్దు చేయాలనే డిమాండ్ ఒకటి గట్టిగా ఉన్నది. దీనిపై ప్రభుత్వ నిర్ణయమేమిటో బడ్జెట్ వెల్లడించలేదు. ఒక సైనికుడికి, మరో సైనికుడికి మధ్య వివక్ష చూపుతున్న అగ్నిపథ్ పథకం భవిష్యత్తు విషయమై బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావనే లేదు.

యువజనులే కాదు, పేద ప్రజలు సైతం మోదీ ప్రభుత్వం తమను దగా చేసిందని భావిస్తున్నారు. దేశ జనాభాలో పేదలు 5 శాతం కంటే అధికంగా లేరని నీతి ఆయోగ్ సీఈఓ సెలవిచ్చారు. ఆ పెద్ద మనిషి అభిప్రాయంతో ఆర్థికమంత్రి కూడా ఏకీభవిస్తున్నట్టున్నారు ప్రభుత్వ కుటుంబ వినియోగ వ్యయ సర్వే దేశ ప్రజల నెలవారీ తలసరి వ్యయాన్ని ప్రస్తుత ధరల ప్రకారం లెక్క కట్టింది. నెలవారీ తలసరి వ్యయం గ్రామీణ ప్రాంతాలలో రూ.3,094 కాగా పట్టణ ప్రాంతాలలో రూ. 4,963గా ఉందని ఆ సర్వే వెల్లడించింది. అంటే 71 కోట్ల మంది భారతీయులు రోజుకు కేవలం రూ.100–150 వ్యయంతో జీవిస్తున్నారు. ఆ సర్వే వివరాలను మరింత నిశితంగా పరిశీలిస్తే మనం మరింత నైరాశ్యంలోకి జారిపోతాం. అట్టడుగున ఉన్న 20 శాతం మంది రోజుకు కేవలం రూ.70–100 వ్యయంతో జీవిస్తుండగా మరీ దిగువన ఉన్న 10 శాతం మంది కేవలం రూ.60–90 దినసరి వ్యయంతో బతుకులు ఈడుస్తున్నారు. వీరందరూ పేదలు కాదా? పేదలకు సహాయమందించేందుకు పలు మార్గాలు ఉన్నాయి. గ్రామీణ ఉపాధి హామీ పనులతో సహా అన్ని రకాల ఉద్యోగాలలోను కనీస దినసరి వేతనాన్ని రూ.400కి పెంచాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచితే విధిగా ఉపాధి కల్పించే కనీస పనిదినాల సంఖ్యను ఏడాదికి 50 నుంచి 100కు పెంచవచ్చు.

ఇతర పౌరులతో పాటు యువజనులు, పేద ప్రజల చేతిలో ఒక శక్తిమంతమైన ఆయుధం– ఓటు ఉందనే వాస్తవాన్ని ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి గుర్తుంచుకోవాలి. 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వారు ఒక తీవ్ర హెచ్చరిక చేశారు. వారే జూన్ 2024లో జరిగిన 13 ఉప ఎన్నికలలో దేశ పాలకపక్షానికి ఒక చెంపపెట్టు లాంటి తీర్పు నిచ్చారు. ఈ సంవత్సరాంతంలోగా మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది మరికొన్ని రాష్ట్రాలు కూడా అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్నాయి. జూలై 23, 2024న ఎన్డీఏ ప్రభుత్వం తమకు చేసిన దగాను యువజనులు, పేద ప్రజలు ఎట్టి పరిస్థితులలోను మరచిపోరు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

వయోవృద్ధుల అధికార లాలస

మాతృభూమితో పాటు నాకు బాగా తెలిసిన దేశం అమెరికా. నేను మొట్టమొదట ఆ దేశాన్ని 38 సంవత్సరాల క్రితం సందర్శించాను. ఆ తరువాత అనేక సార్లు ఆ దేశానికి వెళ్లాను. చివరిసారి అక్టోబర్ 2022లో వెళ్లాను. అమెరికా అధ్యక్షుడుగా జో బైడెన్ అప్పటికి ఇంకా రెండు సంవత్సరాలు కూడా పూర్తిచేసుకోలేదు. ఆ స్వల్పకాలిక పర్యటనలో మిత్రులతో జరిపిన సంభాషణలు, నా సొంత పరిశీలనల నుంచి అమెరికా అధ్యక్షుడు తన బాధ్యతలను సమర్థంగా, ప్రశస్తంగా నిర్వహిస్తున్నారని నాకు అవగతమయింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షత కాలంలో రగుల్కొన్న విభేదాలు, వైషమ్యాలను అమెరికా ప్రజలు అధిగమించేందుకు బైడెన్ విశేషంగా తోడ్పడ్డారనడంలో సందేహం లేదు. అయితే తన పైబడిన వయసు, ఆరోగ్య దుర్బలతల కారణంగా బైడెన్ రెండో సారి అధ్యక్ష పదవికి ఆరాటపడకుండా ఉంటే బాగుండేది.



ఏ విధంగానైనా అధికారంలో కొనసాగి తీరాలన్న ఆరాటం అమెరికా ప్రస్తుత అధ్యక్షుడి లక్షణం మాత్రమే కాదు. అధికారాన్ని, వృత్తిగత విజయాలను చవిచూసిన వ్యక్తుల స్వతస్సిద్ధ స్వభావమది. ఈ ధరిత్రిపై ప్రతి దేశంలోను అటువంటి వ్యక్తులు ఉన్నారు. భౌతిక, మానసిక సామర్థ్యాలు క్షీణిస్తున్నప్పటికీ, తమ బాధ్యతలను సమర్థంగా కాదుకదా, మామూలు స్థాయిలో కూడా నిర్వహించగలగడం అసాధ్యమని స్పష్టమవుతున్నప్పటికీ అధికార లాలస నుంచి బయటపడని నేతలు అన్ని దేశాలలోను ఉన్నారు. రాజకీయాలలోనేకాదు, ఇతర రంగాలలోను అటువంటి వ్యక్తులు ఉన్నారు. ఈ వాస్తవం మన దేశంలో క్రికెట్ అభిమానులకు బాగా తెలుసు. 35 ఏళ్ల వయసు దాటిన తరువాత క్రికెటర్లు గతంలో వలే ప్రశస్తంగా ఆడలేకపోవడం సహజం. అయితే ఈ వాస్తవాన్ని గుర్తించిన క్రికెటర్లు ఎంత మంది ఉన్నారు? ఇందుకొక మినహాయింపు సునీల్ గవాస్కర్ ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో ఉత్కృష్టంగా ఆడి టీమ్ ఇండియాకు విజయం సాధించిన తరువాత ఆయన క్రికెట్ నుంచి పూర్తిగా వైదొలిగారు.

వ్యాపార వాణిజ్య రంగాలలోనూ ప్రతిభావంతులైన యువ మేనేజర్లను ప్రోత్సహించడంలో తాత్సారం చేసే కార్పొరేట్ అధిపతులు చాలా మంది ఉన్నారు. పౌర సమాజ ఉద్యమాలలో పనిచేసేవారిలో కూడా తామే సుదీర్ఘకాలం ఉన్నతస్థాయి నాయకత్వంలో కొనసాగాలని అభిలషించేవారున్నారు. ఈ అవగుణానికి మేధో రంగమూ మినహాయింపు కాదు బొంబాయి నుంచి వెలువడే సామాజిక శాస్త్రాల పత్రిక ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (ఈపిడబ్ల్యు) విషయాన్నే చూడండి. ఒకప్పుడు ఈ జర్నల్‌కు అంతర్జాతీయంగా విశేష పేరు ప్రఖ్యాతులు ఉండేవి. సామాజికశాస్త్రాలలో పరిశోధన చేసే ప్రతి ఒక్కరూ ఆ జర్నల్‌ను చదవుతూ ఉండేవారు. యువ పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలు ఆ జర్నల్‌లో ప్రచురితం కావాలని ఆకాంక్షించేవారు. విద్యావేత్తలతో పాటు జర్నలిస్టులు, సివిల్ సర్వెంట్‌లు, ప్రజా ఉద్యమాల లోని క్రియాశీలురు కూడా ఈపిడబ్ల్యును తప్పక చదువుతుండేవారు. అయితే ఇటీవలి సంవత్సరాలలో ఆ జర్నల్ ప్రమాణాలు బాగా పడిపోయాయి. అందులో ప్రచురితమవుతున్న వ్యాసాలు, పరిశోధనా పత్రాలు గతంలో వలే కొత్త పథనిర్దేశం చేసేవిగా ఉండడం లేదు. ఒకప్పుడు మన దేశంలో సమున్నత మేధోచర్చలకు వేదికగా ఉన్న ఆ జర్నల్ ఇప్పుడు అంత ఉత్కృష్టంగా లేదు.

ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ప్రతిష్ఠ దిగజారిపోవడానికి ప్రధాన కారణం దానిని నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు (అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మాదిరిగా) జీవిత కాల సభ్యులు కావడమే. ట్రస్ట్ ప్రస్తుత సభ్యులలో అందరి కంటే చిన్న వ్యక్తి వయసు 69 ఏళ్లు కాగా పెద్దాయన వయసు 93 ఏళ్లు. ట్రస్ట్‌లోని పది మంది సభ్యులలో తొమ్మిది మంది పురుషులే. మొత్తం సభ్యుల సగటు వయసు ఇంచు మించు 80 ఏళ్లుగా ఉన్నది. మరి సామాజికశాస్త్రాలలో ఉత్కృష్ట పరిశోధనలు జరిగేది పరిశోధకులు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసులో ఉన్నప్పుడే కదా. జర్నల్‌ను నడిపేవారి, అందులో పరిశోధన పత్రాలు ప్రచురించే స్కాలర్ల సగటు వయసు మధ్య ఇంత వ్యత్యాసంతో ఈపిడబ్ల్యు తన ప్రతిష్ఠను పెంపొందించుకోవడం అటుంచి కనీసం నిలబెట్టుకోగలదా?

ఏ విధంగానైనా అధికారంలో కొనసాగి తీరాలన్న ఆరాటం అమెరికా ప్రస్తుత అధ్యక్షుడి లక్షణం మాత్రమే కాదు. ఈ ధరిత్రిపై ప్రతి దేశంలోను అటువంటి వ్యక్తులు ఉన్నారు. భౌతిక, మానసిక సామర్థ్యాలు క్షీణిస్తున్నప్పటికీ, బాధ్యతలను సాధారణస్థాయిలో కూడా నిర్వహించగలగడం అసాధ్యమని స్పష్టమవుతున్నప్పటికీ అధికార లాలస నుంచి బయటపడని వారు రాజకీయాలలోనేకాదు, ఇతర రంగాలలోనూ ఉన్నారు. స్వార్థపర స్వభావంతో కూడిన ఆ పెద్ద మనుషుల ప్రవర్తనకు ప్రతిభావంతులైన వారి జూనియర్ సహచరులతో పాటు యావత్ సమాజమూ అమితంగా నష్టపోతోంది.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఈపిడబ్ల్యు ప్రతిష్ఠ సన్నగిల్లడం స్వయంకృతమే. నాకు తెలిసిన మరో మేధో సంస్థ గాథ ఆ ప్రతిష్ఠాత్మక జర్నల్ చరిత్రకు పూర్తిగా భిన్నమైనది. బెంగళూరులోని నేషనల్ సెంటర్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్ (ఎన్‌సిబిఎస్) గురించి నేను ప్రస్తావిస్తున్నాను. ఈ ఉత్కృష్ట ఉన్నత విద్యా సంస్థ తొలుత టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టిఐఎఫ్ఆర్) విభాగంగా ప్రభవించింది. 1940లో బాంబేలో స్థాపితమైన టిఐఎఫ్ఆర్‌లో మొదటి పదిహేనేళ్లు భౌతిక, గణితశాస్త్రవేత్తల ప్రాబల్యముండేది. 1960వ దశకంలో ప్రతిభావంతుడైన యువశాస్త్రవేత్త ఒబైద్ సిద్ధిఖి ఆ సంస్థలో చేరారు. రెండు దశాబ్దాల పాటు టిఐఎఫ్ఆర్‌లో పనిచేసిన అనంతరం సిద్ధిఖి బాంబే నుంచి బెంగళూరుకు మారి అక్కడ ఒక కొత్త జీవశాస్త్ర పరిశోధనా సంస్థను నెలకొల్పారు. సామాజిక శాస్త్రవేత్తగా శిక్షణ పొందిన నాకు భారతీయ వైజ్ఞానిక ప్రపంచంతో కూడా చెప్పుకోదగిన పరిచయం ఉన్నది. మా నాన్నగారు, తాతగారితో సహా మా కుటుంబానికి చెందిన పలువురు శాస్త్రవేత్తలే.

ఎన్‌సిబిఎస్ గురించి ఒక విశేషాన్ని నేను తొట్ట తొలుత చెప్పదలుచుకున్న విశేషం: నాకు తెలిసిన మరే ఇతర భారతీయ ఉన్నత విద్యా సంస్థలో కంటే ఈ పరిశోధనా సంస్థలో అధికార క్రమం కనిష్ఠ స్థాయిలో ఉండడం. విద్యావ్యాసంగాలలో సమష్టి కృషి, దాపరికం లేని విస్తృత మేధో సంభాషణలు, అందరూ అరమరికలు లేకుండా పాల్గొనే మేధో సంవాదాలు అక్కడ జరుగుతాయి. సిఎస్ఐఆర్‌కు అనుబంధంగా ఉన్న 37 పరిశోధనా కేంద్రాలలో ఎన్‌సిబిఎస్‌లో ఉన్నటువంటి స్వేచ్ఛాయుత మేధో వాతావరణం చాలా వరకు లేదని చెప్పవచ్చు. ఐఐటిలలో సైతం అటువంటి స్ఫూర్తిదాయక మేధావరణం లేదు.

ఎన్‌సిబిఎస్‌లో అటువంటి ప్రజాస్వామిక, భాగస్వామ్య మేధో సంస్కృతికి ప్రధానకారకుడు ఒబైద్ సిద్ధిఖి అనడంలో సందేహం లేదు. ఆయన్ని నేను చాలా సన్నిహితంగా పరిశీలించాను. ఆయనతరం అగ్రశ్రేణి భారతీయ శాస్త్రవేత్తల వలే కాకుండా సిద్ధిఖి ఎటువంటి పటాటోపం లేని మనిషి. ఆత్మస్తుతి ఆయన స్వభావానికి పూర్తిగా విరుద్ధం. అధికార క్రమంపై సిద్ధిఖికి ఎటువంటి అనురక్తి లేదు. అందరినీ సమరీతిలో గౌరవించే ఉదాత్తుడు. యువ శాస్త్రవేత్తలు ఉత్కృష్ట పరిశోధనలు చేస్తున్నారని ఆయనకు బాగా తెలుసు వారి పరిశోధనలకు, ప్రతిభా పాటవాల వికాసానికి సానుకూల పరిస్థితులను కల్పించడమే తన విధ్యుక్తధర్మంగా సిద్ధిఖి భావించారు. ఏ ఒక్కరినీ తన మాదిరిగా రూపొందించాలని ఆయన కోరుకోలేదు. సిద్ధిఖికి శాస్త్ర జగత్తు వెలుపల కూడా విశాల మేధో ఆసక్తులు ఉన్నయి. తత్వశాస్త్ర కోవిదులు, చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలతో భావాల వినిమయం చేసుకోవాడానికి ఆయన సదా ప్రయత్నించేవారు.

ఎన్‌సిబిఎస్ డైరెక్టర్‌గా తన పదవీ కాలం ముగిసిన తరువాత తాను స్థాపించిన ఆ సంస్థనే అంటి పెట్టుకుని ఉండిపోవాలని సిద్ధిఖి కోరుకోలేదు. అటువంటి ఉన్నత స్థానాలలో ఉన్న ఇతర భారతీయ శాస్త్రవేత్తలలో అత్యధికులు అలా చేసినవారు, చేసేవారే. ఎన్‌సిబిఎస్ నిర్వహణా బాధ్యతలను తన యువ సహచరుడికి వదిలివేసి, విద్యా వినమ్రతతో సిద్ధిఖి తన పరిశోధనా వ్యాసంగంలో నిమగ్నమయ్యారు. సిద్ధిఖి స్థానంలో ఎన్‌సిబిఎస్ డైరెక్టర్ అయిన శాస్త్రవేత్త కూడా తన పదవీ విరమణ అనంతరం ప్రతిభావంతుడైన సహచర యువ శాస్త్రవేత్తకు ఆ బాధ్యతలను అప్పగించారు. ఈ మూడో డైరెక్టర్ సైతం సిద్ధిఖి స్ఫూర్తితో నాలుగో డైరెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ నాలుగో డైరెక్టర్ ఎన్‌సిబిఎస్ డైరెక్టర్ కాక ముందు ఆ సంస్థతో ఎటువంటి సంబంధం లేని శాస్త్రవేత్త. అయితే ఆయన కొత్త భావాలు, సమున్నత భిన్నానుభవాలను తనతో తీసుకొచ్చి ఎన్‌సిబిఎస్ ప్రతిష్ఠను మరింతగా పెంచారు.


ఒబైద్ సిద్ధిఖి ఒక అపూర్వ భారతీయ పరుషుడు కాక పోయి ఉంటే ఎన్‌సిబిఎస్ అలా సమున్నతంగా వర్ధిల్లేది కాదు ఆ సంస్థ శాశ్వత విజయానికి మరో కారణం అది అంగీకరించి, అనుసరించిన నిర్వహణ పద్ధతులు. డైరెక్టర్ రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తాడు. డైరెక్టర్‌కు మార్గదర్శకత్వం వహించేందుకు, అవసరమైన మద్దతును సమకూర్చేందుకు ఒక మేనేజ్‌మెంట్ బోర్డ్ ఉన్నది. 15 మంది ఉండే ఈ బోర్డ్‌లో ఐదుగురు భారత ప్రభుత్వ, టిఐఎఫ్ఆర్ ప్రతినిధులు కాగా మిగతా పది మంది ప్రపంచ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలలో పరిశోధకులుగా ఉన్న శాస్త్రవేత్తలు వీరిలో ఐదుగురు మహిళలు. ఎన్‌సిబిఎస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ సభ్యుడి పదవీ కాలం మూడు సంవత్సరాలు. ఒక పర్యాయం పొడిగించే అవకాశమున్నది. బహుశా రెండోసారి కూడా పొడిగించవచ్చు. అంతటితో సరి. ఈపిడబ్ల్యును నడిపే ట్రస్ట్ విషయంలో వలే ఎన్‌సిబిఎస్ బోర్డ్‌లో ఏ ఒక్కరు జీవిత కాలం సభ్యులుగా ఉండరు. ఎట్టి పరిస్థితులలోను తొమ్మిది సంవత్సరాలకు మించి ఎవరూ సభ్యుడుగా ఉండరు. అదే ఈపిడబ్ల్యు ట్రస్ట్ సభ్యులలో కొంత మంది మూడు దశాబ్దాలుగా ఉన్నారు.

చివరగా ఒక వాస్తవాన్ని పేర్కొంటాను. 'సాధ్యమైనంత వరకు ఉన్నత స్థానంలోనే ఉండితీరుదాం' అనే లాలసకు శక్తిమంతమైన, విజయవంతమైన మహిళలు లోనుకానివారు కానప్పటికీ అటువంటి ఆకాంక్ష పురుషులలో చాలా ప్రబలంగా ఉన్నది. ఒబైద్ సిద్ధిఖిలో ఆ లాలస మచ్చుకు కూడా లేదు. ఆయన దానికి కచ్చితంగా ఒక మినహాయింపు. పురుష శాస్త్రవేత్తలలోను, భారతీయ వైజ్ఞానిక జగత్తులోను సిద్ధిఖి ఒక అరుదైన వ్యక్తి. రాజకీయాలు, క్రీడలు, వ్యాపార వాణిజ్యాలు, పౌర సమాజం, విద్యా ప్రపంచంలో అసంఖ్యాక భారతీయులు తమ తమ ఉన్నత స్థానాలలో కొనసాగేందుకు ప్రస్తుత అమెరికా అధ్యక్షుడులా వ్యవహరించినవారే. వారు అదే విధంగా వ్యవహరించడాన్ని తప్పక కొనసాగిస్తారు. ముందు చూపులేని, స్వార్థపర స్వభావంతో కూడిన అటువంటి పెద్ద మనుషుల ప్రవర్తనకు ప్రతిభావంతులు, ప్రజ్ఞా దురీణులు అయిన వారి జూనియర్ సహచరులతో పాటు యావత్ సమాజమూ అమితంగా నష్టపోవడంతో పాటు, భారీ మూల్యాన్ని చెల్లిస్తోంది.

రాజీపడని రాజకీయపోరాట వీరుడు

వాగ్ధాటి, ముక్కుసూటితనానికి పేరుగాంచిన నాయకుడు సూదిని జైపాల్‌రెడ్డి. ఆయన తన రాజకీయ ప్రయాణంలో విలువల విషయంలో ఎన్నడూ రాజీపడలేదు. ఎమర్జెన్సీ ప్రకటనపై అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని ఎదిరించడానికి కూడా వెనుకాడలేదు. పోలియో కారణంగా జైపాల్‌రెడ్డి పరిమిత శారీరక చలనశీలత ఆయన రాజకీయ ఎత్తులను సాధించడానికి అవరోధం కాలేదు. తెలంగాణ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి ఒక శిఖరం. తెలంగాణ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు భారత రాజకీయాల్లో అధ్యయనం, అవగాహన, వాక్పటిమల మేళవింపుగా రాణించిన అరుదైన రాజకీయవేత్త జైపాల్‌రెడ్డి.

ఆయన వ్యక్తిత్వం, ప్రజా సమస్యలను చూసే కోణం, మాట్లాడే విధానం ప్రశంసనీయం. ప్రజాప్రయోజనాల విషయంలో రాజీపడని నిష్కళంకమైన నాయకుడిగా జాతీయ రాజకీయ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంట్‌లో ప్రజల ప్రాముఖ్యత కలిగిన అంశాలను లేవనెత్తారు. విద్యార్థి దశ నుంచి జైపాల్‌రెడ్డి అవినీతిని ఎప్పుడూ ప్రోత్సహించలేదు. కొన్ని దశాబ్దాలపాటు పార్లమెంటేరియన్‌గా ఉన్న ఆయన వివిధ ప్రభుత్వాల్లో కీలక శాఖలను నిర్వహించారు. 1998లో ఆయనకు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు లభించింది. యునైటెడ్ ఫ్రంట్ కామన్ మినిమం ప్రోగ్రామ్ రూపకర్త ఆయనే. భారతదేశ ప్రాధాన్యాల గురించిన ఆయన అవగాహన ఎలాంటిదో తెలుసుకోవడానికి ఆ డాక్యుమెంట్ ఒక్కటి చాలు.



1942 జనవరి 16న తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా మాడ్గుల్‌లో జన్మించిన జైపాల్‌రెడ్డి నల్గొండ జిల్లా దేవరకొండలో ప్రాథమిక విద్యాభ్యాసం సాగించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ ఇంగ్లీష్ పట్టా తీసుకున్నారు. ఉస్మానియాలో విద్యార్థి నాయకుడిగా ఉండగానే జైపాల్‌రెడ్డి రాజకీయ జీవితం మొదలైంది.

ఎమర్జెన్సీ తరువాత జైపాల్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి జనతాపార్టీలో చేరి 1980లో మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో ఇందిరాగాంధీపై పోటీకి దిగారు. తరువాత జనతా చీలిక సమూహం జనతాదళ్‌లో చేరారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో ఆయనుకున్న ప్రావీణ్యం అమోఘమైంది. అసాధారణమైన ఉపన్యాస నైపుణ్యం, ఉచ్చారణ ఆయనను యునైటెడ్ ఫ్రంట్, నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాలకు, కాంగ్రెస్ పార్టీకి ప్రతినిధిగా చేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గట్టిగా శ్రమించారు. 2010 తొలినాళ్లలో ప్రత్యేక తెలంగాణ పోరాటంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఆయన మార్గదర్శకశక్తి.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం యూపీఏ–2 ప్రభుత్వాన్ని, ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీని ఒప్పించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిని ఆశ చూపినా తిరస్కరించానని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా జైపాల్ రెడ్డి ప్రతి అడుగు ప్రజల కోసమే సాగింది. జైపాల్‌రెడ్డి మంచి వక్త. అపారమైన మేధస్సుతో అందరినీ ఆకట్టుకునే విశ్లేషణలు ఆయన సొంతం. ఆయన రాజకీయ తత్వవేత్త లేదంటే తాత్విక రాజకీయవేత్త.

1969 నుండి 1984 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యుడు. 1984లో మొదటిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1990–96; 1997–98 రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. 1991–92లో ఎగువసభలో ప్రతిపక్ష నాయకుడయ్యారు. 1999లో తిరిగి కాంగ్రెస్‌లో చేరి 2004లో మిర్యాలగూడ, 2009లో చేవెళ్ల నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. జైపాల్‌రెడ్డి 2014 లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి ఓడిపోయి 2019 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయలేదు. అనారోగ్య కారణంగా 77వ ఏట జైపాల్ రెడ్డి హైదరాబాద్‌లో 2019, జూలై 28న కన్నుమూశారు.

ఐకె గుజ్రాల్ ప్రభుత్వంలో కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రిగా; మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో వివిధ శాఖలను జైపాల్‌రెడ్డి నిర్వహించారు. యూపీఏ–2లో ఆయన పట్టణాభివృద్ధి మంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. తరువాత పెట్రోలియం సహజ వాయువు మంత్రిత్వ శాఖ చేపట్టారు. తదనంతరం రాజకీయ తుఫాను కారణంగా సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖలకు బదిలీ అయ్యారు. ఆయన "Ten Ideologies: The Great Asymmetry Between Agrarianism and Industrialism"తో సహా కొన్ని పుస్తకాలు కూడా రాసారు.

కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి ప్రోత్సహించకపోగా సోదరులు, కుమారులను రాజకీయాలకు దూరంగా ఉంచారు, ఎన్నికల సమయంలో ప్రచారానికి మాత్రమే వారి పాత్ర పరిమితమయ్యింది. పార్లమెంటులో జైపాల్‌రెడ్డి ప్రసంగాలు గమనిస్తే, ఏ అంశాన్నీ, ఆరోపణలే ప్రధానంగా చేసుకుని మాట్లాడక ప్రతి సమస్యకు తాత్విక పునాదులను అర్థం చేసుకుని లోతైన అవగాహనతో మాట్లాడేవారు. లౌకిక స్ఫూర్తికి ఆయన నిఖార్సయిన నిదర్శనం.

■ నందిరాజు రాధాకృష్ణ
సీనియర్ జర్నలిస్ట్

'సార్' ప్రబోధించిన ఉద్యమ స్ఫూర్తిలో...

స్వీయ అస్తిత్వం కోసం, ప్రజాస్వామ్య పరివర్తన కోసం కన్నీళ్ళు, రక్తం కలగలిసిన అసంఖ్యాక బలిదానాలను చేసింది తెలంగాణ. ఈ క్రమంలోనే తన స్వీయజీవితాన్ని మండించి, మూడుతరాల ఉద్యమానికి వంతెనగా మారి తెలంగాణ లక్ష్యాన్ని తీరం చేర్చిన వైతాళికుడు ఆచార్య జయశంకర్ సార్. స్వరాష్ట్రంలో ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామిక స్వేచ్ఛ సాధించుకుంటారని, తెలంగాణ చారిత్రక స్ఫూర్తి పునాదిగా అధికారాన్ని ప్రజలు నియంత్రిస్తారని భావించిండు. విద్యావంతులు మౌనంగా ఉంటే భవిష్యత్తు సమాజాన్ని కాపాడలేమని, గతంలో చేసిన త్యాగాలకు విలువ ఉండదని, ఉద్యమ విలువలకు సమాజంలో నీడ ఉండదని, తెలంగాణ ఏర్పాటు అనంతరం కూడా అంతర్గత దోపిడీ విధానాలు కొనసాగుతాయని, వాటి మీద నిరంతరం పోరాటం చేయగలిగే చైతన్యవంతమైన పౌర సమాజం తెలంగాణలో ఎల్లకాలం ఉంటుందని విశ్వసించారు. ఈ దోపిడీ విధానాలను ఎదుర్కొనేందుకు మరింత పదునైన పోరాటాలు చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిండు.

ఆ క్రమంలోనే 2004లో ఉద్యమ భావజాల వ్యాప్తి కోసం ఆయన అధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ విద్యావంతుల వేదిక (టివివి) రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వయంపాలన పేరు మీద గత పాలకులు చేసిన మోసాలను, ఉద్యమ పీఠికను విధ్వంసం చేసి, ఉద్యమ ఫలితాన్ని తమ వారి కోసం వినియోగించుకున్న తీరును విప్పిచెప్పింది. ఉద్యమ సంస్థలను, ఉద్యమకారులను సంఘటితం చేసి ఆ నియంతను తొలగించడంలో టివివి విశేష కృషి చేసింది. కొత్తగా ఏర్పడ్డ ఈ ప్రభుత్వం నుంచి కూడా ఉద్యమ ఆకాంక్షలని సాధించుకోవడానికి సైతం జయశంకర్ సార్ ప్రబోదించిన ఉద్యమ స్ఫూర్తే ఏకైక మార్గం అని టివివి విశ్వసిస్తున్నది.


మరోవైపు బహుళత్వ భారతదేశాన్ని అసహన సమాజంగా మార్చివేయడం కోసం తరాలుగా పోగుచేసుకున్న మహత్తర భారతీయ భావనను కేంద్ర పాలకులు చిదిమి వేస్తున్నారు. ఈ దేశ నేల, నీరు, అడవులు, కార్మిక మానవ శక్తులను తన స్వదేశీ, విదేశీ కార్పొరేట్ మిత్రులకు అప్పనంగా కట్టబెడుతూనే, ఇక్కడి ప్రజల ధార్మిక జీవితాన్ని కూడ తన ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఈ పరిస్థితులలో తమ హావభావాల చాటున కప్పివేయబడిన కుయుక్తులను బయటపెట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తులను, పౌరసమాజాన్ని రక్తపు మడుగులలోకి, భయ సంస్కృతిలోకి, మౌన లొంగుబాటులోకి పంపుతున్నారు. సమాజాన్ని చీకట్లు కమ్మేస్తున్నప్పుడు, ఆధిపత్య శక్తులు పంజా విసురుతున్న విధ్వంసక పాలనా విధానాలను ప్రతిఘటించకపోతే ఈ దేశాన్ని, ఉదాత్త విలువల రాజ్యాంగాన్ని, ఉద్యమ ఆకాంక్షలను రక్షించుకోలేం.



అందుకే ఈ పాలనా విధానాలను ఎదిరిద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సంఘటితంగా, సమన్వయంతో, సమాంతరంగా పనిచేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ సార్ చూపిన తోవలో పనిచేసే వారిని కలుపుకోవడానికైనా లేదా వారితో కలిసి నడవటానికైనా చారిత్రక ప్రాధాన్యత, వర్తమాన పోరాటగరిమ కలిగిన సంస్థగా టివివి చిత్తశుద్ధితో కృషి చేస్తుంది. ఈ ప్రయత్నంలో భాగంగానే జయశంకర్ సార్ అమరులైన నాటి నుంచి దేశంలోను, రాష్ట్రంలోను ప్రముఖ మేధావులను ఆహ్వానించి ప్రతి ఏటా స్మారకోపన్యాసాన్ని నిర్వహిస్తూ వస్తున్నది.

జూలై 28 ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జయశంకర్ 13వ స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నాం. ప్రఖ్యాత అంతర్జాతీయ డిజిటల్ న్యూస్ పోర్టల్ 'ది వైర్' పత్రిక సీనియర్ ఎడిటర్, సామాజిక కార్యకర్త అర్ఫా ఖానుమ్ షేర్వానీ 'సమకాలీన భారతీయ సమాజం–ముందున్న సవాళ్ళు' అంశంమీద ప్రసంగిస్తారు.

● అంబటి నాగయ్య
తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు





కాళేశ్వరాలయంలో పూజలు చేస్తున్న కేటీఆర్

తలసరి ఆదాయంలో జయశంకర్ జిల్లాకు
ఐదో స్థానం



- 'ఉపాధి' పనిదినాల కల్పనలో ఆరో స్థానంలో జనగామ
- సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి

హనుమకొండ, జులై 26 (ఆంధ్రజ్యోతి): తలసరి ఆదాయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలవగా హనుమకొండ జిల్లా చివర స్థానంలో ఉంది. గురువారం అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో బడ్జెట్‌తో పాటు ప్రవేశపెట్టిన ఆర్థిక, సామాజిక సర్వే వెల్లడించింది. ఆ మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా తల సరి ఆదాయం రూ.2,71,555 కాగా.. వరంగల్ రూ.2,22,640తో 15వ స్థానంలో నిలిచింది. జనగామ జిల్లా రూ.2.17,277తో 18వ స్థానం, మహబూబాబాబాద్ జిల్లా రూ.1,99,588తో 23వ స్థానం, ములుగు జిల్లా రూ.1,97,539తో 25వ స్థానం, హనుమకొండ జిల్లా రూ.186,784తో 26వ స్థానంలో నిలిచింది.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంత ప్రజలకు పని దినాలు కల్పించే విషయంలో జనగామ జిల్లా రాష్ట్రంలోనే ఆరో స్థానంలో నిలవగా, మహబూబాబాద్ జిల్లా 31వ స్థానంలో ఉంది. జనగామ జిల్లాలో 2023-24 సంవత్సరంలో 24.80లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా, దానిని మించి 30.5లక్షల పనిదినాలను (123 శాతం) పనిదినాలను కల్పించి రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లాలో 17.5లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా అంతకు మించి 20.3లక్షల (116 శాతం) కల్పించి రాష్ట్ర స్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. హనుమకొండ జిల్లా 19.3లక్షల పని దినాలను కల్పించాలన్నది లక్ష్యంగా, 21.9 లక్షల పని దినాలు (114 శాతం) కల్పించడంతో 17వ స్థానంలో, ములుగు జిల్లాలో 12.1 లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యంగా 13.4 లక్షల పని దినాలు (111 శాతం) కల్పించడంతో 24వ స్థానంలో నిలిచింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా 19.9 లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా, 21.2 లక్షల పనిదినాలతో (106 శాతం) 29 స్థానంలో మహబూబాబాద్ జిల్లా 53.3 లక్షల పని దినాలు లక్ష్యం కాగా, 55.9 (105శాతం) పనిదినాలతో రాష్ట్రస్థాయిలో అట్టడుగున 31 స్థానంలో నిలిచింది.

జిల్లాల వారీగా భూ కమతాలిలా..

రైతులు వ్యవసాయ భూములను కలిగి ఉండడంలో రాష్ట్రస్థాయిలో జనగామ జిల్లా ఐదోస్థానంలో నిలిచింది. అతి తక్కువ భూములు కలిగి ఉన్న జిల్లా వరంగల్ అని ఆర్థిక సామాజిక సర్వే రిపోర్టులో పేర్కొన్నారు. జనగామ జిల్లాలో సరాసరి ల్యాండ్ హోల్డింగ్స్ 0.95 హెక్టార్లు కాగా, ములుగు జిల్లాలో 0.92హెక్టార్లు, మహబూబాబాద్ జిల్లాలో 0.87 హెక్టార్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 0.85 హెక్టార్లు, హనుమకొండ జల్లాలో 0.75 హెక్టార్లు, వరంగల్ జిల్లాలో 0.74 హెక్టార్లు కలిగి ఉన్నారు. ల్యాండ్ హోల్డింగ్ అనేది ప్రధానంగా భూమిని కలిగి ఉన్న లేదా సొంతం చేసుకునే స్థితి లేదా వాస్తవంతో వ్యవహరించే భావన. దేశ ఆర్థిక, రాజకీయ ప్రక్రియలపరంగా భూమి కలిగి ఉండడం (హోల్డింగ్) ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది.

అడవులు, వన్యప్రాణులు

కాళేశ్వరం సర్కిల్ పరిధిలో మొత్తం అడవి 22,65,548.9 ఎకరాలున్నట్టు ఆర్థిక సామాజిక సర్వేలో పేర్కొన్నారు. ఇందులో రిజర్వు ఫారెస్టు 21,17,394.3 ఎకరాలు రక్షిత అడవి 1,19,999 ఎకరాలు కాగా, అన్ క్లాసిఫైడ్ ఏరియా 28,155.6 ఎకరాలు ఉంది. ఏటూరునాగారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం 803 చదరపు కిలోమీటర్లు, మహబూబాబాద్, వరంగల్‌తో కూడిన పాకాల వన్యప్రాణి సంరక్షణ కేంద్రం 860.2 చదరపు కిలోమీటర్లున్నట్టు తెలిపింది.



మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-6 వద్ద కేటీఆర్ బృందం

- ముక్తీశ్వరాలయం, త్రివేణి సంగమాల వద్ద ప్రత్యేక పూజలు
- కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బ్యారేజీల పరిశీలన
- కాళేశ్వరం నీటిని వెంటనే ఎత్తిపోయాలి
- విలేకరుల సమావేశంలో కేటీఆర్
- చిల్లర ప్రచారాలు మానుకోవాలని ప్రభుత్వానికి హితవు

మూడున్నర గంటలు..

కాళేశ్వరంలో సాగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం పర్యటన



కాళేశ్వరంలో గోదావరికి పూజలు చేస్తున్న కేటీఆర్

మహదేవపూర్ రూరల్ / మహదేవ్‌పూర్, జూలై 26 : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతల బృందం శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో పర్యటించింది. సుమారు మూడున్నరగంటల పాటు ఆ బృందం పర్యటన సాగగా.. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన కన్నెపల్లి లక్ష్మీ పంపుహౌస్, మేడిగడ్డ బ్యారేజీలను నేతలు సందర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నేతృత్వంలో ఉదయం 10గంటలకు కాళేశ్వరం చేరుకున్న ప్రజాప్రతినిధులు, నేతలు తొలుత శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయానికి చేరుకోగా వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో రుద్రాభిషేకం, ప్రత్యే క పూజలు చేశారు. ఆ తర్వాత 10.30 గంటలకు శుభనందాదేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేటీ ఆర్, ఎమ్మెల్యేల బృందాన్ని స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదా లు అందజేశారు. అక్కడి నుంచి 10.45 గంటలకు గోదావరి నది వద్దకు చేరుకున్న కేటీఆర్, నేతలు ప్రత్యేక పూజలు చేసి కన్నెపల్లి పంప్‌హౌజ్‌కు బయలుదేరి వెళ్లి.. 11.05కు అక్కడికి చేరుకుని పంప్‌హౌజ్‌ను పరిశీలించారు. 11.10 గంటకు మీడియా సమావేశంలో మాట్లాడి మేడిగడ్డకు తరలారు. మధ్యాహ్నం 12.45గంటలకు మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్ 6 వద్ద గోదావరినది ప్రత్యేక పూజలు చేసి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. 1.35 గంటలకు మేడిగడ్డ బ్యారేజీ వంతెనపై నుంచి బయటకు వచ్చి చెన్నూరుకు బయలుదేరి వెళ్లిపోయారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు

రాజకీయాలకు పోయి రైతులను ఆగం చేయొద్దు : కేటీఆర్

కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపహౌస్ నుంచి వెంటనే నీటిని ఎత్తిపోసి, ఎగువ గోదావరిలోని రిజర్వాయర్లను నింపాలని, రాజకీయాలకు పోయి రైతులను ఆగం చేయొద్దని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నెపల్లి లక్ష్మీపంపుహౌస్ సందర్శించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రచారాలు మానుకోవాలని హితవు పలికిన ఆయన ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి వరప్రదాయిని అని, కేసీఆర్ ప్రారంభించిన ఈప్రాజెక్టు ద్వారా రైతులకు మేలు జరిగితే తమకు మనుగడ ఉండదనే దురుద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. అన్నాదతల ఆకలి తీర్చే కాళేశ్వరం ప్రాజెక్టు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 'మేడిగడ్డ కుంగిపోయింది.. కాళేశ్వరం కొట్టుకుపోయింది..' అని దుష్ప్రచారం చేసే కాంగ్రెస్ నాయకులు బ్యారేజీని సందర్శించాలని హితవు పలికారు. సుమారు 10లక్షల క్యూసెక్కుల పైచిలుకు వరద ఉన్న వరద ప్రవాహాన్ని కూడా బ్యారేజీ తట్టుకుని నిలబడిందని, ఇది కాంగ్రెస్ నాయకుల కళ్లకు కనిపించడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైన కాంగ్రెస్ నాయకులు కళ్లుతెరిచి ప్రాజెక్టును చూసి మాట్లాడాలన్నారు. చిన్న చిన్న లోపాలను చూపించి మొత్తం ప్రాజెక్టే పనికి రాదనే విధంగా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే ఆగస్టు 2వ తేదీ నాటికి ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయాలని, లేదంటే తామే వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, పాలేరు, సూర్యాపేట, భువనగిరి, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి 50వేలమందికిపైగా రైతులను సమీకరించి వారి చేతుల మీదుగానే కన్నెపల్లి పంపహౌస్ మోటార్లను ఆన్‌చేసి కాళేశ్వరం జలాలను తరలించుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయం చేసేందుకు తాము

మిగతా 6వ పేజీలో..



పోలీసు స్టేషన్‌లో ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితురాలు అనసూర్య

భూ వివాదంలో
ఎస్ఐ వేధిస్తున్నారు..

- మనస్థాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం
- శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఉద్రిక్తత

శాయంపేట, జూలై 26: భూ తగాదాలో ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపిస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. శాయంపేట మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన కొమ్ముల ఆనందం, ఆరోగ్యం భూములు పక్కపక్కనే ఉన్నాయి. తన భూమిని ఆనందం ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోగ్యం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు శుక్రవారం ఆనందంను స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం ఆనందం భార్య అనసూర్య పురుగుల మందు డబ్బాతో హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. తమను ఇబ్బందులు పెడుతున్నారని స్టేషన్‌లోనే ఆత్మహత్యాయత్నం చేసుకుంది. పోలీసులు అడ్డుపడి మందు డబ్బాను లాక్కున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. భూతగాదాలో ఎస్ఐ ప్రమోద్‌కుమార్‌తోపాటు ఆరోగ్యం తమను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు స్టేషన్‌కు పిలిచి ఇబ్బందులు పెట్టారని చెప్పారు. ఇక తమకు ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు. ఈ విషయంపై ఎస్ఐ ప్రమోద్‌కుమార్‌ని వివరణ కోరగా.. భూవి తగాదాలో ఆనందంపై ఈనెల 20న ఫిర్యాదు రావ డంతో శుక్రవారం స్టేషన్‌కు పిలిచామన్నారు. అంతేకానీ ఎలాంటి ఇబ్బంది పెట్టలేదని తెలిపారు. ఫిర్యాదుపై ఏం జరిగిందో తెలుసుకోకుండానే తనపై ఆరోపణలు చేయడం తగదన్నారు. గతంలో ఫిర్యాదు వస్తే పిలిచామని ఎస్ఐ చెప్పారు. అనంతరం బాధితులతో సీఐ రంజిత్‌రావు మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించారు.

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్
- విభజన హామీలను విస్మరించిన కేంద్రం
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్
- కాజీపేట చౌరస్తాలో నిరసన దీక్ష



కాజీపేటలో జరిగిన నిరసన దీక్షలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్ కుమార్

కాజీపేట, జూలై 26: కాజీపేట వాసుల చిరకాల వాంఛ అయిన రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ సాధించే వరకు పోరాటం ఆపబోమని, అందుకు ప్రజా ఉద్యమం చేస్తామని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాను నిర్లక్ష్యం చేశారంటూ శుక్రవారం కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాట దీక్ష చేశారు. ఈ పోరాట దీక్షలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణపై కేంద్ర, రాష్ట్రాలు సవతితల్లి ప్రేమ చూపిస్తూ అన్యాయానికి గురిచేస్తున్నాయన్నారు. కాజీపేలో కోచ్‌ఫ్యాక్టరీ సాధన కోసం నిర్వహించే ఉద్యమంలో వామపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రకటించిన 13 హామీలలో ప్రస్తుతం నాలుగు హామీలే అమలు చేస్తున్నార న్నారు. 100రోజుల్లో హామీలన్నీ నెరువేర్చుతామన్న ప్రభుత్వం.. ఏడు నెలలైనా అతీగతీ లేదన్నారు. ఆరు నెలల్లో ప్రజావ్యతిరేకతను మూటగట్టిందన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బడ్జెట్‌లో విభజన హామీలు విస్మరించిన తీరు ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాటలు కోటలు దాటుతున్నాయని, నిధుల కేటాయింపులో గుండు సున్నాలే ఉన్నాయన్నారు. విభజన హామీలు అమలు అయ్యేవరకు పో రాడుతామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. బడ్జెట్‌లో బిహార్‌కు, ఏపీకి అధిక నిధులు కేటాయించి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ములుగు గిరిజన యూనివర్సిటీకి కేంద్రం నిధులు కేటాయించకుండా వివక్ష చూపిందన్నారు. కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వకుండా పోలవరానికి ప్రత్యేక నిధులు ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అమలు చేయకుండా తుంగల్లో తొక్కిందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రజా గ్రహానికి గురికాక తప్పదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో 'కుడా' మాజీ చైర్మన్ యాదవ రెడ్డి, కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, బోయినపల్లి రంజిత్‌రావు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, నాయకులు ఇమ్మడి రాజు, మరుపల్లి రవి, తండమల్ల వేణు, పాలడుగుల శివ, ఎమ్డీ సోని, మర్యాల కృష్ణ, బస్వరాజు, తేలు సారంగ పాణి, వెనిశెట్టి రఘు, బరిగెల శివ తోపాటు స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే
ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

హనుమకొండ సిటీ, జూలై 26: మహిళా అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ రాజ్యంలో రానున్న రోజుల్లో మహిళా సాధికారత ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హనుమకొండ మండలానికి సంబంధించిన 51 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో మొదటిసారిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో చెక్కులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజారంజక పాలనే ధ్యేయంగా బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. శాసనసభ్యుడిగా ఎన్నికైన తరువాత నియోజకవర్గ అభివృద్ధి కోసం దాదాపు రూ.250 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. తాను చేసిన అభివృద్ధి, తీసుకువచ్చిన నిధుల వివరాలను ఆర్టీఐ ద్వారా తెలుసుకోవచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ముందుకుసాగని కాజీపేట బ్రిడ్జి పనులు మళ్లీ సాగుతున్నాయన్నారు. చిరకాల కోరికగా ఉన్న కాజీపేట బస్టాండ్ ఏర్పాటు కోసం రైల్వే జీఎంను కలిసి సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. తాను అందుబాటులో లేని క్రమంలో ప్రజాభవన్‌లో సేవ చేసేందుకు మా బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు నాగరాజు, నెక్కొండ కిషన్, నాయకులు రాంప్రసాద్, బంక సరళ, బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, దీపక్‌రెడ్డి, ఎ.శివాజీ, సయ్యద్ అఫ్సర్, హనుమకొండ తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయాలి

- జిల్లాలోని అంగన్‌వాడీల ఉన్నతీకరణకు నిధులు మంజూరు : కలెక్టర్ ప్రావీణ్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూలై26: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో మొదటి దశలో పాఠశాలలకు మంజూరైన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. మొదటి దశలో ఏవైనా పనులు పెండింగ్‌లో ఉన్నది, లేనిది మండల ప్రత్యేక అధికారులు తెలుసుకుని వెంటనే వాటిని పూర్తి చేయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా ఇంజనీరింగ్ అధికారులు, ఎంఈవోలతో మంజూరైన పనులు ఎంతవరకు పూర్తయ్యాయని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన పనుల వివరాలు మెజర్‌మెంట్ బుక్కులలో నమోదైందా లేదా అని ఆరా తీశారు. నమోదు కాకపోతే వెంటనే నమోదు చేయించాలన్నారు. ఎంపీఎంబీ పాఠశాలల్లో మిగిలిపోయిన పనులకు అంచనాలు తయారు చేసి పంపించాలన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులపై సమీక్షించి త్వరగా చెల్లించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. రెండో దశలో మంజూరైన పనులు ఏ మేరకు పూర్తయ్యాయని, మూడోదశ పనుల కోసం అంచనాలను తయారుచేసి పంపించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలోని 162 అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నతీకరిస్తామని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఉన్నతీకరించే అంగన్‌వాడీ భవనాలకు రంగులు వేయటం, టాయిలెట్స్‌తో పాటు చిన్న చిన్న రిపేర్ల కోసం నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. రంగుల కోసం స్థానికంగా ఉన్న పెయింటర్లను ఉపయోగించుకుని త్వరగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీలకు వెంటనే బోర్డులు ఏర్పాటు చేయించి ముందు భాగంలో ఏర్పాటు చేయించాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో సత్యనారాయణ రెడ్డితోపాటు జిల్లా విద్యాశాఖాధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మల్టీజోన్-1 ఆయుష్ ఉద్యోగుల బదిలీ

- వైద్యులు, ఫార్మసిస్టుల బదిలీ అర్డర్ల అందజేత
- 47 మంది వైద్యులు, 40 మంది ఫార్మసిస్టులకు స్థానచలనం

8లో..

మూడున్నర గంటలు..

(5వ పేజీ తరువాయి)

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు రాలేదని, బీడువారిన భూములకు నీరందించి రైతులకు న్యాయం చేయాలని కోరేందుకు వచ్చామని స్పష్టం చేశారు. తొలుత గంగుల మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్‌చేస్తే అన్నారం, సుందిళ్ల ఎల్లంపల్లి ప్రాజెక్టుల ద్వారా మానేరు డ్యామ్‌ను నింపే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు. జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు కన్నెపల్లి పంప్‌హౌస్ కీలకమని, దీనిని రన్ చేస్తేనే ప్రాజెక్టు పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాలకూ నీరందుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభానికి ముందున్న ఆయకట్టు మాత్రమే కొనసాగేదని, అనంతరం కొన్ని లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తయారైందని వివరించారు. కాంగ్రెస్ చేసే కుట్రలను తిప్పికొట్టి రైతులకు నీరందించడమే లక్ష్యంగా తాము కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చామన్నారు. ఇంకా ఈ పర్యటనలో మాజీ మంత్రులు సీహెచ్ మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గోపీనాథ్, ఎమ్మెల్సీలు ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, గోరేటి వెంకన్న, తాతా మధుసూదన్, రాజు, సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మహదేవపూర్ మండల అధ్యక్షుడు లింగపల్లి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వీడియో తీసి.. ఎక్స్‌లో అప్‌లోడ్ చేసి..

కేటీఆర్ బృందంతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వచ్చిన మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డి కుంగిన 7వ బ్లాక్ వద్ద వరద ఉధృతి, పిల్లర్ల పరిస్థితిని ఓ వీడియో రికార్డు చేశారు. ఆ వీడియోను తన ఎక్స్‌ఖాతాలో అప్‌లోడ్ చేశారు. బ్యారేజీ మొత్తంలో ఒక పిల్లర్ కుంగితే యావత్ కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిందని కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, మేడిగడ్డ బ్యారేజీ మేడిపండని వ్యాఖ్యానిచడం దారుణమని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇప్పుడంటే ఇప్పుడు నీటిని లిఫ్ట్ చేసే విధంగా కన్నెపల్లి పంప్‌హౌజ్ సిద్ధంగా ఉందని ఇంజనీర్లు చెబుతున్నారని, మేడిగడ్డ బ్యారేజీలో సమస్య ఉంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సమస్య ఉందని నీటిని నిల్వ చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉన్నా కాంగ్రెస్ నాయకులు చేసిన అబద్ధపు ప్రచారాలు ప్రజలకు తెలిసిపోతాయనే దురుద్దేశంతో చేయకుండా లక్షలాది మంది రైతులు ఉసురుపోసుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వ రం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరందిస్తే కేసీఆర్ కు గుర్తింపు వస్తుందనే దురుద్దేశంతో ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.



నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట భీమ్లాతండాలో వరినాటు వేస్తున్న ఎస్సై సతీష్

వరి నాటు వేస్తూ.. సందడి చేస్తూ..

సైబర్ నేరాలపై నర్సింహులపేట ఎస్సై అవగాహన

నర్సింహులపేట, జూలై 26: వరినాటు వేస్తూ.. కూలీలు, రైతులతో సందడి చేస్తూ సైబర్ నేరాలపై ఎస్సై గండ్రాతి సతీష్ వినూత్నంగా అవగాహన కల్పించారు. నర్సింహులపేట మండలంలోని బొజ్జన్నపేట శివారు భీమ్లా తండకు చెందిన బానోతు లక్‌పతి వ్యవసాయ క్షేత్రంలో ఎస్సై గండ్రాతి సతీష్ శుక్రవారం మహిళా కూలీలతో కలిసి వరినాటు వేస్తూ సందడి చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం శుభపరిణామమన్నారు. ఇటీవల కాలం నుంచి సైబర్ నేరగాళ్లు రైతులను టార్గెట్ చేసుకొని రైతుల సెల్‌ఫోన్‌లకు లింకులు పంపుతూ వారి ఖాతాలో ఉండబడిన నగదును దోచుకుంటున్నట్లు వివరించారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి తమ బ్యాంకు వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, రైతులు, కూలీలు ఉన్నారు.

గంజాయి పట్టివేత

కాజీపేట, జూలై 26: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసుల తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి గంజాయితో పట్టుబడ్డారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ఎస్సై నవీన్ కుమార్ బృందం తనిఖీలు చేస్తుండగా దర్గాకు చెందిన అఫ్జల్ వద్ద 100 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన అఫ్జల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గంజాయి విలువ రూ.3,500 ఉంటుందని పోలీసులు తెలిపారు.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

వడ్డెపల్లి, జూలై 26: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో 42 శాతానికి పెంచాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీసీ కుల గణన చేపట్టి స్థానికసంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అసెంబ్లీలో బీసీ కులగణన కోసం జీవో నంబర్ 26 ఇచ్చి రూ.150కోట్లు బడ్జెట్ కేటాయించి, త్వరలో బీసీ కులగణన చేపట్టి బీసీల జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు పాత రిజర్వేషన్ ప్రకారమే ఆగస్టులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఎంతవరకు సమంజసమని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దాడి మల్లయ్యయాదవ్, రవీందర్, తమ్మల శోభారాణి, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై పోలీసు కళా బృందం ప్రదర్శన

వరంగల్ క్రైం, జూలై 26: కాకతీయ యూనిర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాదవనగర్‌లో కొత్త చట్టాలపై అవగాహన, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి పోలీసు కళా బృందంతో కార్యక్రమం నిర్వహించారు. పాటలు, నాటిక ద్వారా కళాబృందం సభ్యులు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేయూ సీఐ సంజీవ్ మాట్లాడుతూ.. యువకులు మత్తు పదార్థాల బారినపడి భవిష్యత్ అంధకారం చేసుకోవద్దన్నారు. గంజాయి అమ్మినా, సేవించినా 8712685257 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవిందర్, కళా బృందం ఇన్‌చార్జి నాగమణి, హెడ్ కానిస్టేబుళ్లు విలియమ్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రత్నయ్య, హోంగార్డులు శ్రీనివాస్, విక్రమ్‌రాజ్, చిరంజీవి పాల్గొన్నారు.



కళాజాతలో మాట్లాడుతున్న సీఐ సంజీవ్

17 నుంచి ఎస్డీఎల్‌సీఈ ఎంఎస్‌డబ్ల్యూ ఫైనల్ ఇయర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూలై 26: ఆగస్టు 17 నుంచి కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎస్ డబ్ల్యూ ఫైనల్ ఇయర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 17, 20, 22, 24, 28, 30 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల కేంద్రాన్ని కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

8 నుంచి ఎంసీఏ సెమిస్టర్ పరీక్షలు

ఆగస్టు 8 నుంచి కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ ఎంసీఏ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8, 13, 17, 20, 22, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

ఎంబీఏ సెమిస్టర్ పరీక్షలు కూడా..

ఆగస్టు 8 నుంచి కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ ఎంబీఏ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8, 13, 17, 20, 22 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

7 వతేదీ నుంచి పీజీ కోర్సుల ఎగ్జామ్స్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంటీఎం, ఎంహెచ్‌ఆర్‌ఎం, సైకాలజీతోపాటు ఇతర పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షలు ఆగస్టు 7 నుంచి నిర్వహిస్తామని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

వరంగల్ ఆర్టీసీ అకౌంట్ ఆఫీసర్‌గా రవీందర్

బాలసముద్రం, జూలై 26: వరంగల్ రిజీయన్‌లో అకౌంట్ ఆఫీసర్‌గా ఎల్.రవీందర్‌ను నియమిస్తూ శుక్రవారం ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ అకౌంట్ అఫీసర్‌గా పనిచేసిన లావణ్య అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే, ఆమె స్థానంలో హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో పీఎఫ్ ట్రస్టు ఏవోగా పనిచేస్తున్న రవీందర్‌ను వరంగల్ ఆర్టీసీ అకౌంట్ ఆఫీసర్‌గా నియమిస్తూ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు.




ప్రభాకర్ తన హోటల్‌లో ఏర్పాటు చేసిన సందేశాత్మక కవితలు, ఓటును అమ్ముకోవద్దని ప్రచారం చేస్తున్న ఉత్తమ పౌర సమాజం నాయకులు

సమాజ చైతన్యమే లక్ష్యంగా..

ఓటును అమ్ముకోవద్దని, మద్యం మానాలంటూ విస్తృత ప్రచారం ● పదిహేనేళ్లుగా శివునిపల్లిలో ఓ హోటల్ యజమాని కృషి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 26: ఆయన ఓ చిన్న హోటల్ యజమాని. ఆ హోటల్ నడుపుకొంటూ వచ్చే ఆదాయంతోనే జీవనం సాగిస్తుంటారు. అలాంటి ఓ సాధారణ వ్యక్తి సమాజ చైతన్యమే లక్ష్యంగా పదిహేనేళ్లుగా తన వంతు కృషి చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూ తన హోటల్‌కు వచ్చే వారిలో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయనే.. స్టేషన్‌ఘన్‌పూర్ జంట పట్టణం శివునిపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న హోటల్ గంగా జమున యజమాని వై.ప్రభాకర్. సందేశ కవితలు ఏర్పాటు చేయడంతోపాటు హోటల్‌కు వచ్చే వారికి తన కవితలు వినిపిస్తూ ఆలోచింపజేస్తున్నారు. ఏటా జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తున్నారు. మద్యపానంతో కుటుంబాలను నాశనం చేసుకోవద్దని ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు ఉత్తమ పౌర సమాజం పేర సంఘం ఏర్పాటు చేసి ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియచేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 15 ఏళ్ల క్రితమే శివునిపల్లిలో ఈ సంఘాన్ని ఏర్పాటు చేసిన ప్రభాకర్ 'ప్రలోభాలకు లొంగకుండా ఓటేద్దాం, సమస్యలపై నిలదీద్దాం' అంటూ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అభ్యర్థులు కూడా నిజాయితీగా ఉండాలని, అహర్నిషలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని కోరుతున్నారు.

మహనీయులను స్మరించుకునేందుకు..

జాతీయ నాయకులు, మహనీయులు, కవులు, రచయితలు అందించిన పోరాట స్ఫూర్తిని నిత్యం స్మరించుకోవాలన్న సంకల్పంతో ఏటా వారి జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తున్నారు ప్రభాకర్. మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు, చాచా నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రీ, నేతాజీ, స్వామీ వివేకానంద, బీఆర్ అంబేద్కర్, కాళోజీ, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ప్రొఫెసర్ జయశంకర్, చాకలి ఐలమ్మ తదితరుల కార్యక్రమాలు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. ఇక స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే వేడుకలను ఎంతో ఉత్సాహంగా చేపడుతున్నారు.

నిషా బినా పీనేకా సంఘ్ సారథిగా...

మద్యపానం వల్ల కలిగే నష్టాలపై ప్రజలను చైతన్యం చేస్తూ.. శివునిపల్లి పట్టణంలో చాలా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. మద్యం తాగని వారితో నిషా బినా పీనేకా సంఘ్ పేర సంఘం ఏర్పాటు చేశారు. 'మద్యం మానండి, కుటుంబాలను బాగా చూసుకోండి' అంటూ ఇప్పటికీ విస్తృత ప్రచారం చేస్తున్నారు.

కొందరు మారినా చాలు : ప్రభాకర్

శివునిపల్లిలో 20 ఏళ్లుగా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈ ప్రయత్నంలో కొందరు మారినా చాలు. ఎంతో కొంత ప్రయత్నం చేయడం మంచిది కదా. మద్యం తాగని వారితో 'నిషా బినా పీనేకా సంఘ్' ఏర్పాటు చేసి ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపట్టాం. 18 ఏళ్ల నుంచి చిన్న కవితలను రాసి వాటిని ముద్రించి ప్రదర్శిస్తున్నాం. ప్రజలు నిజాయితీగా ఓటువేయాలని కోరుతూ ఉత్తమ పౌర సమాజం పేర సంఘాన్ని ఏర్పాటు చేశాం.

రీఫండ్ కోసం తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు

పోలీసు కమిషనరేట్ అడ్మినిస్ట్రేషన్ అదనపు డీసీపీ రవి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీసీపీ రవి

వరంగల్ క్రైం, జూలై 26: ఆదాయం పన్ను రీఫండ్ కోసం తప్పుడు వివరాలతో రిటర్న్స్ సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి హెచ్చరించారు. ఆదాయం పన్ను రిటర్న్స్‌పై పోలీస్ అధికారులు, సిబ్బందికి శుక్రవారం జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన సమావేశం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. వరంగల్ జిల్లా ఆదాయ పన్ను అధికారి మహేందర్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు డీసీపీ రవి మాట్లాడారు. తప్పుడు సమాచారంతో ఆదాయ పన్ను రిటర్న్స్ సమర్పించడం నేరమన్నారు. రీఫండ్ కోసం తప్పుడు సమాచారం ఇచ్చే ప్రయత్నం చేయకూడదన్నారు. ఒకవేళ ఇచ్చినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఆదాయ పన్ను అధికారి మహేందర్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ వేతన ఉద్యోగులు తప్పుడు సమాచారంతో తమ ఆదాయ పన్ను రిటర్న్స్ సమర్పించి రావాల్సిన దానికన్నా ఎక్కువ రీఫండ్ క్లెయిమ్ చేసుకుంటున్నట్లు వెలుగు చూసిందన్నారు. ఇలాంటి వారిని గుర్తించి నోటీసులు పంపామన్నారు. తప్పుడు సమాచారం ఇస్తే ఆదాయ పన్ను చట్టం కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏవో రామకృష్ణ, ఏసీపీలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ శిక్షణను వినియోగించుకోవాలి

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూలై 26: 2024-25 ఏడాదికి గాను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న ప్రిలిమినరీ పరీక్షలకు రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రం హైదరాబాద్ అందిస్తున్న ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి సూచించారు. శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో సివిల్ సర్వీస్ అప్టిట్యూడ్ టెస్ట్ (సీఎస్ఏటీ) ప్రవేశ పరీక్ష గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రిలిమినరీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. గుర్తింపు కలిగిన వర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, రూ.3లక్షల వార్షిక ఆదాయం కలిగిన వారందరూ అర్హులేనన్నారు. దరఖాస్తులు జూలై 31 వరకు చేసుకోవాలని, అలాగే దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 8న పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ http://tsstudycircle. co.in/లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేయూ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్. ప్రణయ్‌కుమార్, ఎస్సీ అధ్యయన సంస్థ వరంగల్ గౌరవ డైరెక్టర్ డాక్టర్ కె.జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎక్స్ రే మిషన్



వరంగల్ మెడికల్, జూలై 26: అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు ఉపయోగించే ఎక్స్‌రే మిషన్ నిరూపయోగంగా మారింది. ప్రభుత్వం లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఉపయోగించే నాథేడు కరువయ్యాడు. ఎంజీఎంలోని ఎస్ఎన్‌సీయూ వార్డులో అప్పుడు పుట్టిన పిల్లల్లో అవలక్షణాలు గుర్తించేందుకు మొబైల్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రభుత్వం పంపించింది. ఇందుకోసం ఓ ఆపరేటర్‌ను నియమించినప్పటికీ రెండు గంటలు మాత్రమే విధుల్లో ఉంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఇందులో ఉన్న డాక్టర్లు ఈ నిర్ధారణ పరీక్ష కోసం టెక్నీషియన్ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఎక్స్‌రే విషన్‌తోపాటు వైద్యులు ఉన్నప్పటికీ టెక్నీషియన్ లేకపోవడంతో పిల్లలకు వైద్యం అందం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అత్యవసర విభాగంలో 24 గంటలపాటు అందుబాటులో ఉండే విధంగా టెక్నిషియన్‌లను నియమించాలని రోగుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

ఎంజీఎంలో కుక్కల స్వైర విహారం



ఎంజీఎంలో తిరుగుతున్న కుక్క

వరంగల్ మెడికల్, జూలై 26: ఎంజీఎం ఆస్పత్రిలోని పలు వార్డుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా పిల్లల వార్డులో కూడా రాత్రివేళల్లో దర్శనమిస్తున్నాయి. చిన్నపిల్లలను తల్లిదండ్రులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నప్పటికీ కుక్కల వల్ల ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని రాత్రి వేళల్లో పిల్లలకు కాపలాగా ఉంటున్నారు. అటెండెన్స్ మధ్య కుక్కలు కూడా సహవాసం చేస్తున్నాయని భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఎలుకలు కొరికిన విధంగా పిల్లలపై దాడికి కుక్కలు దిగకముందే తగిన చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జీర్ణించుకోలేని విషాదం

- 'కొండాయి' గుండెకోతకు ఏడాది
- గతేడాది జూలై 27న జంపన్నవాగు వరదకు 8 మంది బలి
- గ్రామాన్ని ముంచెత్తిన జలప్రళయం
- మరువలేకపోతున్న పల్లె జనం

నాటి వరదలకు మునిగిపోయిన కొండాయి గ్రామం



ఏటూరునాగారం రూరల్, జూలై 26: పచ్చని అడవి పల్లెను వరద మింగేసింది. వాగు ఉప్పొంగి ఊరు ఊరంతటినీ నీటముంచింది. ఏకంగా ఎనిమిది మందిని బలిగొంది. అనేక మంది ఆస్తులను నష్టపర్చింది. సరిగ్గా ఏడాది క్రితం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయిలో జరిగిన ఈ దుర్ఘటన తీవ్ర గుండెకోతను మిగిల్చింది. గత ఏడాది భారీ వర్షాలకు మహోగ్రరూపం దాల్చిన జంపన్నవాగు జలప్రళయాన్ని సృష్టించింది. ఇది జరిగి ఏడాది పూర్తయినా ఆ విషాదం ఛాయలు ఆ గ్రామాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. కళ్లెదుటే తిరిగిన వ్యక్తులు చూస్తూ చూస్తుండగానే వరదలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోవడాన్ని ఆ పల్లె ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

ప్రశాంత పల్లెలో పెను విషాదం

ప్రశాంతంగా ఉన్న కొండాయి గ్రామంలో పెను విషాదం చోటు చేసుకుంది. గత ఏడాది జూలై 27న ఒక్కసారిగా ప్రళయం వచ్చినట్టయ్యింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జంపన్నవాగు ఉగ్రరూపం దాల్చింది. ఎప్పటిలాగే వాగు ఉప్పొంగిందని అనుకున్నారు ఆ పల్లె వాసులు. ఉదయం 9 గంటల వరకు మామూలుగానే ప్రవహించిన జంపన్నవాగు మధ్యాహ్నానికి మహోగ్రరూపం దాల్చింది. గంటల వ్యవధిలోనే వరద ఇళ్లను ముంచెత్తింది. సాయంత్రం 3గంటలకు చరిత్రలో ఎన్నాడూ లేని విధంగా కొండాయి గ్రామం అంతటినీ జంపన్నవాగు చుట్ట ముట్టింది.

ఎనిమిది మంది బలి

జంపన్నవాగు వరదంతా ఇళ్లల్లోకి భారీగా చేరుకోవడంతో ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. వరదను దాటి వెళ్తున్న క్రమంలో ఎనిమిది మంది కొట్టుకుపోయి మృతి చెందారు. వీరిలో దబ్బకట్ల సమ్మక్క, ఎమ్డీ అజ్జు, ఎమ్డీ షరీఫ్, ఎమ్డీ మహబూబ్‌ఖాన్, ఎమ్డీ మజీద్ ఖాన్, ఆయన బార్య లాల్‌బీ, రషీద్, ఆయన భార్య కరీమాబీ వరదలో కొట్టుకపోయి ప్రాణాలు కోల్పోయారు. క్షణాల వ్యవధిలోనే ఎనిమిది మందిని జంపన్నవాగు బలిగొంది. అలాగే మూగ జీవాలు వాగులో కొట్టుకుపోయాయి. ఇళ్లు నేలమట్టం కావడమే కాక సామగ్రి అంతా నీళ్లపాలైంది. గ్రామస్థులు నిలువ నీడలేక నిరాశ్రయులయ్యారు. ఈ జలప్రళయం ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

కల్వర్టే ప్రాణాలను మిగింది..

మల్యాల, కొండాయి గ్రామాల మధ్య కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల మధ్య ఆశ్రమ పాఠశాలకు కొద్ది దూరంలో కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో రోడ్డును తవ్వి నీళ్లు వెళ్లేందుకు సిమెంట్ పైపులను ఏర్పాటు చేశారు. వాటిపై మట్టి పోసి వదిలేశారు. దీంతో జంపన్నవాగు వరద గ్రామాన్ని చుట్టు ముట్టిన క్రమంలో కల్వర్టులు నీట మునిగి దానిపై పోసిన మట్టి కొట్టుకుపోయింది. వాగు గ్రామాన్ని చుట్టుముట్టడంతో ప్రాణాలను కాపాడుకునేందుకు ప్రజలు ఆరహదారి వెంట బయల్దేరారు. అందులో కొంతమంది ఆ కల్వర్టు దాటి వెళ్తుండగా దానిపై మట్టి కొట్టుకుపోవడంతో లోతులోకి దిగి వరదలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు.

'సురక్షితం' లేని హామీ

జంపన్నవాగు మహోగ్రరూపానికి ప్రాణ, ఆస్తి నష్టాన్ని చవిచూసిన కొండాయిపై అప్పట్లో పాలకుల హామీల వర్షం కురిసింది. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియాను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అందజేశారు. అంతేకాకుండా పూర్తిగా నష్టపోయిన కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఇదే క్రమంలో కొండాయి వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అప్పటి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. అనంతరం అది కార్యరూపం దాల్చలేదు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ దిశగా అడుగులు వేయలేకపోయింది.




కొండాయి వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కొండాయి వాసులు (ఫైల్)

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో సీపీ అంబర్‌కిషోర్ ఝా. నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 26: వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అండర్-17బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీ ముగిసింది. శుక్రవారం క్లబ్‌లో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు వేడుకలకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ఫైనల్స్‌లో తలపడిన పలు జట్ల క్రీడాకారుల ఆట తీరును తీసి హర్షం వ్యక్తం చేశారు.

మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్‌లో శౌర్యకిరణ్ (వరంగల్), కీర్తి మంచాల (జనగామ) బీట్ శ్రీఆదిత్య బొమ్మకంటి (రంగారెడ్డి) రిషితాపాండే (రంగారెడ్డి) జోడి మధ్య ఉత్కంఠభరితంగా జరిగిన హోరాహోరీపోరులో శ్రీఆదిత్య, రిషితపాండే జోడి విజయం సాధించారు. దీంతో శౌర్యకిరణ్, కీర్తి మంచాల ద్వితీయస్థానంతో సరిపెట్టుకున్నారు. అదే విధంగా బాలుర సింగిల్స్‌లో శశాంక్ వనమాల (రంగారెడ్డి) ప్రథమ స్థానం, సాయి నక్షేత్ భటరాజ్ మెదక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల సింగిల్స్‌లో కీర్తి మంచాల(జనగామ) ప్రథమ, అల్లూరి అక్షయ చౌదరి మెదక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా బాలుర డబుల్స్‌లో సాయి సిద్ధార్థ్ రాయప్రోలు, యువసూర్య జాగర్లముడి (హైదరాబాద్) ధృవ్ పరిశేద్ సితి, వివేక్ బొల్లం రంగారెడ్డి జోడి అనివార్య కారణాల వల్ల పోటీలో పాల్గొనకపోవడంతో సాయి సిద్ధార్థ్, యువసూర్యల జోడి విజయం సాధించారు. బాలికలడబుల్స్‌లో లక్ష్మీరిధిమా దేవినేని, సరయు సూర్యనేని (హైదరాబాద్)అనుసంజన మురళి, గాదే స్తుతి గ్రేసిరెడ్డి (రంగారెడ్డి) జోడిపై లక్ష్మిరిధిమా దేవినేని, సరయు సూర్యనేని విజయం సాధించారు.

విజేతలకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకొని పట్టుదలతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చునన్నారు. విద్యార్థులకు విద్య ఎంత అవసరమో క్రీడలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనే సమయంలో కష్టంగా భావించకుండా సంతోషంగా సాధన చేస్తే అనుకున్న గమ్యాన్ని అందిపుచ్చుకోవచ్చునన్నారు. రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించిన అసోసియేషన్ బాధ్యులను సీపీ అభినందిచారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను త్వరలో కేరళ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి చాంపియషన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్, వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి ఎం.రవీందర్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.జితేందర్‌రెడ్డి, మోహన్ రావు, కోశాధికారి డి.నాగకిషన్, కోచ్ కొమ్ము రాజేందర్, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ మృతుడు అశోక్ అంత్యక్రియలు పూర్తి

అశ్రునయనాలతో వీడ్కోలు పలికిన మహ్మద్‌గౌస్‌పల్లి వాసులు



ములుగు, జూలై 26: తాడ్వాయి-గుండాల సరిహద్దు దామెరతోగు అటవీ ప్రాంతంలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు దళసభ్యుడు నల్లమారి అశోక్ అంత్యక్రియలు శుక్రవారం పూర్తయ్యాయి. ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలోని వైకుంఠధామంలో కుటుంబసభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. అశోక్ మృతదేహాన్ని గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి మార్చురీలో భద్రపరిచి.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా శుక్రవారం ఉదయం మార్చురీ వద్దకు సోదరుడు కుమారస్వామి, అక్క భద్రక్క చేరుకొని అశోక్ మృదేహాన్ని గుర్తించారు. పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ నేతృత్వంలో వైద్యులు పోస్టుమార్టం జరిపించి మృతదేహాన్ని వారికి అప్పగించారు. స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం అయినప్పటికీ అశోక్ సోదరుడు కొన్నేళ్లుగా ములుగు జిల్లా ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో మహ్మద్‌గౌస్‌పల్లికి మృతదేహాన్ని తరలించిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు జరిపించారు. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత ఇంటివైపు కన్నెత్తి చూడని అశోక్ తన తండ్రి సంవత్సరీకం రోజునే ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇంటికి తీసుకు వెళ్లకుండా నేరుగా శ్మశాన వాటికకు మృతదేహాన్ని తరలించారు. అశోక్ చితికి ఆయన సోదరుడు కుమారస్వామి నిప్పంటించారు. అమరుల బంధుమిత్రుల సంఘం సభ్యులు జోహార్లు అర్పించారు.



ములుగు ఏరియా ఆస్పత్రి వద్ద పోలీసులు



అశోక్ కుటుంబ సభ్యులు, బంధువులు

గాంధీ ఫెల్లోషిష్‌కు రామేశ్వరం

కేయూ క్యాంపస్, జూలై 26: 2024 ఏడాదికి గాను భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యాచురోపతి పూణే శాఖ నేతృత్వంలోని గాంధీ ఫెల్లోషిష్ ప్రోగ్రాంకు కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ జి.రామేశ్వరం ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహకుల నుంచి తమకు సమాచారం అందినట్లు రామేశ్వరం తెలిపారు. గాంధీ ఫిలాసఫీలో భాగమైన ప్రకృతి వైద్యం (నేచర్ క్యూర్)పై హైదరాబాద్‌లో గల డాక్టర్ బి.వెంకట్‌రావు గాంధీనేచర్ క్యూర్ కాలేజీపై 6 నెలల కాలంలో ప్రొఫెసర్ రామేశ్వరం సమగ్రమైన పరిశోధనలు, పుస్తకాల సేకరణ, రిపోర్టులను రూపొందించాల్సి ఉంటుందని నిర్వహకులు సూచించారు. కాగా ప్రొఫెసర్ రామేశ్వరం తన సొంత ఖర్చులతో హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఇంటర్నేషనల్ న్యాచురోపతి లైబ్రరీ, రిసెర్చ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. రామేశ్వరంను రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పెద్దమల్ల శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ఎంజీఎం మూడో గేటు ఓపెన్

వరంగల్ మెడికల్, జూలై 26: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మూడోగేట్ కొన్నేళ్ల తర్వాత శుక్రవారం తెరుచుకుంది. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కు అయిన ఎంజీఎం ఆస్పత్రికి మూడు ప్రధాన గేట్లు ఉన్నాయి. ఒకటో గేటు క్యాజువాలిటీ,ఎ మర్జెన్సీ పిల్లల వార్డుకు వెళ్లేందుకు వీలుగా ఉంటుంది. ఇక రెండో గేటు మీదుగా ఉదయం ఓపీ, పరిపాలన భవనం, ప్రధాన వార్డుల్లోకి సులువుగా వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు వైపు ఉన్న మూడో గేటును కొన్నేళ్లుగా తాళం వేసి పెట్టారు. వాహనాల రాకపోకలను నిషేధించారు. ఆ వైపు వెళ్లాలనుకునే రోగులకు గేటు మూసి ఉండటంతో అసౌకర్యంగా ఉండేదని రోగులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎట్టకేలకు శుక్రవారం నుంచి మూడో గేటు ద్వారా వాహనాల రాకపోకలకు ఎంజీఎం అధికారులు అనుమతించారు.



కేయూ ఫార్మసీ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్, జూలై 26: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ తీరును కేయూ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు పరిశీలించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందుల లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



పరీక్షల తీరును పరిశీలిస్తున్న కంట్రోలర్ నరసింహచారి, తదితరులు

'సఖీ' సేవలపై మహిళలకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ పి. ప్రావీణ్య

సుబేదారి, జూలై 26: సఖీ వన్‌స్టాప్ కేంద్రాల ద్వారా అందించే సేవలపై విస్తృతంగా మహిళలకు అవగాహన కల్పించడానికి కృషి చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. శుక్రవారం సుబేదారి ఎక్సైజ్ కాలనీలోని హనుమకొండ జిల్లా సఖీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. సోషల్‌మీడియా ద్వారా సఖీ కేంద్రాలు అందిస్తున్న సేవలకు ప్రచారం కల్పించి మహిళలలో అవగాహన కల్పించాలని కోరారు. సఖీ - వన్‌స్టాప్ కేంద్రం ద్వారా బాధిత మహిళలకు తక్షణ సహాయంగా కౌన్సెలింగ్, వైద్య సహాయం, పోలీసు సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. తాత్కాలిక వసతి పొందిన వారికి కిట్లను కూడా ఇవ్వనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య చెప్పారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ వేధింపులు, హింస నుంచి రక్షణ కల్పించడానికి వారికి అవసరమైన అన్నిరకాల సహాయాన్ని అందించడానికి వన్‌స్టాప్ సెంటర్ కృషి చేస్తుందని అన్నారు. సఖీ కేంద్రాన్ని సంప్రదించడానికి మహిళా హెల్ప్‌లైన్, ఆడపిల్లల హెల్ప్‌లైన్లు ఉన్నాయని చెప్పారు. సఖీ కేంద్రాన్ని సంప్రదించేందుకు 0870-2452112 నంబర్ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం సఖీ కేంద్రం కోసం నిర్మిస్తున్న నూ తన భవనాన్ని సందర్శించి మిగిలిన పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకరావాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూ వో మధురిమ, సఖీ సెంటర్ ఆర్గనైజర్ హైమావతి, రహదారులు, భవనాల శాఖ ఈఈ సురేష్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ కలెక్టరేట్: ఇన్‌స్పైర్ మనక్ - 2024 పోస్టరును జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలో ఇన్‌స్పైర్ మనక్ పథకంలో నమోదైన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నీ తమ విద్యార్థులతో నూతన ఆవిష్కరణలను నమోదు చేయించి జిల్లాను 100శాతం నామినేషన్లతో ముందు స్థానంలో ఉంచాలన్నారు. జూలై 1వ తేదీన ప్రారంభమైన ఇన్‌స్పైర్ నామినేషన్ల గడువు చివరి తేదీ సెప్టెంబర్15 వరకు ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్‌లో పాల్గొనాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా సైన్స్ అధికారి పాల్గొన్నారు.



సఖీ వన్ స్టాఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

జిల్లా అగ్నిమాపక కేంద్రానికి సిబ్బంది కేటాయింపు

10మంది ఫైర్‌మెన్‌లు, నలుగురు డ్రైవర్ల నియామకం

వరంగల్ క్రైం, జూలై 26: హనుమకొండ జిల్లా అగ్ని మాపక శాఖకు 10 మంది నూతన ఫైర్‌మెన్‌లు, నలుగురు డ్రైవర్లను కేటాయించారు. ఇటీవల జరిగిన ఫైర్ సర్వీస్ పరీక్షలో ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ మేరకు హనుమకొండ జిల్లాకు 14 మందిని కేటాయించారు. జిల్లాలోని హనుమకొండ కేంద్రానికి 6 ఫైర్‌మెన్‌లను, ఇద్దరు డ్రైవర్లను, పరకాల కేంద్రానికి 4 ఫైర్‌మెన్‌లు, ఇద్దరు డ్రైవర్లను కేటాయించారు. వీరు శనివారం విధుల్లో చేరనున్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దళితుల అభివృద్ధి'

కాజీపేట, జూలై 26: గతంలో, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దళితులకు న్యాయం, అభివృద్ధి జరిగిందని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్ అన్నారు. కాజీపేటలో శుక్రవారం అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మనోహర్ మాట్లాడారు. ఈ బడ్జెట్‌లో ఎస్సీల అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టీ, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్.ప్రీతమ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అన్ని నియోజక వర్గాల్లో ఎస్సీలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి దళిత వర్గాలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని సందర్శించిన ఆర్డీవో

ధర్మసాగర్ జూలై 26: ప్రభుత్వ భూములను ఆర్డీవో వెంకటేష్ శుక్రవారం సందర్శించారు. 'కుడా' పరిధిలో ఉన్న ఉనికి చర్ల గ్రామంలో స్థానిక రైతులు, కుడా భూములకు సంబంధించి హద్దుల విషయంపై సర్వేనంబర్ 325లోని ప్రభుత్వ భూమిని ఆర్డీవో వెంకటేశ్ పరిశీలించారు. అదే విధంగా ధర్మసాగర్ మండలం ఇనుపరాతి గట్లలోని ప్రభుత్వానికి, ఫారెస్టుకు సంబంధించిన సర్వే నెంబర్ 531లో గల భూవిని పరిశీలించారు. తహసీల్దార్ సదానందం, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేవీ ఉపాధ్యాయుడికి కళారత్న అవార్డు

మడికొండ, జూలై 26: కాజీపేట మండలం కడిపికొండలోని కేంద్రియ విద్యాలయంలో చిత్ర కళా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అన్నాబత్తుల వెంకన్న కళారత్న ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్ సొసైటీ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆన్‌లైన్ చిత్రకళా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇందుకుగాను నిర్వాహకులు వెంకన్నను ప్రతిష్ఠాత్మకమైన కళాగౌరవ్, కళారత్న అవార్డులతో సత్కరించారు. అలాగే ఇండియన్ ఆర్ట్ సొసైటీ నిర్వహించిన ఆన్‌లైన్ చిత్ర కళా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రఖ్యాత చిత్రకళాకారుడు ఎం.ఎఫ్. హుస్సేన్ అవార్డును కూడా సొంతం చేసుకున్నారు. శుక్రవారం విద్యాలయ ప్రిన్సిపాల్ సుభాషిణి చేతుల మీదుగా వెంకన్న అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేఎంసీ ప్రిన్సిపాల్‌ను కలిసిన వైద్యుల సంఘం నేతలు



డాక్టర్ రాంకుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

వరంగల్ మెడికల్, జూలై 26: కేఎంసీ ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కాటం రాంకుమార్‌రెడ్డిని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కేఎంసీ విభాగం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాటం రాంకుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంబి శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ కరుణాకర్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.మురళి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ కె.రాంమోహన్, డాక్టర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఐనవోలు, జూలై 26: ఐనవోలు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్లిన ముగ్గురు ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, మహేందర్‌లను శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, మధుకర్, భీమళ్ల సారయ్య, లక్ష్మి, విజయ, రేవతి, భవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూలై 26: బల్దియా కార్యాలయం ఆవరణలోని క్యాంటీన్ మరమతు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మూతబడ్డ క్యాంటీన్ పునఃప్రారంభించేందుకు చేస్తున్న పనులను సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. క్యాంటీన్ పనులు త్వరగా పూర్తిచేసి అందరికి అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. కమిషనర్‌తో పాటు అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టీపీఆర్‌వో కోల రాజేశ్, టీఎంసీ రమేష్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ను శుక్రవారం వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సందర్శించారు. నిర్వహణ వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహణ అధికారులు పలు విషయాలను కమిషనర్‌కు వెల్లడించారు. ఇప్పటివరకు నగరంలో 10 జంక్షన్‌లలో అడాప్టింగ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, 8 జంక్షన్లలో పనులు పూర్తయ్యాయన్నారు. ఎక్కువ ప్రాంతాల్లో ట్రాఫిక్‌తో పాటు ప్రమాదాలను గుర్తించి రాడార్ సిస్టమ్ ద్వారా సంకేతం సూచిస్తుందని చెప్పారు. ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. బల్దియా పరిధిలో సర్వేలెన్స్‌లో భాగంగా ఇప్పటి వరకు 500 కెమెరాలను బిగించామని, 200 సీసీ కెమెరాలు పోలీసు శాఖకు కేటాయించామని, మరో 300 పౌరసేవల నిమిత్తం వినియోగిస్తున్నామన్నారు. బంధం చెరువు ప్రాంతంలో 75 కెమెరాలను ఏర్పాటు చేశామని, వర్షాకాలం నేపథ్యంలో నీటి ప్రమాదాలను ముందస్తుగా గుర్తించేందుకు కెమెరాలను బిగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీన్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఐటీ టెక్నీషియన్ రమేష్, పీఎంసీ ఆనంద్ ఓలేటితో పాటు అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రజా సంఘాలు కీలకం

సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

బాలసముద్రం, జూలై 26: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా సంఘాలు కీలకమని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు ఈ నెల 31 న నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని ఆ ప్రజా పోరాటాలను నిర్మించేందుకు ప్రజా సంఘాలు కీలకమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు డబుల్‌బెడ్‌రూంలు, ఇళ్ల స్థలాలు ఇస్తామని నిర్లక్ష్యం చేసినందువల్లే అధికారం కోల్పోయిందని భిక్షపతి అన్నారు. ఈ కార్యక్రమంలో బాషబోయిన సంతోష్, సిరబోయిన కరుణాకర్, మద్దెల ఎల్లేష్, మంచాల రమాదేవి, కొట్టిపాక రవి, వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్, శంకర్ నాయక్, నిమ్మల మనోహర్, ప్రణీత్‌గౌడ్, లావుడ్య రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

వడ్డేపల్లి, జూలై 26: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశాల్లో విద్యా రంగానికి తగిన బడ్జెట్ కేటాయించకుండా ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి అన్నారు. బడ్జెట్‌లో విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తూ యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాదం తిరుపతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కేవలం 7.3 శాతం నిధులు కేటాయించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్‌నాయక్, నగర నాయకులు రాకేష్, రాజేష్, శ్రీకాంత్, హరీష్, సంపత్, శ్రీనాథ్, విజయ్, లక్ష్మణ్, లలిత,అనూష, స్వాతి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వీర సైనికులకు ఘన నివాళి

రాంనగర్, జూలై 26: కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని నగరం లోని 1వ డివిజన్ పలువేల్పుల వద్ద కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులకు నివాళులర్పించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, స్థానికుల సమక్షంలో కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముత్తినేని రమేశ్, కుమార్‌రెడ్డి, చిర్ర శ్రవణ్, వెంకటేష్, సమ్మయ్య, రణధీర్, శ్రీనివాస్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మల్టీజోన్-1 ఆయుష్ ఉద్యోగుల బదిలీ

• వైద్యులు, ఫార్మసిస్టుల బదిలీ ఆర్డర్‌ల అందజేత • 47 మంది వైద్యులు, 40 మంది ఫార్మసిస్టులకు స్థానచలనం

గిర్మాజీపేట, జూలై 26 : సాధారణ బదిలీలలో ఆయుష్ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకులు పరిధిలోని మల్టీజోన్-1 పరిధిలోని (పాత వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు) 87మంది ఆయుర్వేద, హోమియో, యూనాని వైద్యాధికారులు, ఫార్మసిస్టులకు శుక్రవారం బదిలీలు జరిగాయి. హనుమకొండలోని ఆయుష్ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుల కార్యాలయంలో ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ రవినాయక్ బదిలీ ఉత్తర్వులను అందించారు. బదిలీ అయిన వారిలో 47మంది మెడికల్ ఆఫీసర్లు, 40 మంది ఫార్మసిస్టులు ఉన్నారు. ఇందులో వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.స్వరూప ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరి వేములవాడ (రాజన్న సిరిసిల్ల)కు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో అమినాబాద్ ఆయుర్వేద డిస్పెన్సరిలో పనిచేస్తున్న డాక్టర్ కె.వసంత ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్‌గా బదిలీపై వస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి ఫార్మసిస్ట్ బి.కుమారస్వామి హసన్‌పర్తి ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీకి బదిలీ అయ్యారు. అలాగే ఎలుకుర్తి ఆయుర్వేద డిస్పెన్సరి ఫార్మసిస్ట్ బి.శంకర్, లక్ష్మిపూర్ ఆయుర్వేద డిస్పెన్సరి ఫార్మసిస్ట్ కె.రమేష్‌బాబు వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఆయుర్వేద బోధన ఆస్పత్రి కార్యాలయం సూపరింటిండెంట్ బిల్లా కుమారస్వామి ఆయుష్ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుల కార్యాలయానికి, ఇక్కడ పనిచేస్తున్న పులిరాజు వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రికి బదిలీ అయ్యారు. వీరిలో డాక్టర్ కె.వసంత, కార్యాలయ సూపరింటిండెంట్‌లు నూతన విధుల్లో చేరారు. మిగిలిన వైద్యులు, ఫార్మసిస్టులు శనివారం విధుల్లో చేరనున్నారు. బదిలీ ఉత్తర్వులు తీసుకునేందుకు ఆయుష్ వైద్యులు, ఫార్మసిస్టులు తరలిరావడంతో శుక్రవారం ఆయుష్ వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుల కార్యాలయం రద్దీగా మారింది. అయితే సీనియర్ మెడికల్ ఆఫీసర్లు, నాల్గవ తరగతి సిబ్బంది బదిలీ ఉత్తర్వులు శనివారం రానున్నట్లు తెలిసింది.



వైద్యులు, ఫార్మసిస్టులకు బదిలీ ఆర్డర్‌లు అందిస్తున్న రవినాయక్

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులకు గండి కొట్టిన కాంగ్రెస్ సర్కార్

మడికొండ, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో గ్రేటర్ వరంగల్‌కు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ సర్కారు పూర్తిగా వివక్ష చూపుతోందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్ విమర్శించారు. దళితులపై సర్కార్ చూపిస్తున్న వివక్షను నిరసిస్తూ శుక్రవారం మడికొండ చౌరస్తాలో 45, 46, 64 డివిజన్ల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.36,750కోట్ల నుంచి రూ.33,150కోట్లకు తగ్గించి దళితులపై రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా వివక్ష చూపుతోందని మండిపడ్డారు. దళితుల న్యాయం కోసం బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లానాయకులు పొనగోటి వెంకట్రావు వర్ధన్నపేట నియోజకవర్గ కోకన్వీనర్ తౌటిరెడ్డి రవిందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నాగవెల్లి గోపికృష్ణ, 45వ డివిజన్ అధ్యక్షులు చెన్నబోయిన శివకుమార్, 64వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ నవీన్, బీజేవైఎం జిల్లా నాయకుడు తక్కళ్లపల్లి నిఖిల్‌రావు, స్థానిక నాయకులు దార ధనుంజయ్, గుర్రాల రాకేశ్, మాచర్ల రంజిత్, దుప్పెల్లి అరవింద్, పసుల శ్రీకాంత్, బల్సుకూరి లక్ష్మణ్, పండుగ రాజ్‌కుమార్, కొడవటి అరవింద్, ఈర్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.



మడికొండ చౌరస్తాలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ శ్రేణులు

విద్యార్థులను అభినందించిన డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 26: ప్రేరణ జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను డీఈవో అబ్దుల్ హై శుక్రవారం అభినందించారు. ఆగస్టు 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గుజరాత్‌లోని వాదనగర్‌లో జరగనున్న అఖిల భారత జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు జిల్లా నుంచి పంతిని పాఠశాలకు చెందిన కర్ణకంటి అక్షయ్‌రామ్, కాజీపేట బాలికోన్నత పాఠశాలకు చెందిన గండి వర్ష ఎంపిక అయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులుకూడా ఈ శిక్షణ శిబిరాల్లో పాల్గొంటారని, ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఎ.శ్రీనివాస్, పంథిని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ఆనందం, ఉపాధ్యాయులు బి.సునీత, ఏ.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్, జూలై 26: బడ్జెట్‌లో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తూ రూ.325 కోట్ల నిధులు సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించిన సందర్భంగా ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అజీజ్‌ఖాన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్, కోశాధికారి తోట శ్యామ్, సభ్యులు లిల్లీ ఫోరెన్స్, కందుల సృజన్‌కాంత్, డీఎస్ కోచ్‌లు శ్రీమన్నారాయణ, ఎం.డి. అఫ్జల్, విష్ణు, కొత్త ప్రశాంత్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

ఐనవోలు, జూలై 26: ఐనవోలు- వెంకటాపురం- కాజీపేట ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని గ్రామస్థులు ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఉదయం 7 గంటలకు సాయంత్రం 5 గంటలకు రావాల్సిన బస్సు వారం రోజులుగా నడపడటం లేదని, దీంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పెర్కొన్నారు. గతంలో మాదిరిగానే కాజీపేట నుంచి బస్సు సౌకర్యంను పున ప్రారంభించాలని కోరారు. సొసైటీ డైరెక్టర్ మేటి చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గుడ్డేటి కృపాకర్, శ్రీదేవి, లలిత పాల్గొన్నారు.



ఆర్ఎం అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న చిరంజీవి తదితరులు

దేశ సత్తాను చాటిచెప్పిన కార్గిల్ పోరాటం

కేంద్ర సమాచార శాఖ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు



ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న అతిథులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 26: కార్గిల్ యుద్ధం జరిగి శుక్రవారం నాటికి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) వరంగల్ ఆధ్వర్యంలో చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో కార్గిల్ విజయోత్సవ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్ సూరునేని ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైతన్య యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, వైస్ చాన్స్‌లర్ జి.దామోదర్ హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

బొట్ల రమేష్ బదిలీని రద్దు చేయాలి

వరంగల్ కార్పొరేషన్, జూలై 26: ఇటీవల బల్దియా పరిధిలో జరిగిన సీనియర్ అసిస్టెంట్ల బదిలీలలో తమ సంఘం నేతకు అన్యాయం జరిగిందని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకుబ్ పాషా అన్నారు. శుక్రవారం వివిధ కార్మిక సంఘాల నాయకులు కుడా కార్యాలయం ఆవరణలోని ఆర్‌డీఎంఏ కార్యాలయంలో రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి షాహిద్ మజూద్‌ను కలిసి వినతి పత్రం అందించారు. బల్దియాలో జరిగిన బదిలీలలో కొందరు సిబ్బంది పొరపాటు వల్ల బైపార్ సర్జరీ అయిన ఇజ్రాయెల్‌ను బదిలీ చేశారని, అదే సమయంలో ముందుగా తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొట్ల రమేష్‌ను జీవో ప్రకారం మినహాయించి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. తర్వాత ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో సిబ్బంది యూనియన్ నాయకుడైన బొట్ల రమేష్‌ను ఖమ్మంకు బదిలీ చేయడం అన్యాయం అన్నారు. రమేష్ తర్వాత గడ్డం దేవరాజు, ఆ తర్వాత వరుసలో ఉన్న మరో 20 మందిలో బదిలీ చేసే అవకాశం ఉందన్నారు. వెంటనే రమేష్ బదిలీని రద్దు చేయాలని వెల్లడించారు. టీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకుబ్ పాష, ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు సారంగపాణి, తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నవ్య

కుటుంబ కదంబం

పాలతో ఓ పానీయం 'వాసాధిక'

ఉదకరస నివృత్తం గోమయాగ్రావిపక్వం నవదళ ఘన సర్పైర్వాసితంబష్కయిణ్యాః!
పటమిలిత సుఖండం స్థాపితం నవ్య పాత్రే విగతతర సుధాంశో గీయతే వసధిక్య!

పాలు ఆరోగ్యాన్నీ, పోషణనీ, శక్తినీ అందించే ముఖ్య ఆహార ద్రవ్యం. పాలే ప్రధాన ఆహారం కూడా. పసిపిల్లలు పాలు మాత్రమే తాగుతూ పెరుగుతారు. పాలు సంపూర్ణ ఆహారమే. కానీ, వయసు పెరిగే కొద్దీ కేవలం పాలు తాగి మనిషి జీవించలేడు. ఎందుకని? ఆరు రుచుల్లో తీపి మాత్రమే పాలలో ఉంటుంది. తక్కిన పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు పాలలో ఉండవు. కాబట్టి, పాలను అతిగా తీసుకోవటాన్ని ఆయుర్వేద శాస్త్రం ఒప్పుకోదు. చ్యవనప్రాశ, అశ్వగంధాది లేహ్యం, బ్రాహ్మీరసాయనం లాంటి ఆరు రుచులు కలిగిన ఔషధాలకు అనుపానంగా పాలను తీసుకోవటం మంచిది. కొన్ని తీక్షణమైన ఔషధాలకు అనుపానంగా మాత్రమే పాలు కలిపిన అన్నం



తినాలంటారు. అది కూడా కొద్ది రోజులు మాత్రమే! జన్మంతా పాలు తాగి ఋషులు కూడా జీవించలేరు. ఉపవాసాల సమయంలో పాలు మాత్రమే తీసుకోవటాన్ని కూడా ఆయుర్వేద శాస్త్రం ఒప్పుకోదు.

పాలు ఆహారం మాత్రమే కాదు... ఔషధం కూడా! ఔషధాన్ని మోతాదు ప్రకారం విధియుక్తంగా తీసుకోవాలి. ఆయుర్వేద శాస్త్రం ఆవు పాలు, గేదె పాలు, ఇంకా ఇతర జంతువుల పాలకు వేర్వేరుగా వేటి గుణాలను వాటికి వివరించింది. పాలన్నీ తెల్లగానే ఉంటాయి. అలాగని అన్నీ ఒకే గుణం కలిగిన పాలు కావు.

ఆవు పాలతో 'వాసాధిక'...

ఆవు పాలతో ఆరోగ్యదాయకంగా 'వాసాధిక' పానీయం ఎలా తయారు చేసుకోవాలో 'క్షేమ కుతూహలం' గ్రంథంలో క్షేమశర్మ వివరించాడు...

అనేక దూడలను పెట్టిన ఆవు పాలు శ్రేష్ఠం. పాలకు సమానంగా నీళ్ల కలపాలి. ఆవు పిడకల మీద దాలిగుంటలో ఈ పాల కుండను ఉంచి, సగం వరకూ ఆవిరయ్యే దాకా మరిగించండి. చల్లారిన తరువాత ఆ పాలలో తగినంత పంచదార, చిటికెడంత పచ్చకర్పూరం కలిపి, మంచి వస్త్రం తీసుకుని, అందులో ఈ పాలను వేరే పాత్రలోకి వడగట్టండి. ఇదే 'గవ్య వాసాధిక' అనే పానీయం. ఇది అమృతాన్ని విగతతరం చేస్తుందన్నాడు. అంటే ఓడిస్తుందన్నమాట.

గేదె పాలతో...

'పాత్రే నవ్యతరె సుధూప విహితే భృజంతితే మానవా'... ఒక వేళ గేదే పాలే దొరికాయనుకోండి... ఈ పాలను కూడా ఇందాక చెప్పిన పద్ధతిలోనే సగం మరిగేంతసేపు కాచి, చల్లార్చండి. అందులో తీపితో పాటు, మీరు కోరుకున్న పరిమళ ద్రవ్యాలు కలిపి, ఓ కొత్త పాత్రలోకి వడగట్టండి. ఇది 'మాహిష వాసాధిక' అనే పానీయం. శాస్త్ర గ్రంథాలెప్పుడూ సూచన ప్రాయంగా వివరిస్తాయి. వాటిని మన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా, మన అవసరాలకు తగ్గట్టుగా అన్వయించుకోవాలి. కాలానుగతంగా వ్యాఖ్యాతలు నవీన యుగాలకు అనుగుణంగా ప్రాచీన గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాస్తారు.

ప్యాకెట్టు పాలతో

ఇవాళ ప్యాకెట్ పాలు కొనుక్కోవటమే తప్ప స్వచ్ఛమైన పాలు జనసామాన్యానికి దొరికే అవకాశం తక్కువైపోయింది. ఆ పాలు వాడుకునేవారు రెండో పద్ధతిలో వాసాధిక పానీయం తయారు చేసుకోండి. ఇందులో కలిపే పరిమళాలను మన ఇష్టానికి వదిలేశాడు క్షేమశర్మ. మన శరీర పరిస్థితులను బట్టి కావాల్సిన పరిమళ ద్రవ్యాల్ని ఎంచుకోవాలని తాత్పర్యం.

ఎవరికి ఏ పరిమళం..?

వాత శరీర తత్త్వం కలిగినవారు, వాత వ్యాధులతో బాధపడేవారు పాలకు అంతే మొత్తం నీళ్ల కలిపి, సగం మిగిలేలా మరిగించాలి. చక్కెర, జాజికాయ, జాపత్రి, పచ్చకర్పూరం (చిటికెడు) వేసి మిక్సీ పట్టాలి. పావు చెంచా పొడిని ఒక కప్పు పాలలో కలిపి, రాత్రి పడుకోబోయే ముందు తాగితే మంచి నిద్ర పడుతుంది. వాతం ఉపశమిస్తుంది. శరీరానికి మృదుత్వం కలుగుతుంది. మరాఠీ మొగ్గలను కూడా కలపవచ్చు.

పైత్య వ్యాధులతో బాధపడేవారు, వేడి ఎక్కువగా ఉన్నవారు ఈ పాలలో చక్కెరతో పాటు యాలకుల పొడి, పచ్చకర్పూరం, జాజికాయ, జాపత్రి లాంటి చలవనిచ్చే పరిమళ ద్రవ్యాలను కలుపుకోవాలి. కఫ వ్యాధులతో బాధపడేవారు పసుపు, మిరియాలు లవంగాలు, యాలకుల్లాంటివి కలుపుకోవచ్చు. ఆ విధంగా శరీర తత్వాన్ని, ఆరోగ్య స్థితిని బట్టి పరిమళ ద్రవ్యాలను ఎంచుకోవాలి. ఐదు గ్రాముల జాజికాయ, ఐదు గ్రాముల జాపత్రి, రెండు గ్రాముల పచ్చకర్పూరం... ఈ కొలతలతో తయారు చేసిన విశ్రమం అన్ని వ్యాధులకూ ఔషధంగా పని చేస్తుంది. పచ్చకర్పూరం అధికంగా వెయ్యకూడదు. జలుబు చేస్తుంది. పరిమితంగా వాడితే చాలు పరిమళ భరితంగా ఉంటుంది. పచ్చకర్పూరం కలవగానే దేవుడి ప్రసాదం, పవిత్ర ఆహారం అనే భావనలు కలుగుతాయి. అదొక్కటే వేయి ఓషధుల పెట్టు.

• గంగరాజు అరుణాదేవి

వంకాయలతో గుత్తొంకాయ, వంకాయ చట్నీ, వంకాయ ఫ్రై చేసుకోవటం కామన్. అయితే చికెన్, మటన్‌తో వంకాయలను కలిపి చేసుకోవటం డిఫరెంట్. వంకాయ చికెన్, వంకాయ మటన్ కర్రీలను ఈ వీకెండ్‌లో వండుకోండిలా...

వంటిల్లు

నాన్‌వెజ్‌తో వంకాయల దోస్తీ

వంకాయ చికెన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

చికెన్ ముక్కలు- అర కేజీ, నూనె- 2 టేబుల్ స్పూన్లు, మీడియం సైజ్ ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టీస్పూన్లు, మీడియం సైజ్ టమోటాలు-2 (సన్నగా తరగాలి), కారం పొడి- 2 టీస్పూన్లు, ధనియాల పొడి- రెండు టీస్పూన్లు, పసుపు- చిటికెడు, ఎండు మిరపకాయలు- 2, పచ్చ వంకాయలు - 300 గ్రాములు (చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి), గరం మసాలా- టీస్పూన్, కొత్తిమీర- టేబుల్ స్పూన్

తయారీ విధానం

కుక్కర్‌లో నూనె వేడయ్యాక.. ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. ఉల్లిపాయల రంగు మారిపోయిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, టమోటా ముక్కలు వేసి.. గరిటెతో టమోటా ముక్కలను ఒత్తినట్లు కలపాలి. తగినంత ఉప్పు వేశాక.. కారం పొడి, ధనియాల పొడితో పాటు కొద్దిగా పసుపు వేసి, ఎండు మిరపకాయలను సన్నగా తుంచేసి గరిటెతో కలపాలి. మూడు నిముషాల తర్వాత నూనె పైకి తేలి ఉడికినట్లు ఉన్నప్పుడు.. ముందుగా శుభ్రం చేసుకున్న చికెన్ ముక్కలు వేసి కలపాలి. వెంటనే వంకాయ ముక్కలు వేసి కలిపాక.. అరకప్పు నీళ్ల పోసి కలపాలి. కుక్కర్ మూత పెట్టి మూడు విజిల్స్ వచ్చేంత వరకూ ఉడికించుకోవాలి. కుక్కర్ మూత తీసి కలిపిన తర్వాత మరో ఐదు నిముషాలు ఉడికిస్తే నీటి శాతం తగ్గిపోయి గ్రేవీ బాగా వస్తుంది. గరం మసాలా, కొత్తిమీర వేసిన తర్వాత మరో మూడు నిముషాలు ఉడికిస్తే గ్రేవీ చికెన్ ముక్కలకు బాగా పడుతుంది. నూనె పైకి తేలుతుంది. గరిటెతో ఒకసారి తిప్పి రెండు నిముషాల తర్వాత దించేసుకోవాలి. ఈ వంకాయ చికెన్ కర్రీని చపాతీ, పరోటా లేదా అన్నంతో తింటే రుచిగా ఉంటుంది.





వంకాయ మటన్ కూర

కావాల్సిన పదార్థాలు

మటన్- 600 గ్రాములు, పచ్చ వంకాయలు- అర కేజీ, మీడియం సైజ్ టమోటాలు-4 (సన్నగా తరగాలి), నూనె- అరకప్పు, ఎండుమిర్చి- 8, ఎండు కొబ్బెర- పది పొడవైన ముక్కలు, ధనియాలు- రెండున్నర టీస్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్ట్- రెండు టీస్పూన్లు, కొత్తిమీర- రెండు టేబుల్ స్పూన్లు, పసుపు- చిటికెడు, ఉప్పు- రుచికి తగినంత, గరం మసాలా- టీస్పూన్, దాల్చిన చెక్క- చిన్న ముక్క, లవంగాలు- 6

తయారీ విధానం

ముందుగా శుభ్రంగా మటన్‌ను కడిగి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆ తర్వాత బౌల్‌లో మటన్ వేసి.. ఉప్పు, పసుపు వేసి కలిపిన తర్వాత కుక్కర్‌లో వేయాలి. ఒకటిన్నర టేబుల్ స్పూన్ల నూనె వేసిన తర్వాత అరకప్పు నీళ్ల పోసి.. కుక్కర్ మూత పెట్టి ఆరు విజిల్స్ వచ్చేంత వరకూ ఉడికించి పక్కన ఉంచుకోవాలి.

ప్యాన్‌లో ధనియాలు, మిరపకాయలు వేసి వేయించుకోవాలి. వీటిని చల్లార్చిన తర్వాత జార్‌లో ధనియాలు, మిరపకాయలతో పాటు ఎండుకొబ్బరి, దాల్చిన చెక్క, లవంగాలు, గరం మసాలా వేసి మిక్సీ పట్టాలి. ఇందులోనే అల్లం వెల్లుల్లి పేస్ట్, కొత్తిమీర వేసి కొన్ని నీళ్ల పోసి మిక్సీపట్టాలి. చట్నీలా మెత్తగా అవుతుంది.

ముందుగా ఉప్పు నీళ్లలో వంకాయ ముక్కలను పది నిమిషాల ముందు నానబెట్టుకుని రెడీగా ఉంచుకోవాలి. వెంటనే గుంతప్యాన్‌లో విగిలిన నూనె పోసి.. మిక్సీ పట్టిన మిశ్రమం వేసి గరిటెతో కలపాలి. మీడియం ఫ్లేమ్‌లో మాత్రమే మిక్సీ పట్టిన మసాలాను కుక్ చేస్తే నూనె పక్కకు వస్తుంది. అప్పటి వరకూ కలుపుతూ ఉండాలి. ఆ తర్వాత వంకాయ ముక్కలు, టమోటా ముక్కలు వేసి కలపాలి. రెండు నిముషాల తర్వాత ఉడకబెట్టిన మటన్ వేశాక గ్లాసు నీళ్ల పోసి కలిపిన తర్వాత ప్యాన్ మీద మూత ఉంచి ఆరు నిముషాల పాటు కుక్ చేయాలి. గరిటెతో కలిపిన తర్వాత మళ్లీ కుక్ చేయాలి. ఇలా బాగా ఉడుకుపట్టి నూనె తేలేంత వరకూ ఉడికించాలి. మంచి గ్రేవీ కూడా పడుతుంది. వంకాయ ముక్కలు ఉడికాయో లేదో చూసుకుని దించేసుకోవటమే. అన్నంతో లేదా చపాతీతో తింటే రుచిగా ఉంటుంది.

మేకప్

బ్యూటిఫుల్ లుక్ కోసం...

ముఖం కాంతులీనుతూ, శరీరం కళావిహీనంగా కనిపిస్తే ఏం బాగుంటుంది? ముఖంతో పాటు, మెడ, చేతులు ఆకర్షణీయంగా కనిపించడం కోసం బాడీ మేకప్ ఎంచుకోవాలి.

చర్మం నునుపుగా మెరుపులీనుతూ కనిపించేలా చేసే ఈ బాడీ మేకప్ పూర్తిగా శరీరానికే పరిమితం.

• **రెండింటికీ తేడా:** ముఖానికి వేసుకునే మేకప్ పలుచగా, ఎక్కువ మెరుపును కలిగి ఉంటుంది. బాడీ మేకప్ మందంగా ఉండడంతో పాటు, పిగ్మెంట్‌ను కూడా కలిగి ఉంటుంది.

• **దుస్తులకు అంటుకోదు:** ముఖానికి మేకప్ వేసుకుంటే పొరపాటున చెరిగిపోతుందేమోనని కంగారు పడుతూ ఉంటాం. కానీ బాడీ మేకప్ అలా కాదు. ఇది దుస్తులకు అంటుకోదు. అయితే ఎక్కువగా చమట పట్టే తత్వం ఉన్నవాళ్ల మేకప్ చెరిగినా దుస్తులకు అంటుకున్నట్టు కనిపించకుండా ఉండడం కోసం లేత రంగు దుస్తులను ధరించడం మేలు.

ఇలా ఎంచుకోవాలి

• ఫేసియల్ మేకప్ ఐటమ్స్‌ను ఎంచుకునేటప్పుడు అనుసరించే నియమాలనే బాడీ మేకప్ ఎంచుకునేటప్పుడు కూడా అనుసరించాలి. బాడీ మేకప్‌లో భాగంగా ఎంచుకునే ఫౌండేషన్లు, కన్‌సీలర్లూ నాణ్యమైనవే అయి ఉండాలి.

• చర్మపు రంగుకు దగ్గరగా ఉండే బాడీ మేకప్ ఎంచుకోవాలి. లేత గులాబీ రంగు చర్మం కలిగినవాళ్ల, బీజ్, క్రీమ్ షేడ్స్ ఎంచుకోవాలి. ఐవరీ, బఫ్, ట్యాన్ బాడీ షేడ్స్ కూడా బాగుంటాయి.



• బాడీ బ్రాంజర్లు, బాడీ హైలైటర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చర్మపు రంగుకు దగ్గరగా ఉండేవాటినే ఎంచుకోవాలి.

• ఆయిల్ ఫ్రీ, వాటర్ ప్రూఫ్... ఈ రెండు పేర్లు ఉన్న వాటినే ఎంచుకోవాలి.

మేకప్‌కు ముందు

• చర్మానికి నాణ్యమైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.
• పగుళ్ల, గాయాలు లాంటివి లేకుండా చూసుకోవాలి.
• మానిక్యూర్, పెడిక్యూర్ చేయించుకోవాలి.
• బాడీ స్క్రబ్బింగ్ లేదా బాడీ పాలిషింగ్‌తో చర్మం మరింత మెరుస్తుంది.
• వ్యాక్సింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి.

బిజినెస్

పసిడి దుకాణాలు కళకళ..



• సుంకం తగ్గింపే కారణం
• మూడు రోజుల్లో రూ.5,000 తగ్గిన ధర

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ పుణ్యమాని నగల షాపులు కిటకిటలాడుతున్నాయి. శుక్రవారం ధర కొద్దిగా పెరిగినా.. బడ్జెట్ తర్వాత 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.5,000 తగ్గి రూ.70,500 సమీపంలో ట్రేడవుతోంది. దీంతో వచ్చిందే చాన్స్ అన్నట్టు కొనుగోలుదారులు పెద్దఎత్తున నగల దుకాణాలకు వస్తున్నారు. బడ్జెట్‌కు ముందు కిలో రూ.లక్షకు చేరువైన వెండి ధర.. ప్రస్తుతం రూ.84,000కు చేరువులో ట్రేడవుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బంగారం, వెండిపై విధించే దిగుమతి సుంకాన్ని బడ్జెట్‌లో 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించారు. ఇది కొనుగోలుదారులతో పాటు నగల వ్యాపారులకూ కలిసి వస్తోంది.

దిగుమతి సుంకం తగ్గింపుతో ఆర్థిక మంత్రి పసిడి స్మగ్లింగ్‌కూ చాలా వరకు చెక్ పెట్టారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీంతో కిలో బంగారం దిగుమతిపై చెల్లించే దిగుమతి సుంకం రూ.9.82 లక్షల నుంచి రూ.3.93 లక్షలకు తగ్గింది. కాగా శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం రూ.50 పెరిగి రూ.70,700కు చేరింది. ఇదే సమయంలో కేజీ వెండి ధర రూ.400 పెరిగి రూ.84,400కు చేరింది.

దేశవ్యాప్తంగా ఒకే ధర !

ప్రస్తుతం బంగారం, వెండికి దేశంలోని ఒక్కో ప్రాంతంలో ఒక్కో ధర ఉంది. దీనికి గుడ్‌బై చెప్పి 'ఒకే దేశం, ఒకే ధర' కోసం బులియన్ మార్కెట్ వర్గాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. వచ్చే నెల నుంచి పశ్చిమ బెంగాల్‌తో పాటు తూర్పు భారతం అంతా ఒకే ధర విధానం అమలు చేసేందుకు పరిశ్రమ వర్గాలు చర్యలు చేపట్టాయి. ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు దీన్ని విస్తరిస్తామని 'ఆలిండియా జెమ్స్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) చైర్మన్ సయామ్ మెహ్రా చెప్పారు.

పసిడి పీఎస్‌యూలను ప్రైవేటీకరించండి: అనిల్ అగర్వాల్

ప్రస్తుతం మన దేశ పసిడి అవసరాల్లో 99.9 శాతానికి దిగుమతులే దిక్కు. ప్రభుత్వ రంగంలోని భారత్ గోల్డ్ మైన్స్, హట్టి గోల్డ్ మైన్స్ కంపెనీలను ప్రైవేటీకరిస్తే ఉత్పత్తి భారీగా పెరిగి దిగుమతుల భారం చాలా వరకు తగ్గుతుందని వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అన్నారు. ఇలా చేయడం వల్ల పసిడి ఉత్పత్తిలో భారత్.. ప్రముఖ దేశంగానూ అవతరిస్తుందన్నారు. దీనివల్ల పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ ఏర్పడతాయని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

బ్యాచిలర్స్‌కు అచ్చిరాని మార్కెట్

పెళ్లయిన వారికే ఇంట్రాడే ట్రేడింగ్‌లో లాభాలు • సెబీ అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ: పెళ్లికాని ప్రసాదులకూ స్టాక్ మార్కెట్ ఇంట్రాడే ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్ పెద్దగా కలిసి రావడం లేదు. ఈ సెగ్మెంట్‌లో బ్రహ్మచారులతో పోలిస్తే. పెళ్లయిన వారే బాగా రాణిస్తున్నారు. 2019-2023 ఆర్థిక సంవత్సరాల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్లో మదుపరుల తీరుతెన్నులపై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ జరిపిన ఒక అధ్యయనంలో ఈ విషయం తేలింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇంట్రాడే ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ చేసిన బ్రహ్మచారుల్లో 75 శాతం మంది నష్టపోతే.. నష్టపోయిన పెళ్లయిన వారి శాతం 67 శాతం మాత్రమేనని సెబీ వెల్లడించింది. దీనికి తోడు బ్రహ్మచారులతో పోలిస్తే పెళ్లయిన వారే ఎక్కువగా ఇంట్రాడే ఈక్విటీ ట్రేడింగ్ చేస్తున్నట్టు వెల్లడైంది.



మహిళలకే అధిక లాభాలు: సెబీ అధ్యయనంలో మరో ఆసక్తికరమైన అంశం వెల్లడైంది. క్యాష్ సెగ్మెంట్‌లో ఇంట్రాడే ఈక్విటీ ట్రేడింగ్ చేసే మహిళలతో పోలిస్తే.. పురుషులే ఎక్కువగా నష్టపోతున్నట్టు వెల్లడైంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి అంత కంటే ఎక్కువ మొత్తానికి ఇంట్రాడే ఈక్విటీ ట్రేడింగ్ చేసిన పురుషులు సగటున రూ.38,570 నష్టపోయారు. ఇదే సమయంలో మహిళల విషయానికి వచ్చే సరికి ఇది రూ.22,153 మాత్రమేనని సెబీ అధ్యయనం పేర్కొంది. ఇదే కాలంలో ఇంట్రాడే ఈక్విటీ ట్రేడింగ్ చేసే మహిళల శాతం 20 నుంచి 16 శాతానికి పడిపోవడం మరో విశేషం.

ఎక్కువ నష్టపోతోందీ కుర్రాళ్లే..: ఇంట్రాడే ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో పెద్ద వాళ్లతో పోలిస్తే కుర్రాళ్ల ఎక్కువగా నష్టపోతున్నట్టు సెబీ అధ్యయనం తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ట్రేడింగ్ తీరుతెన్నులను పరిశీలిస్తే 60 ఏళ్లకు పైబడిన ఇంట్రాడే ఈక్విటీ ట్రేడర్లలో 53 శాతం మంది నష్టపోయారు. రెండు పదుల కంటే తక్కువ వయసు ఉన్న వారికి వస్తే, వీరిలో 81 శాతం మంది ఇంట్రాడే ఈక్విటీ ట్రేడింగ్‌లో నష్టపోయారు.

కేఫిన్ టెక్ లాభంలో 57 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ కేఫిన్ టెక్నాలజీస్.. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.68.07 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.43.38 కోట్లు)తో పోల్చితే లాభం 57 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం రెవెన్యూ కూడా 31 శాతం వృద్ధితో రూ.181.50 కోట్ల నుంచి రూ.237.56 కోట్లకు పెరిగింది. త్రైమాసిక కాలంలో వివిధ వ్యాపార విభాగాలు నిలకడైన పనితీరును కనబరచటంతో ప్రోత్సాహర ఫలితాలను నమోదు చేసినట్లు కేఫిన్ టెక్ ఎండీ, సీఈఓ శ్రీకాంత్ నాదెళ్ల తెలిపారు. కొత్త కాంట్రాక్టులపై ఒప్పందాలు కుదుర్చుకోవటం కూడా కలిసివచ్చిందని పేర్కొన్నారు.

నిఫ్టీ కొత్త రికార్డు

5 రోజుల నష్టాలకు తెర దించిన మార్కెట్

ముంబై: ఈక్విటీ మార్కెట్ ఐదు రోజుల వరుస నష్టాలకు తెర దించింది. అమెరికాలో జీడీపీ గణాంకాలు ఆశించిన దాని కన్నా మెరుగ్గా ఉండడంతో పాటు ఇన్వెస్టర్లు "తగ్గినప్పుడు కొను" అనే సూత్రాన్ని పాటించి విలువ ఆధారిత కొనుగోళ్ల జరపడం మార్కెట్‌కు ఊపిరులు పోసింది. ఇన్ఫోసిస్, ఎయిర్‌టెల్, ఆర్ఐఎల్ వంటి బ్లూచిప్ షేర్లలో జరిగిన కొనుగోళ్ల మార్కెట్‌ను పరుగులు పెట్టించాయి. ఈక్విటీ సూచీలు 1.7 శాతం మేరకు లాభపడ్డాయి. నిఫ్టీ అయితే సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. 428.75 పాయింట్లు లాభపడి 24,834.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 1,292.92 పాయింట్లు లాభపడి 81,332.72 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,387.38 పాయింట్లు లాభపడి 81,427.18 పాయింట్ల గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే ఈ రెండు స్థాయిలూ గతంలో సెన్సెక్స్ నమోదు చేసిన జీవితకాల గరిష్ఠ స్థాయిల కన్నా దిగువనే ఉన్నాయి. వారం మొత్తం మీద సెన్సెక్స్ 728 పాయింట్లు, నిఫ్టీ 304 పాయింట్లు లాభపడ్డాయి. అయితే గత శుక్రవారం నుంచి ఐదు సెషన్లలో సెన్సెక్స్ 1,303.66 పాయింట్లు, నిఫ్టీ 394.75 పాయింట్ల మేరకు నష్టపోయాయి.

• శుక్రవారం నాటి ర్యాలీతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.7,10,235.45 కోట్ల మేరకు పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి 4,56,92,671.33 కోట్లకు (5.46 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.
• నెస్లె మినహా సెన్సెక్స్ షేర్లన్నీ లాభపడ్డాయి. 4.51 శాతంతో భారతి ఎయిర్‌టెల్ లాభపడిన షేర్లలో ఉంది.
• బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.12 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1 శాతం లాభపడ్డాయి. రంగాలవారీ సూచీలన్నీ కూడా లాభాలతో ముగిశాయి.

ఫారెక్స్ నిధుల సరికొత్త రికార్డు

విదేశీ మారక నిల్వలు జూలై 19వ తేదీతో ముగిసిన వారంలో సరికొత్త రికార్డును నమోదు చేశాయి. ఆ వారంలో నిల్వలు 400 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 67,085.7 కోట్ల డాలర్లకు చేరాయి. ఫారెక్స్‌లో ప్రధాన భాగం అయిన విదేశీ మారక ఆస్తులు 257.8 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 58,804.8 కోట్ల డాలర్లకు చేరడం ఇందుకు దోహదపడింది. ఇదే వారంలో బంగారం నిల్వలు 132.9 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 5,999.2 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,500 ▼	63,900 ▼	88,000 ▼
ముంబై	68,131 ▼	62,408 ▼	81,271 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	102
కర్నూలు	104	నెల్లూరు	102
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

భారత్‌లో తగ్గిన ఐఫోన్ ధరలు

రూ.6,000 వరకు తగ్గింపు

న్యూఢిల్లీ: భారత్‌లో తన ఐఫోన్ల ధరలు 3 నుంచి 4 శాతం (రూ.300 నుంచి రూ.6,000) తగ్గిస్తున్నట్టు యాపిల్ కంపెనీ ప్రకటించింది. కేంద్ర బడ్జెట్‌లో మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ డ్యూటీని 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గించటమే ఇందుకు కారణం. ఈ నిర్ణయంతో భారత్‌లో తయారయ్యే ఐఫోన్ 13, 14, 15 మోడల్స్ ధర రూ.300 తగ్గింది. ఎంట్రీ లెవల్ ఐఫోన్ ఎస్ఈ ధరా రూ.49,900 నుంచి రూ.47,600కు చేరింది. దిగుమతి చేసుకునే తన లేటెస్ట్ మోడల్ ఐఫోన్ 15 ప్రో మోడల్ ధరా రూ.5,100 నుంచి రూ.6,000 వరకు తగ్గింది.

భారత్‌లో ఐఫోన్ 16 తయారీ!: యాపిల్ కంపెనీ ఈ ఏడాది సెప్టెంబరులో తన లేటెస్ట్ ఐఫోన్ 16 మోడల్‌ను మార్కెట్లోకి విడుదల చేయనుంది. ఈ ఫోన్లను భారత్‌లో అసెంబ్లింగ్ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

వాయిస్, డేటా, ఎస్ఎంఎస్‌లకు విడివిడిగా రీచార్జ్ ప్లాన్స్!

కన్సల్టేషన్ పేపర్ విడుదల చేసిన ట్రాయ్

న్యూఢిల్లీ: వాయిస్ కాల్స్, డేటా, ఎస్ఎంఎస్‌లకు విడివిడిగా రీచార్జ్ ప్లాన్లు తీసుకురావాలని టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ భావిస్తోంది. దీనికి సంబంధించి ఒక చర్చాపత్రం విడుదల చేసింది. వచ్చే నెల 16లోగా దీనిపై పరిశ్రమ, వినియోగదారులు, టెలికాం నిపుణులు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. ప్రస్తుతం టెలికాం కంపెనీలు ఈ మూడింటికి కలిపి ఒకే ప్లాన్ రూపంలో అందిస్తున్నాయి. ఇలా బండిల్డ్ ప్లాన్స్ ఇవ్వడంతో చాలా మంది టెలికాం ఖాతాదారులు వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు మాత్రమే వినియోగించుకొని డేటా వినియోగించుకోవడం లేదు. అయినా బండిల్డ్ ప్లాన్స్ కింద డేటాకు కూడా తాము డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ట్రాయ్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ట్రాయ్ ఈ చర్చాపత్రం విడుదల చేసింది. దీనికి తోడు స్పెషల్ టారిఫ్ వోచర్లు, కాంబో వోచర్ల గడువుని ప్రస్తుతం ఉన్న 90 రోజుల నుంచి పెంచడంపైనా ట్రాయ్ స్టేక్‌హోల్డర్ల అభిప్రాయాలు కోరింది.

అర్బన్ సహకార బ్యాంకులపై ఆర్‌బీఐ దిద్దుబాటు చర్యలు

ముంబై: అవసరమైన సమయంలో నియంత్రణాపరమైన పర్యవేక్షణా చర్యలు తీసుకునేందుకు వీలుగా పట్టణ సహకార బ్యాంకులపై ఆర్‌బీఐ సత్వర దిద్దుబాటు చర్యలను (పీసీఏ) ప్రకటించింది. ప్రైమరీ (అర్బన్) సహకార బ్యాంకులపై (యూసీబీ) ఈ చర్యలు వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తాయి. దీని వల్ల నియంత్రణాపరమైన జోక్యం అవసరం అనిపించిన సమయంలో ఆర్‌బీఐ రంగంలోకి దిగి వాటి ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి తగు దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం కలుగుతుంది. బలహీనంగా ఉన్న, ఆర్థికపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న యూసీబీల స్థితిని మెరుగుపరచడం లక్ష్యంగా ఆర్‌బీఐ గతంలో ప్రకటించిన సూపర్‌వైజరీ యాక్షన్ ఫ్రేమ్‌వర్క్ (ఎస్ఏఎఫ్) స్థానంలో ఈ పీసీఏ అమల్లోకి వస్తుందని తెలిపింది.

సెప్టెంబరు వరకు ఈవీ స్కీమ్ పొడిగింపు

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) కొనుగోళ్లను ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రకటించిన విద్యుత్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్ (ఈఎంపీఎస్) గడువును ప్రభుత్వం రెండు నెలలు అంటే సెప్టెంబరు నెల చివరి వరకు పొడిగించింది. దానిపై పెట్టుబడిని కూడా రూ.500 కోట్ల నుంచి రూ.778 కోట్లకు పెంచింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీన ప్రారంభమైన ఈ పథకం గడువు ఈ నెల 31తో ముగుస్తున్న దశలో దీన్ని పొడిగించారు. ఈ-రిక్షాలు, ఈ-కార్ట్‌లు, విద్యుత్ టూ వీలర్లు, త్రీ వీలర్లకు ఈ పథకం వర్తిస్తుంది.

ఓయూ కళాశాలల్లో బీఈ/బీటెక్ లేటరల్ ఎంట్రీ

దిక్సూచి DIKSUCHI



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజ్ సహా వర్సిటీ అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి కళాశాలలో స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు ఉంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో కూడా అందరి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లాసెస్ నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000. వర్సిటీ నిబంధనల మేరకు ఇతర ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

అర్హత: ఏదేని గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. చేరదలచుకున్న ఇంజనీరింగ్ కాలేజీకి 100 కి.మీ.ల పరిధిలో ఉన్న కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు/సంస్థల్లో పని చేస్తూ ఉండాలి. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో స్పెషలైజేషన్‌కు సంబంధించి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 27
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 4
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 8
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 17
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 24
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cugICmlలో చదవండి.

కోటక్ కన్య స్కాలర్‌షిప్

కోటక్ మహీంద్రా గ్రూప్ కంపెనీలు, కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2024-25' నోటిఫికేషన్ వెలువడింది. ప్రతిభావంతులైన బాలికలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు. కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి పూర్తిచేసి గుర్తింపు పొందిన కాలేజీల్లో ఇంజనీరింగ్/మెడిసిన్/బీడీఎస్/ఫార్మసీ/ఆర్కిటెక్చర్/డిజైనింగ్ విభాగాల్లో డిగ్రీ ప్రవేశం పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ నర్సింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరినవారు; బెంగళూరు ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ అడ్మిషన్ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షలు మించకూడదు. ఎంపికైన బాలికలకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఇంటర్నెట్, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ ఖర్చుల కింద ఏడాదికి రూ.లక్షన్నర ఇస్తారు. వార్షిక పరీక్షల్లో కనీసం 6 సీజీపీఏ సాధించేవారికి కోర్సు పూర్తయ్యేవరకూ స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.kotak.com, www.b4s.in/it/kkgs2

పోటీ నీకే - జయం నీదే

కొత్త పుస్తకం


పోటీ పరీక్షలు అంటే గ్రామీణ యువతలో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అయితే వీరిలో ఎక్కువ మంది గ్రూప్స్, టీచర్ వంటి ఉద్యోగాల పట్ల దృష్టిపెడతారు కానీ సివిల్స్ గురించి ఆలోచించరు. రాయాలని ఉన్నా అవి పెద్ద పెద్ద పట్టణాల్లో చదువుకున్నవారికి లేదా టాప్ ర్యాంకర్లకు ఉద్దేశించిన ఉద్యోగాలని భావిస్తుంటారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేసేందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రావులపాటి సీతారామారావు 'పోటీ నీకే - జయం నీదే' పేరుతో పుస్తకం రాశారు.

ఏదో పనిమీద బయటకు వెళ్లినప్పుడు తనను కలిసిన విద్యార్థులు, ఉద్యోగార్థులు పలు సందేహాలు వెలిబుచ్చేవారు. తను వారికి ఇచ్చిన గైడెన్స్ అందరికీ చేరాలనే ఉద్దేశంతో రచయిత ఈ పుస్తకం రాశారు.

విజయం సాధించాలంటే పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉండాల్సిన పనిలేదు. ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని, దాని కోసం క్రమపద్ధతిలో కష్టపడాలని చెబుతారు. పోటీ పరీక్షల కోసం ప్లానింగ్ ఎలా చేసుకోవాలి? ఎన్ని గంటలు చదవాలి? పరీక్షల కోసం సిద్ధమయ్యే వారికి మెంటార్ అవసరమా? అని చెబుతూ తనతో సహా గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు సివిల్స్ వంటి పరీక్షల్లో ఎలా విజయం సాధించారో స్ఫూర్తి కలిగించేలా సవివరంగా చెప్పారు సీతారామారావు. పరీక్షలు రాసే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని అధిగమించిన తీరును పుస్తకంలో వివరించారు.

పరీక్షలకు సిద్ధంకావడానికి ముందే అకడమిక్ పరీక్షలకు, పోటీ పరీక్షలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గ్రహించగలగాలి. చదువుకోవడానికి మూడ్ ఉండాలి, వారం-వర్జ్యం లాంటివి చూసుకోవాలనే మూఢనమ్మకాలు దరిచేరనీయ వద్దు. లక్ష్యం పెద్దగా నిర్ణయించుకున్నపుడు అందుకు అనుగుణంగానే ప్రిపేర్ కావాలి అని చెబుతారు. సెల్ఫ్ మోటివేషన్ పొందడానికి ఏమి చేయాలి? కొంత మంది సివిల్స్ అభ్యర్థులు ఎలా మోటివేట్ అయ్యారు అని వివరించారు. ఇవి సివిల్స్ అభ్యర్థులకు మాత్రమే కాకుండా అన్ని పరీక్షల విద్యార్థులకు ఉపయోగపడతాయి. ఈ పుస్తకాన్ని సాహితి ప్రచురణలు వారు ప్రింట్ చేశారు.

వెల: రూ.90/-
ప్రతులకు: సాహితి ప్రచురణలు 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 002.
ఫోన్: 8121098500



నవ్య | చిత్రజ్యోతి

ఆ పాటలో కేసీఆర్‌ను తలుచుకున్నామంతే!





రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని 'మార్ ముంతా ఛోడ్ చింతా' పాట వివాదంపై సంగీత దర్శకుడు మణిశర్మ స్పందించారు. ఆ పాటలో 'ఇప్పుడేం చేద్దాం' అంటూ కేసీఆర్ అన్న మాటను ఉపయోగించడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించాయి. ఇటీవల ఇచ్చిన ఈ పాట గురించి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో మణిశర్మ వివరణ ఇస్తూ 'సోషల్ మీడియాలో వచ్చే మీమ్స్ ఆధారంగా ఆ పాట ఉంటుంది. కేసీఆర్ అంటే అందరికీ గౌరవం. ఆయన సరదాగా చెప్పిన ఓ పదాన్ని ఇందులో తీసుకున్నామంతే. ఎవరినీ నొప్పించడం మా ఉద్దేశం కాదు. నా 27 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ నొప్పించలేదు. ఆ పాటలో కేసీఆర్‌ను ఒకసారి తలచుకున్నాం. కేవలం అది వినోదం కోసమే. దయచేసి అందరూ అలాగే భావించండి' అన్నారు. 'డబుల్ ఇస్మార్ట్' లోని మూడో పాట 'క్యా లఫ్డా' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రామ్, హీరోయిన్ కావ్యా థాపర్ పోస్టర్ రొమాంటిక్‌గా ఉంది. ఆగస్టు 15న 'డబుల్ ఇస్మార్ట్' విడుదల కానుంది.

మనవడి స్కూలుకు రజనీ



పాఠశాలకు వెళ్లేందుకు మారాం చేసిన తన మనవడిని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్వయంగా స్కూల్‌కు తీసుకెళ్లి వదిలిపెట్టారు. మనవడితో కారులో రజనీ స్కూల్‌కు వెళుతున్న ఫోటోను ఆయన చిన్న కుమార్తె సౌందర్య శుక్రవారం సామాజికా మాధ్యమాల్లో షేర్ చేస్తూ.. 'ఈ రోజు నా కుమారుడు స్కూల్‌కు వెళ్లనని మొండికేయడంతో వాడి సూపర్ హీరో తాత (రజనీ) పాఠశాలకు స్వయంగా తీసుకెళ్లారు. వెండితెర అయినా, నిజజీవితంలో అయినా ఎలాంటి పాత్రనైనా నా తండ్రి అద్భుతంగా పూర్తి చేస్తారు' అని పేర్కొన్నారు. కాగా, సౌందర్య కుమారుడు వేద్‌ను పాఠశాల తరగతి గదిలోకి తీసుకెళ్లిన రజనీకాంత్‌ను ఇతర పిల్లలు సంభ్రమాశ్చర్యాలతో చూశారు. వెండితెరవేల్పు రజనీ తమ కళ్లముందు ప్రత్యక్షమవ్వడంతో వారి ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఇదిలావుంటే, 'వేట్టయాన్' సినిమా పూర్తి చేసిన రజనీకాంత్ ఇపుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో గ్యాప్ లభించడంతో ప్రస్తుతం ఆయన స్థానిక పోయెస్ గార్డెన్‌లో ఉన్న తన నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి, (చెన్నై)

షారుక్ ఖాన్ రూ.40 కోట్లు.. అమితాబ్ రూ.30 కోట్లు...

అనంత్ అంబానీపై సినీ సెలెబ్రిటీల కానుకల వర్షం...



ఆభరణాల సెట్

అమితాబ్ బచ్చన్ దంపతులు, అభిషేక్, ఐశ్వర్య కలసి ఈ వధూవరులకి రూ.30 కోట్ల విలువైన ఆభరణాల సెట్‌ను (పచ్చల హారాన్ని) బహుమతిగా ఇచ్చారు.




ఇటీవలే అంగరంగ వైభవంగా జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌ల వివాహం.. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అత్యంత ఖరీదైన పెళ్లిళ్లలో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చిరకాల వేడుకకు అంబానీ కుటుంబం చేసిన హంగామాని ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారు. ఆకాశంలో చంద్రుడు చుట్టూ ఉన్న అసంఖ్యాక తారల్లా.. అంబానీ పెళ్లిలో అనేక రంగాల్లోని అగ్ర తారలందరూ సందడి చేసి దేదీప్యమానంగా వెలుగులు విరబూశారు. ఈ విలాసవంతమైన పెళ్లికి అదిరిపోయే రేంజ్‌లో అత్యున్నతమైన ఏర్పాట్లకు తోడు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ తారలు హాజరవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకకు వచ్చిన కొందరికి అంబానీ కుటుంబం అతిథి మర్యాదలతో దాదాపు రూ.రెండు కోట్ల విలువ చేసే వాచీలను గిఫ్ట్‌గా ఇచ్చారు. అలాగే సినీ సెలబ్రిటీలు కూడా ఈ కొత్త జంటకు కానుకలు అందించడానికి క్యూ కట్టడం విశేషం. మిగతా పరిశ్రమల నటీనటులు ఏయే బహుమతులు ఇచ్చారో తెలియదు కానీ.. బాలీవుడ్ తారలు ఇచ్చిన బహుమతుల వివరాలు ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి. ఎవరు ఏమేమిచ్చారో ఇప్పుడు తెలుసుకుందాం.



రూ.40 కోట్ల విల్లా

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఈ నూతన జంటకు ఫ్రాన్స్‌లో రూ.40 కోట్లు ఖరీదు చేసే ఓ విలాసవంతమైన భవంతిని కానుకగా ఇచ్చారు.



రూ.20 కోట్ల రోల్స్ రాయిస్

'కల్కి 2898 ఏ.డీ'తో తెలుగువారికి చేరువైన దీపికా పదుకొనే, తన భర్త రణ్‌వీర్ రూ.20 కోట్లు పెట్టి ఓ రోల్స్ రాయిస్ కారును వెడ్డింగ్ ప్రజంటేషన్‌గా ఇచ్చారు.




రూ.15 కోట్ల బైక్

సల్మాన్ ఖాన్ రూ.15 కోట్ల విలువైన స్పోర్ట్స్ బైక్‌ను కానుకగా ఇచ్చారు.

రూ.తొమ్మిది కోట్ల మెర్సిడెస్

రణ్‌బీర్ కపూర్, అలియా భట్ జంట ఈ కపుల్‌కు రూ.తొమ్మిది కోట్ల విలువైన మెర్సిడెస్ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు.









వీరితో పాటు, అక్షయ్ కుమార్ రూ.60 లక్షలు విలువ చేసే బంగారపు పెన్నును.. సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ దంపతులు రూ.25 లక్షలు విలువ చేసే హ్యాండ్ మేడ్ శాలువాను.. విక్కీకౌశల్, కత్రినా కైఫ్ దంపతులు రూ.19 లక్షల బంగారు గొలుసును బహూకరించారు.

మూడేళ్ల కష్టం.. కమిటీ కుర్రోళ్లు



అంతా కొత్తవారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం హీరో సిద్దు జొన్నలగడ్డ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు. ఓ సినిమాకు ఎక్కువ ఖర్చు పెడతాం, మరో చిత్రానికి తక్కువ ఖర్చు పెడతాం.. తేడా అంతే. ఈ సినిమాలో విజువల్స్ బాగున్నాయి. కొత్తవారితో ఇంత మంచి చిత్రం తీయడం మాములు విషయం కాదు. దర్శకుడు యదు వంశీకి ఇదే మొదటి సినిమా అంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఈ సినిమా హిట్ అయి అందరికీ లాభాలు తేవాలి' అని కోరారు. చిత్ర సమర్పకురాలు నిహారిక మాట్లాడుతూ 'మూడేళ్ల కష్టం ఈ సినిమా. వీరంతా మూడేళ్లుగా పని చేస్తునే ఉన్నారు. అంతా కష్టపడి మంచి సినిమా చేశాం. ఆగస్టు 9న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'మా సినిమాలో నటించిన 11 మంది సిద్ధులాగా ఎంతో కష్టపడుతుంటారు. మా టెక్నికల్ టీమ్ సపోర్ట్‌తో సినిమాను బాగా తీయగలిగాను. నిహారిక, ఫణి లేకపోతే చిత్రం ఇలా వచ్చేదే కాదు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ సహకారం మరువలేనిది' అని చెప్పారు దర్శకుడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన యూత్‌ఫుల్ మూవీ ఇదని నిర్మాత ఫణి అడపాక, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ చెప్పారు.

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యూయల్ థీఫ్' సీనియర్ నటి ప్రేమ కీలక పాత్ర పోషించారు. పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఇటీవలే సినిమా టీజర్‌ని, ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'నేను సూపర్‌స్టార్ కృష్ణగారి అభిమానిని. ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఈ తరం ప్రేక్షకులకు నచ్చే సస్పెన్స్ థ్రిల్లర్. త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు.

'పావలా' శ్యామలకు సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం



ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న సీనియర్ నటి 'పావలా' శ్యామలకు హీరో సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం చేశారు.. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుల ద్వారా శ్యామలకు లక్ష రూపాయలు పంపించారు. శ్యామల ఎమోషనల్ అయి 'మా అమ్మాయికి ఆపరేషన్ అయినప్పుడు సాయి దుర్గతేజ్ ఫోన్ చేసి, ధైర్యం చెప్పారు. వచ్చి కలుస్తానన్నారు. చాలా రోజులైంది. మరిచిపోయారేమో అనుకున్నా. గుర్తు పెట్టుకుని సాయం చేసినందుకు ధన్యవాదాలు' అన్నారు.

వాణిజ్య హంగులతో విరాజి



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా ఆద్యంత్ హర్ష తెరకెక్కించిన చిత్రం 'విరాజి'. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. 'గతంలో మా సంస్థలో వరలక్ష్మి శరత్‌కుమార్‌తో 'శబరి' చిత్రాన్ని నిర్మించాం. మేం నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. వరుణ్ సందేశ్ కొత్తలుక్‌లో కనిపిస్తారు. ఆయన గెటప్‌కు కథలో ప్రాధాన్యం ఉంది. మన సమాజంలోని ఒక అంశాన్ని తీసుకొని కమర్షియల్ కోణంలో సినిమాను తెరకెక్కించాం' అని మహేంద్రనాథ్ చెప్పారు.

మనోళ్ల పతక వేట షురూ

కోట్లాది భారతీయుల ఆశలను మోస్తూ.. ప్రఖ్యాత ఒలింపిక్స్ బరిలో నిలిచిన భారత అథ్లెట్లు నేటి నుంచి తమ పతకాల వేటను ఆరంభించనున్నారు. మొత్తంగా కనీసం పది పతకాలైనా సాధించాలనే పట్టుదలతో ఉన్న వేళ.. తొలి రోజున బ్యాడ్మింటన్, షూటింగ్, హాకీ, బాక్సింగ్ ఇలా పలు కీలక క్రీడాంశాల్లో పోటీలు జరుగబోతున్నాయి. గట్టిగా పట్టుబడితే వీటిలో మెడల్స్‌ను అందించగల స్టార్లకు కొదువలేదు. వీరిలో పీవీ సింధు, సాత్విక్-చిరాగ్, నిఖత్ జరీన్, లవ్లీనా, మను బాకర్, హాకీ జట్టుపై భారీ అంచనాలే ఉన్నాయి..

'హ్యాట్రిక్' లక్ష్యంగా సింధు

భారత్‌కు కచ్చితంగా పతకం దక్కే అవకాశం ఉన్న క్రీడ బ్యాడ్మింటన్. ఇప్పటికే 2012 నుంచి వరుసగా మూడు ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు దక్కాయి. ఇప్పుడు భారత్ నుంచి ఏడుగురు షట్లర్లు, నాలుగు విభాగాల్లో బరిలోకి దిగుతున్నారు. ఇందులో సింధు హ్యాట్రిక్ మెడల్ లక్ష్యంతో ఉంది. ఇటీవలి కాలంలో తన ప్రదర్శన మెరుగ్గా లేకపోయినా.. ఒలింపిక్స్‌లో చెలరేగే అలవాటును కొనసాగించాలనుకుంటోంది. మహిళల సింగిల్స్‌లో 13వ ర్యాంకర్ సింధుకు గ్రూప్ దశను దాటడం సులువే. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిలపై స్వర్ణ ఆశలున్నాయి. తొలి రోజు శనివారం పోటీల్లో పురుషుల సింగిల్స్‌లో కెవిన్ కార్డన్ (గ్వాటిమాల)తో లక్ష్య సేన్ ఆడనున్నాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ రోనన్ లాబర్-లుకాస్ కార్వీ (ఫ్రాన్స్)తో.. మహిళల డబుల్స్‌లో అశ్విని-త్రిషా జోడీ కిమ్ సో యూంగ్-కాంగ్ హీ యాంగ్ (కొరియా)తో తలపడనున్నారు.

కివీస్‌తో హాకీ పోరు

గతమెంతో ఘనంగా ఉన్న భారత పురుషుల హాకీ మ్యాచ్ వరుసగా రెండో పతకమే లక్ష్యంగా ఉంది. ఇందులో భాగంగా నేడు న్యూజిలాండ్‌తో తమ ఆరంభ మ్యాచ్‌ను ఆడబోతోంది. పూల్ ఆఫ్ డెత్‌గా భావించే పూల్ 'బి'లో ఉన్న భారత్‌పై అంచనాలు మాత్రం భారీగానే ఉన్నాయి. 41 ఏళ్ల తర్వాత టోక్యో గేమ్స్‌లో పతకం సాధించిన ఈ జట్టుకు దారి క్లిష్టంగానే ఉంది. తమ పూల్‌లోనే ఉన్న ప్రస్తుత చాంపియన్ బెల్జియం, ఆసీస్, అర్జెంటీనా, కివీస్, ఐర్లాండ్‌లతో గట్టి పోటీ ఉండనుంది. అందుకే తొలి మూడు మ్యాచ్‌లను గెలిస్తే నాకౌట్‌కు వెళ్లవచ్చు. చివరి రెండింటిని బెల్జియం, ఆసీస్‌లతో ఆడాల్సి ఉంటుంది. కీపర్ శ్రీజేష్‌కు చివరి గేమ్స్ కాబోతున్నాయి. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్, రాజ్‌కుమార్, జర్మన్‌ప్రీత్‌లతో సమతూకంగా కనిపిస్తోంది.

నిఖత్, లవ్లీనాకు కఠిన డ్రా

భారత్ నుంచి ఆరుగురు బాక్సర్లు బరిలోకి దిగనుండగా.. అందరి దృష్టి తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, లవ్లీనా బొర్గొహైయిన్‌లపైనే ఉంది. అయితే ఈ ఇద్దరికీ కఠిన డ్రా ఎదురైంది. తొలిసారి 50కేజీ విభాగంలో పాల్గొంటున్న నిఖత్ తొలి పోరులో జర్మనీ సంచలనం కరీనా క్లొయెట్జర్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సోమవారం ఈ బౌట్ జరుగనుంది. ఒకవేళ ఇది గెలిస్తే టాప్ ర్యాంకర్ వూ యూ (చైనా)తో సవాల్ ఎదురుకానుంది. ఇక టోక్యోలో కాంస్యం గెలిచిన లవ్లీనా బుధవారం తొలి రౌండ్‌లో సున్నీవా (నార్వే)తో తలపడనుంది. మరోవైపు శనివారం మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ మాత్రమే పోటీ పడనుంది.

తొలి రోజే నాలుగు విభాగాల్లో..

12 ఏళ్లుగా భారత్‌కు షూటింగ్‌లో పతకం దక్కడం లేదు. మొత్తంగా నాలుగు మెడల్స్ అందించిన ఈ విభాగం గత రెండు పర్యాయాలు రిక్తహస్తాలతోనే వెనుదిరిగింది. కానీ ఈసారి ఏకంగా 21 మంది షూటర్లు గురి చేసి గన్ పేల్చేందుకు సిద్ధమయ్యారు. అయితే 10మీ. ఎయిర్ పిస్టల్, 25మీ. పిస్టల్ ఈవెంట్లలో బరిలోకి దిగబోతున్న మను బాకర్‌తో పాటుగా 50మీ. రైఫిల్ 3 పొజిషన్‌లో అదరగొడుతున్న సిఫ్ట్ కౌర్ శర్మపై పతక ఆశలున్నాయి. అలాగే 25మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో పోటీ పడుతున్న హైదరాబాదీ ఇషా సింగ్‌పైనా అంచనాలు నెలకొన్నాయి. మరోవైపు భారత్ తొలి రోజు నాలుగు విభాగాల్లో పోటీ పడనుంది. ఇందులో రెండు మెడల్స్ ఈవెంట్లున్నాయి.



మార్చ్‌పాస్ట్‌లో త్రివర్ణ పతాకంతో శరత్ కమల్, సింధు

ఆరంభ సంబరం
పారిస్ పరవశం

సెన్ నదిలో అలరించిన వేడుకలు ● ఘనంగా ఒలింపిక్స్ ఆరంభం

ఒలింపిక్ గేమ్స్‌కు వందేళ్ల తర్వాత పారిస్ వినూత్న రీతిలో స్వాగతం పలికింది. ఆరంభ వేడుకలను స్టేడియంలో కాకుండా చరిత్రలో తొలిసారి బయట.. అదీ ఓ నదీ ప్రవాహంలో నిర్వహించి ప్రపంచాన్ని అబ్బురపరిచింది. ఓవైపు పారిస్ మధ్యలోని సెన్ నదిలో ఆయా దేశాల అథ్లెట్లంతా పడవల్లో పరేడ్ నిర్వహించగా.. మరోవైపు ఒడ్డున వందలాది కళాకారులు తమ నృత్య రీతులతో ఆకట్టుకున్నారు. అలాగే తమ సంస్కృతీ సంప్రదాయాలను, చరిత్రను సైతం ఆహుతుల ముందుంచారు. ఓవరాల్‌గా చిరుజల్లులలో తడుస్తూనే సాగిన ఈ వేడుకలతో పారిస్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌గా మారిందనడంలో సందేహం లేదు..



పారిస్: ప్రపంచ క్రీడాప్రేమికులంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఒలింపిక్స్ క్రీడలకు సరికొత్త రీతిలో పారిస్ తెర లేపింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య. 'గేమ్స్ వైడ్ ఓపెన్' నినాదంతో ఆరుబయట సాగిన ఈ ఆరంభ వేడుకలు అందరికీ థ్రిల్‌ను పంచాయి. 205 దేశాల నుంచి 6,800 మంది అథ్లెట్లు ఈఫిల్ టవర్ వరకు ఆరు కిలోమీటర్ల మేర ప్రయాణించారు. ఇప్పటివరకు ఒలింపిక్ చరిత్రలో స్టేడియంలో కాకుండా బయట ఆరంభ వేడుకలను నిర్వహించడం ఇదే తొలిసారి. నది మధ్యలో ఉన్న చిన్న బ్రిడ్జిలపై ఏర్పాటు చేసిన స్టాండ్స్‌నుంచే కాకుండా పక్కన ఒడ్డున నుంచి మొత్తంగా 3,20,000 మంది ప్రత్యక్షంగా తిలకించారు. ఈ పరేడ్ రూట్‌లో నిర్వాహకులు 71 భారీ స్క్రీన్లను, వెయ్యి లౌడ్‌స్పీకర్లను ఏర్పాటు చేశారు.

గ్రీస్ రాకతో ఆరంభం: భారత కాలమానం ప్రకారం రాత్రి 11 గంటలకు వేడుకలు ఆరంభమయ్యాయి. ముందుగా ఒలింపిక్ జన్మస్థానమైన గ్రీస్ జట్టు ఆటగాళ్లు బోటుపై రాకతో వేడుకలకు తెర లేచింది. ఆ తర్వాత 37 మందితో కూడిన శరణార్థుల జట్టు అనంతరం అల్ఫాబెట్స్ ప్రకారం అఫ్ఘానిస్థాన్‌తో ఆయా దేశాల జట్ల రాక ఆరంభమైంది. వీటి మధ్యలోనే నది ఒడ్డున ఏర్పాటు చేసిన వేదికపై అమెరికన్ సింగర్ లేడీ గాగా ఫ్రెంచ్ క్యాబరెట్ నృత్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. అటు ఆయా దేశాల అథ్లెట్లు బోట్లపై రావడం.. ఆ వెంటనే కాస్త విరామమిచ్చి అక్కడక్కడా ఏర్పాటు చేసిన వేదికలపై కళాకారులు తమ ప్రదర్శనతో ఆహుతులను ఆకట్టుకోవడం జరిగింది. చివరగా ఆతిథ్య జట్టు ఫ్రాన్స్ ఆటగాళ్లు వచ్చారు.

వేడుకల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, ఐఓసీ చీఫ్ థామస్ బాచ్





లేడీ గాగా

భారత్ నుంచి 78 మంది...

భారత్ నుంచి ప్రారంభోత్సవ కార్యక్రమంలో 78 మంది అథ్లెట్లు, సిబ్బంది పాల్గొన్నారు. వరుస క్రమంలో 84వ దేశంగా పరేడ్‌లో పాల్గొన్న మన దేశం తరఫున ఫ్లాగ్ బేరర్‌గా పీవీ సింధు, ఆచంట శరత్ కమల్ వ్యవహరించారు. ఇక వీరితో పాటు 11 క్రీడాంశాలకు చెందిన దీపికా కుమారి, లవ్లీనా, రోహన్ బోపన్న, నగాల్, మనికా బాత్రా తదితరులు పరేడ్‌లో కనిపించారు. అయితే శనివారమే పోటీలున్న ఇతర విభాగాల అథ్లెట్లు కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. హాకీ జట్టు నుంచి ముగ్గురు రిజర్వ్ ఆటగాళ్లు మాత్రం వేడుకల్లో పాల్గొన్నారు. ఇక ట్రాక్ అండ్ ఫీల్డ్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ జట్లు ఇంకా పారిస్‌కు చేరుకోలేదు. మరోవైపు భారత పురుష అథ్లెట్లు కుర్తా బుండీ, మహిళలు చీరలు ధరించగా వీటిని త్రివర్ణ పతాక రంగులతో రూపొందించారు.

బోట్ల సంఖ్య 85	తిలకించిన ప్రేక్షకులు 3,20,000
పాల్గొన్న అథ్లెట్లు 6800	
పరేడ్ దూరం 6 కి.మీ	
స్టాండ్స్‌ల సంఖ్య 124	



పారిస్‌లో తొలి డోపీ

ఇరాక్ జూడోకాపై వేటు

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో తొలి డోపీ దొరికాడు. ఇరాక్ దేశానికి చెందిన జూడో క్రీడాకారుడు సజ్జాద్ సెహెన్ డోపింగ్ పరీక్షలో పాజిటివ్‌గా తేలాడు. తొలిసారి విశ్వక్రీడల్లో పోటీపడుతున్న 28 ఏళ్ల సజ్జాద్ రెండు రకాల నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినట్టు రుజువైందని అంతర్జాతీయ డోపింగ్ పరీక్షల సంస్థ శుక్రవారం ప్రకటించింది. సజ్జాద్ వచ్చే మంగళవారం తన 81 కిలోల విభాగంలో తలపడాల్సి ఉంది. ఇంతలోనే డోపీగా పట్టుబడడంతో ప్రస్తుతానికి అతనిపై తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. ఫలితంగా అతడు విశ్వక్రీడల నుంచి వైదొలగక తప్పని పరిస్థితి.

పారిస్‌లో నేటి భారతం



షూటింగ్: 10 మీ. ఎయిర్‌రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్, ఫైనల్స్ - సందీప్ సింగ్/ఎలవెనిల్, అర్జున్ బబుత/రమిత (మ. 12.30 నుంచి); 10 మీ. ఎయిర్‌పిస్టల్ వ్యక్తిగత పురుషుల, మహిళల క్వాలిఫికేషన్ (మ. 2 నుంచి) - అర్జున్ సింగ్, చీమా, సరబ్‌జోత్, మనూ భాకర్, రిథమ్ సాంగ్వాన్.
రోయింగ్: పురుషుల సింగిల్స్ స్కల్స్ - పన్వర్ బాల్‌రాజ్ (మ. 12.30 నుంచి).
టెన్నిస్: పురుషుల డబుల్స్ తొలిరౌండ్ - రోహన్ బోపన్న/శ్రీరామ్ బాలాజీ x ఎడ్వర్డ్ రోజర్/ఫాబియాన్ (మ. 3.30 నుంచి).
బ్యాడ్మింటన్: పురుషుల సింగిల్స్ గ్రూప్ మ్యాచ్ - లక్ష్యసేన్ x కెవిన్ కోర్డాన్ (రా. 7.10); పురుషుల డబుల్స్ గ్రూప్ మ్యాచ్ - సాత్విక్/చిరాగ్ x లుకాస్/రోన్ లాబార్ (రా. 8); మహిళల డబుల్స్ గ్రూప్ మ్యాచ్ - అశ్విని/తనీషా x కిమ్ సో యెంగ్/కాంగ్ హీ యాంగ్ (రా. 11.50).
టేబుల్ టెన్నిస్: పురుషుల సింగిల్స్ ప్రిలిమినరీ రౌండ్ - హర్మీత్ దేశాయ్ x జాయెద్ అబో యమాన్ (రా. 7.15).
హాకీ: భారత్ x న్యూజిలాండ్ (రా. 9).
బాక్సింగ్: మహిళల 54 కిలోల ప్రిలిమినరీ రౌండ్ - ప్రీతి పవార్ x తి కిమ్ అన్ (రా. 12.05).

యుద్ధభూమిలోనే ప్రాక్టీస్ చేసి..



పారిస్: రెండేళ్లుగా ఆ దేశంలో ఎక్కడ చూసినా యుద్ధ వాతావరణమే.. ఏవైపు ఉంచి ఎప్పుడు మిస్సైల్స్ వచ్చి పడతాయో తెలీని భీతావహం. కళ్ల ముందే ఎంతోమంది ప్రాణాలు విడిచే భయంకర దృశ్యాలు. దీనికి తోడు పవర్ గ్రిడ్ కూల్చివేతతో దాదాపుగా విద్యుత్ లేని పరిస్థితి. ఇలాంటి క్లిష్ట స్థితిలోనూ ఉక్రెయిన్ నుంచి 143 మంది అథ్లెట్ల బృందం ఒలింపిక్స్‌కు రాగలిగింది. రష్యాతో నిరంతర యుద్ధంతో ఈ దేశం సతమతమవుతున్న విషయం తెలిసిందే. హఠాత్తుగా వచ్చే సైరన్ల మోతతో తాము ఇంట్లోకి వెళ్లి దాక్కోవాల్సి వచ్చేదని, అందుకే తమ శిక్షణ అత్యంత కష్టంగా సాగిందని అథ్లెట్లు చెబుతున్నారు. అలాగే దేశం తరఫున ఒలింపిక్స్‌లో ఆడడాన్ని గర్వంగా భావిస్తున్నాంటున్నారు.



వేలంలో ద్రవిడ్ కొడుక్కి రూ.50 వేలు

బెంగుళూరు: టీమిండియా మాజీ కెప్టెన్, కోచ్ రాహుల్ ద్రవిడ్ తనయుడు సమిత్ ద్రవిడ్‌ను కేఎస్‌సీఏ టీ20 మహారాజా ట్రోఫీ వేలంలో మైసూర్ వారియర్స్ జట్టు రూ.50 వేలకు దక్కించుకుంది. 18 ఏళ్ల సమిత్‌ను కనీస ధరకు వారియర్స్ కొనుగోలు చేసింది. ఈ టోర్నీ వచ్చే సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు జరగనుంది. మిడిలార్డర్ బ్యాటర్ కమ్ పేస్ ఆల్‌రౌండర్ సమిత్ గతేడాది అండర్-19 కూచ్ బెహార్ ట్రోఫీ నెగ్గిన కర్ణాటక జట్టులో సభ్యుడు. ఈ ట్రోఫీలో 10 ఇన్నింగ్స్‌ల్లో సమిత్ మూడు హాఫ్ సెంచరీలతో కలిపి, 362 పరుగులు చేసి, 16 వికెట్లు కూడా తీశాడు.



మన ప్రత్యర్థి మళ్లీ శ్రీలంకే

సెమీస్‌లో బంగ్లాపై భారత విజయం
పాక్‌కు లంక షాక్ ● ఆసియా కప్ ఫైనల్లో అమీతుమీ రేపు

దంబుల్లా: రెండేళ్ల కిందట బంగ్లాదేశ్ ఆతిథ్యమిచ్చిన మహిళల ఆసియా కప్‌లో..టైటిల్ ఫైట్‌లో భారత్ ప్రత్యర్థి శ్రీలంకే. ఇక ఈసారి కూడా ట్రోఫీకోసం ఆ జట్టుతోనే హర్మన్‌ప్రీత్ సేన అమీతుమీ తేల్చుకోనుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను డిఫెండింగ్ చాంపియన్ భారత్ చిత్తు చేస్తే..ఉత్కంఠ భరితంగా జరిగిన రెండో సెమీస్‌లో 3 వికెట్లతో పాకిస్థాన్‌కు శ్రీలంక షాకిచ్చింది. ఆదివారం ఫైనల్ జరగనుంది.

రేణుక, రాధిక మెరిసే..: పవర్ ప్లేలో పేసర్ రేణుకా సింగ్ (3/10) నిప్పులు చెరిగే బంతులు..మిడిల్ ఓవర్లలో రాధా యాదవ్ (3/14) మెరుపులు..దాంతో బంగ్లాదేశ్‌తో సెమీఫైనల్లో అలవోకగా గెలుపొందిన భారత్ ఆసియా కప్ తుది పోరుకు చేరింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 80 పరుగులే సాధించింది. కెప్టెన్ నిగర్ సుల్తానా (32), చివర్లో షోర్నా అక్తర్ (19 నాటౌట్) కాస్త బ్యాట్లు ఝళిపించబట్టి బంగ్లాకు ఆ స్కోరైనా సాధ్యమైంది. స్వల్ప ఛేదనలో ఓపెనర్లు మంధాన (55 నాటౌట్), షఫాలీ వర్మ (26 నాటౌట్) ప్రత్యర్థి బౌలర్లను ఆడేసుకున్నారు. దాంతో ఇంకా 9 ఓవర్లు మిగిలుండగానే భారత్ 83/0తో మ్యాచ్‌ను ముగించేసింది. ఇక..మరో సెమీఫైనల్లో మొదట పాకిస్థాన్‌ను 20 ఓవర్లలో 140/4 స్కోరు చేసింది. అనంతరం శ్రీలంక 19.5 ఓవర్లలో 141/7 స్కోరు చేసి విజయం అందుకుంది.

సంక్షిప్తస్కోర్లు
బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 80/8 (నిగర్ సుల్తానా 32, షోర్నా అక్తర్ నాటౌట్ 19, రేణుకా సింగ్ 3/10, రాధా యాదవ్ 3/14)
భారత్: 11 ఓవర్లలో 83/0 (మంధాన నాటౌట్ 55, షఫాలీ నాటౌట్ 26).

కొత్త.. కొత్తగా

రా. 7 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



నూతన కెప్టెన్, కోచ్‌తో టీమిండియా
శ్రీలంకతో తొలి టీ20 నేడు

పల్లెకెలె: టీ20 వరల్డ్ చాంపియన్ టీమిండియా మెగా టోర్నీ తర్వాత పూర్తిస్థాయి జట్టుతో సై అంటోంది. శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్‌లో భాగంగా తొలుత మూడు టీ20లలో తలపడనుంది. మొదటి టీ20 శనివారం ఇక్కడ జరగనుంది. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్, కోచ్‌గా గంభీర్ కొత్తగా నియమితులయ్యారు. అలాగే జట్టులోనూ కొత్త ముఖాలు కనిపిస్తున్నాయి. దాంతో..కెప్టెన్, కోచ్‌తోపాటు జట్టులోని యువ క్రికెటర్లకు ఈ టూర్ పరీక్ష కానుంది. అనుభజ్ఞుడైన గంభీర్ కోచ్‌గా జట్టు పయనంపై ఆసక్తి రేకెత్తిస్తోంది.మొత్తంగా కొత్తకోచ్, సారథి ఆధ్వర్యంలో ఆటగాళ్ల ప్రదర్శన ఎలా ఉంటుందో చూడాలి. గతంలో సౌతాఫ్రికా, ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లలో తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించిన సూర్యకు ఆ అనుభవం.. పూర్తిస్థాయి కెప్టెన్ బాధ్యతల్లో ప్లస్ కానుంది.

రోహిత్, విరాట్, జడేజా లేకుండా..: గతనెల ముగిసిన టీ20 ప్రపంచ కప్ అనంతరం స్టార్లు రోహిత్, విరాట్, జడేజా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. దాంతో ఎన్నో ఏళ్ల అనంతరం ఈ త్రయం లేకుండా భారత్ బరిలో దిగుతోంది. ఇది టీమిండియాకు సంధి దశ. గిల్‌తోపాటు యువ బ్యాటర్లు జైస్వాల్, రింకూ, పరాగ్‌లు జట్టులో తమ స్థానాలను సుస్థిరం చేసుకొనేందుకు.. జడేజా స్థానంలో ఆల్‌రౌండర్‌గా తన ముద్ర వేసేందుకు అక్షర్ పటేల్‌కూ ఇది చక్కటి చాన్స్. ఆల్‌రౌండర్లు హార్దిక్, దూబే, వాషింగ్టన్‌లతో జట్టు పటిష్టంగా ఉంది. సీనియర్ బుమ్రా గైర్హాజరీలో యువపేసర్లు అర్ష్‌దీప్, సిరాజ్‌లకు ఈ సిరీస్ అద్భుత అవకాశం.

లంకకు ఎదురుదెబ్బ: సిరీస్ ఆరంభంలోనే ఆతిథ్య జట్టుకు ఎదురు దెబ్బలు తగిలాయి. అనుభవజ్ఞులైన పేసర్లు చమీర అనారోగ్యంతో, తుషార గాయంతో సిరీస్‌కు దూరమయ్యారు. వారి స్థానాల్లో అసిత ఫెర్నాండో, దిల్షాన్ మధుశంక జట్టులోకి వచ్చారు. ఇది చాలదన్నట్టు..జట్టును ఫ్లూ జ్వరం పట్టిపీడిస్తున్నదట. దాంతో ఆల్‌రౌండర్ రమేష్ మెండిస్‌ను రిజర్వ్ ఆటగాడిగా పిలిపించారు. టీ20 వరల్డ్ కప్‌లో వైఫల్యంతో లంక జట్టులో మార్పులు జరిగాయి. తాత్కాలిక కోచ్‌గా జయసూర్యను, అసలంకను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. భారత్ మాదిరే కొత్త సారథి, కోచ్‌తో దిగుతున్న లంక జట్టు స్వదేశంలో జరిగే సిరీస్‌లో పోటీ ఇస్తుందా అన్నది చూడాలి.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), గిల్, జైస్వాల్, పంత్ (కీపర్), హార్దిక్, దూబే, సుందర్, అక్షర్, అర్ష్‌దీప్, బిష్ణోయ్/ఖలీల్, సిరాజ్.
శ్రీలంక: అసలంక (కెప్టెన్), నిస్సాంక, మెండిస్ (కీపర్), పెరీరా, అవిష్క ఫెర్నాండో, షనక, హసరంగ, మహీష్ తీక్షణ, బినురా ఫెర్నాండో/అసిత ఫెర్నాండో, మధుశంక, పథిరన.

పిచ్/వాతావరణం

లంక ప్రీమియర్ లీగ్ సందర్భంగా పల్లెకెలె స్టేడియంలో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో మొదటి ఇన్నింగ్స్‌లో సగటున 185 పరుగులు నమోదయ్యాయి. ఈ మ్యాచ్‌ల్లో స్పిన్నర్లు మెరుగైన ప్రదర్శన చేశారు. మధ్యాహ్నం వర్షం కురిసే చాన్సుంది. మ్యాచ్ రాత్రి జరగనుండడంతో వరుణుడి నుంచి ఆటంకం లేకపోవచ్చు.

కవిత కస్టడీ మళ్లీ పొడిగింపు

» న్యాయమూర్తి సెలవు కారణంగా 31కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి.. తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం మరోసారి పొడిగించింది. కవిత కస్టడీపై విచారణను ఈ నెల 31న చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ కేసులో సీబీఐ సప్లిమెంటరీ చార్జిషీట్‌ను దాఖలు చేయగా.. అందులో తప్పులు ఉన్నాయని, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత ట్రయల్ కోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. కాగా, సీబీఐ చార్జిషీట్, కవిత బెయిల్ పిటిషన్ రెండింటిపై ఈ నెల 22న విచారణ చేపట్టిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు.. బెయిల్ పిటిషన్‌పై విచారణను ఆగస్టు 5కు వాయిదా వేసింది. చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంతోపాటు కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 26 వరకు పొడిగించింది. అయితే శుక్రవారం ట్రయల్ కోర్టులో ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా సెలవులో ఉండడంతో విచారణ మరోసారి వాయిదా పడింది. కవిత జ్యుడీషియల్ కస్టడీతోపాటు చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై ఈ నెల 31న విచారణ చేపట్టనున్నట్టు న్యాయస్థానం పేర్కొంది.

చోరీకెళ్తే పైసా దొరక్కపోవడంతో దండం పెట్టి!

» మహేశ్వరంలోని హోటల్లో చొరబడ్డ దొంగకు తీవ్ర నిరాశ

» ఫ్రిజ్‌లోంచి నీళ్ల సీసా తీసుకొని.. రూ.20 పెట్టిన వైనం

మహేశ్వరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దొరికినంతా దోచుకెళ్లాలని పకడ్బందీ ప్రణాళికతో హోటల్లో చొరబడ్డ ఆ దొంగ లోపల ఏమీ దొరక్కపోయేసరికి చిత్ర విచిత్రంగా ప్రవర్తించాడు. ఇదంతా సీసీ కెమెరాల్లో చూసిన వారు నవ్వు ఆపుకోలేకపోతున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని వినాయక హోటల్లో బుధవారం రాత్రి ఓ దొంగ చొరబడ్డాడు. రెయిన్ కోట్ ధరించిన అతగాడు, తనెవ్వరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు తలకు మంకీ క్యాంప్, ముఖం కనిపించకుండా ఉండేందుకు మాస్క్, చేతులకు గ్లవ్స్ ధరించాడు. ఎంతో ఉత్సాహంతో చోరీకి వెళ్లినా హోటల్లోని గల్లాపెట్టెలో అతడికి పైసా దొరకలేదు. ఫలితంగా తీవ్ర నిరాశతో సీసీ కెమెరా వైపు చూస్తూ 'హోటల్లో రూపాయి కూడా పెట్టలేదు.. మీకో దండం' అంటూ చేతులు జోడించి నమస్కరించాడు. మరి.. ఆ నిరాశతో గొంతు తడారిపోయిందో ఏమో గానీ పక్కనే ఉన్న ఫ్రిజ్‌లోంచి ఓ వాటర్ బాటిల్ తీసుకున్నాడు. ఆ బాటిల్ ఫ్రీగా తీసుకెళ్లడం ఎందుకు అనుకున్నాడో ఏమో దాని ధర 20 రూపాయలను కౌంటర్ మీద పెట్టి కూల్‌గా బయటకు వెళ్లిపోయాడు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

డివైడర్‌ను దాటి.. దూసుకెళ్లిన కారు

» ఎదురు లైన్‌లో వస్తున్న బైక్, బస్సుకు ఢీ

» ఇద్దరి మృతి.. 10 మందికి గాయాలు

మూడుచింతలపల్లి, జూలై 26 : రాజీవ్ రహదారిపై ఓ కారు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పి డివైడర్‌ను దాటి పక్క లైన్‌లోకి దూసుకెళ్లి.. ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా 10 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హకీంపేట్‌కు చెందిన మోహన్(25) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మౌలాలికి చెందిన దీపిక(25) గచ్చిబౌలిలోని ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. శుక్రవారం ఉదయం వీరిద్దరూ తమ ఇళ్లలో బయటకు వెళ్లి వస్తామని చెప్పారు. ఇద్దరూ కలిసి ఓ కారులో రాజీవ్ రహదారిపై వెళుతుండగా లాల్‌గడీ మలక్‌పేటలో ప్రమాదం జరిగింది. వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి.. పక్క లైన్‌లోకి దూసుకెళ్లింది. ఎదురుగా హైదరాబాద్ నుంచి తుర్కపల్లి వైపు వస్తున్న ద్విచక్రవాహనంతో పాటు బయోలాజికల్-ఈ కంపెనీ బస్సును ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న మోహన్, పక్కనే ఉన్న దీపిక అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు, బయోలాజికల్-ఈ కంపెనీ బస్సులో వెళ్తున్న 44 మందిలో 8 మందికి గాయాలయ్యాయి. ఘటనతో రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది.

షిర్డీ నుంచి వస్తున్న రైల్లో దొంగతనం

» నాలుగు బోగీల్లో రూ.40 లక్షల విలువైన సొత్తు చోరీ

ఖమ్మం/సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): షిర్డీ నుంచి కాకినాడ వస్తున్న సాయినగర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో దొంగలు పడ్డారు. గురువారం అర్ధరాత్రి ప్రయాణికులు నిద్రమత్తులో ఉండగా దొంగలు నాలుగు బోగీల్లో(ఎస్-3,4,5,6) బంగారం, నగదు, బ్యాగులు ఇలా ఏది దొరికితే అది ఎత్తుకెళ్లారు. రైలు బీదర్ సమీపంలోని పల్లి రైల్వే స్టేషన్ సమీపంలోకి వచ్చాక ప్రయాణికులు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రైల్లోనే ప్రయాణిస్తూ వచ్చిన దొంగలు అవకాశం చూసుకొని దొంగతనం చేసి చైన్ లాగి పారిపోయినట్లు భావిస్తున్నారు. బాధితుల్లో తెలుగు రాష్ట్రాల వాళ్లూ ఉన్నారు. సుమారు 30 మందికి చెందిన రూ.30-40లక్షల విలువైన ఆభరణాలు, నగదును దొంగలు దోచుకువెళ్లారని అంచనా. బాధితుల్లో ముగ్గురు శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినపల్లికి చెందిన రావెళ్ల పద్మ తన 110గ్రాముల బంగారం, రూ.10వేల నగదుతోపాటు సెల్‌ఫోన్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన శ్రీనివాసరావు రూ.20వేలు నగదు, సెల్‌ఫోన్.. అదే మండలం చిల్లకల్లుకు చెందిన యర్రా వాణి రూ.20వేలు, సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదును జీరో ఎఫ్ఐఆర్‌గా నమోదు చేసిన ఖమ్మం రైల్వే పోలీసులు కేసును పల్లి జీఆర్‌పీ పోలీసులకు పంపనున్నట్లు తెలిపారు. రైల్లో చోరీ జరిగినట్టు రాత్రి 2 గంటల సమయంలో గుర్తించగా.. బీదర్ వచ్చేవరకు ఎవరూ పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బీదర్‌లో అధికారులకు చెప్తే.. సికింద్రాబాద్ వెళ్లమని చెప్పారని, అక్కడికి వెళ్తే ఖమ్మం వెళ్లి ఫిర్యాదు చేయమన్నారని వాపోయారు.

మేడారం సారలమ్మ పూజారి మృతి


పూజారి కాక సంపత్ (ఫైల్)

మేడారం, జూలై 26: ములుగు జిల్లా వనదేవతల సన్నిధి మేడారంలో మరో విషాదం చోటుచేసుకుంది. సారలమ్మ ప్రధాన పూజారి కాక సంపత్ (38) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సంపత్ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. చికిత్స పొందుతున్నప్పటికీ ఆరోగ్యం కుదటపడలేదు. ఈ నేపథ్యంలో తన స్వగ్రామం తాడ్వాయి మండలం కన్నేపల్లి గ్రామంలో ఆయన మృతి చెందారు. మృతుడికి భార్య ఆమని, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుల్లో ఒకరు అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. సంపత్ మృతితో ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కాగా సమ్మక్క పూజారి మల్లెల ముత్తయ్య ఈనెల 20న మృతి చెందారు. వారం రోజుల వ్యవధిలోనే సంపత్ మృతితో విషాదం నెలకొంది.

ఆరేళ్ల బాలుడి ప్రాణం తీసిన టైరు

» ఔటర్‌పై వాహనం నుంచి ఊడి.. చిన్నారిని ఢీకొన్న టైరు

పటాన్‌చెరు, జూలై 26: మృత్యువు ఎప్పుడు ఎలా విరుచుకుపడుతుందో చెప్పలేం అనడానికి ఈ విషాద ఘటనే సాక్ష్యమేమో! ఏ వాహనం నుంచి ఊడిందో ఏమో ఓ టైరు వేగంగా దూసుకొచ్చి రోడ్డు పక్కన మూత్ర విసర్జన చేస్తున్న ఆరేళ్ల బాలుడిని బలంగా ఢీకొట్టగా.. చికిత్స పొందుతూ చిన్నారి మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లాలోని సుల్తాన్‌పూర్ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడా గ్రామం హరివిల్లు కాలనీకి చెందిన సందీప్‌రెడ్డి.. ఈనెల 21న కుటుంబసభ్యులతో కలిసి ముత్తంగిలోని ఓ రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు కారులో బయలుదేరాడు. సుల్తాన్‌పూర్ వద్ద ఓఆర్ఆర్‌పైకి వాహనం వెళ్లాక మూత్రం వస్తోందని ఆయన కుమారుడు మోక్షిత్ (6) చెప్పడంతో కారును సందీప్ రోడ్డుకు ఓ పక్కన వాహనాన్ని ఆపాడు. చిన్నారి రోడ్డు పక్కన మూత్ర విసర్జన చేస్తుండగా వెనుక నుంచి వేగంగా ఓ టైరు దూసుకొచ్చి బాలుడికి తగిలింది. ఈ ప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స కోసం వెంటనే ముత్తంగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని రెయిన్ బో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మోక్షిత్ గురువారం మృతిచెందాడు.

5 జిల్లాల్లో సికిల్‌సెల్ తీవ్రత

ఐదు నెలల్లో 848 కేసులు నమోదు

రాష్ట్రవ్యాప్తంగా 5,038 మంది క్యారియర్స్

తాజా స్ర్కీనింగ్‌లో బయటపడ్డ కేసులు

హైదరాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఆదిలాబాద్, కొమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సికిల్ సెల్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంది. సికిల్‌సెల్ ఎక్కువగా గిరిజన, మలేరియా కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాల్లోనే ఉంటుంది. పైన పేర్కొన్న ఐదు జిల్లాలూ ఏజెన్సీ ప్రాంతం అధికంగా ఉన్నవే. ఇక్కడ కేసులు పెరగడంతో పాటు క్యారియర్స్ సంఖ్య కూడా ఎక్కువగా ఉండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ జనవరి- మే మధ్య అన్ని జిల్లాల్లో సికిల్ సెల్ స్ర్కీనింగ్ నిర్వహించింది. ఆ వివరాలను వైద్యశాఖ ప్రభుత్వానికి అందజేసింది. భద్రాద్రి జిల్లాలో 97,687 మంది అనుమానితులను పరీక్షించగా అత్యధికంగా 1,636 మంది క్యారియర్స్‌గా, 442 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. మహబూబాబాద్ జిల్లాల్లో 78,025 మందికి పరీక్షలు చేయగా.. 379 మంది క్యారియర్స్‌గా, 88 మందికి సికిల్ సెల్ ఉన్నట్లు తేలింది. ఆదిలాబాద్‌లో 1140 మంది క్యారియర్స్, 178 కేసులు, ఖమ్మంలో 213 మంది క్యారియర్స్ 154 కేసులు, ఆసిఫాబాద్ జిల్లాలో 704 క్యారియర్స్ 136 కేసులు నమోదయ్యాయి. క్యారియర్స్ పరంగా చూస్తే మంచిర్యాల జిల్లాలో 824, ములుగులో 38, హైదరాబాద్‌లో 70, కరీంనగర్‌లో 38 మంది ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. రాష్ట్రవ్యాప్తంగా 5,083 మంది క్యారియర్స్‌గా తేలగా.. ఐదు నెలల్లో 848 సికిల్ సెల్ కేసులు నమోదయ్యాయి. జనవరి-జూన్ మధ్య రాష్ట్రంలో 78 మలేరియా కేసులు వచ్చాయి. వీటిలో అత్యధికం భద్రాద్రి జిల్లా (32)వే. తర్వాత ఆసిఫాబాద్ ఉంది.

ఏమిటీ సికిల్‌సెల్...

సికిల్ సెల్ అనేది జన్యుపరమైన వ్యాధి. మానవ శరీరంలో ఎర్ర రక్త కణాలు గుండ్రంగా పిప్పర్‌మెంట్ ఆకారంలో ఉంటాయి. ఇవి రక్తనాళాల ద్వారా శరీరమంతా తిరుగుతూ అవయవాలకు ఆక్సిజన్ సరఫరా చేస్తుంటాయి. కొందరిలో జన్యుపరమైన మార్పుల వల్ల ఎర్ర రక్తకణాలు గుండ్రంగా బదులు కొడవలి (సికిల్) ఆకారంలో ఉంటాయి. ఇలా ఉన్నవారి రక్త కణంలోని ఒక జన్యువు సికిల్ సెల్‌గానూ, మరొకటి మామూలుగానూ ఉంటే వారిని సికిల్‌సెల్ క్యారియర్స్ అంటారు. వీరికి ఎటువంటి అనారోగ్య సమస్యలుండవు. ఇలాంటివారు పెళ్లి చేసుకున్న తర్వాత భార్యభర్తలిద్దరికి ఆ లక్షణాలుంటే వారికి పుట్టే పిల్లలకు రక్తంలోని రెండు జన్యువులూ వంపు తిరిగి ఉంటాయి. పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. సాధారణ రక్త కణాల జీవిత కాలం నాలుగు నెలలైతే సికిల్ సెల్ జీవిత కాలం 25 రోజులే. ఇవి నశించేంత వేగంగా కొత్త ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి కావు. దాంతో ఈ వ్యాధి ఉన్నవారు తీవ్ర రక్తహీనత బారినపడతారు. శరీర భాగాలకు సరిగా ఆక్సిజన్ అందక అనారోగ్యానికి గురవుతారు. దీర్ఘకాలం కామెర్లు, రక్త హీనతతో శరీరం పాలిపోయి ఉండడం, కాళ్లు, చేతుల వేళ్ల వాపుతో వంపు తిరగడం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు.

ఎన్‌డీఎస్ఏ చెబితే నింపుతాం

నివేదిక వచ్చేదాకా బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయం.. నిల్వ చేస్తేనే.. అన్నారం, సుందిళ్లలో పంపింగ్‌కు అవకాశం

» కేటీఆర్ పేరును గోబెల్స్‌గా మార్చుకోవాలి

» సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు: ఉత్తమ్

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) చెబితేనే కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల్లో నీటిని నిల్వ చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎన్‌డీఎస్ఏ సూచనలు పాటించకుండా మేడిగడ్డలో నీటిని నిల్వ చేస్తే.. బ్యారేజీకి ఏమైనా జరిగితే సమ్మక్క బ్యారేజీ కొట్టుకుపోతుందని తెలిపారు. దీంతో భద్రాచలంతోపాటు 40 గ్రామాలు నీట మునుగుతాయని, ఏటూరునాగారం కూడా ప్రమాదంలో పడుతుందని అన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక వచ్చేదాకా బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయబోమని స్పష్టం చేశారు. ఆగస్టు 2లోగా కన్నెపల్లి (మేడిగడ్డ)లో నీటి పంపింగ్ చేపట్టకపోతే 50 వేల మంది రైతులతో పంప్‌హౌస్‌ను ముట్టడించి, తామే పంపింగ్ ప్రారంభిస్తామని కేటీఆర్ ప్రకటించిన నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ శుక్రవారం జలసౌధలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కేటీఆర్ కంటే ఎన్‌డీఎస్ఏకే ఎక్కువ తెలివి ఉందని తాము భావిస్తున్నామన్నారు. 2023 అక్టోబరులో మేడిగడ్డ కుంగినప్పుడే ఆ బ్యారేజీలో నీటిని ఖాళీ చేయాలని ఎన్‌డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని, దాంతో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే నీటిని ఖాళీ చేశారని గుర్తు చేశారు. మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయరాదని, ఫ్రీ ఫ్లో కండీషన్‌లో గేట్లు ఎత్తి ఉంచాలని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని తెలిపారు. అన్నారంలో 11 మీటర్ల మేర (5 టీఎంసీలు), సుందిళ్లలో 9 మీటర్లు (4.5 టీఎంసీలు) నీటిని నిల్వ చేస్తేనే పంపింగ్ చేయడానికి అవకాశం ఉంటుందని, కానీ.. ఈ రెండు బ్యారేజీల్లో 5 మీటర్ల మేర నిల్వ ఉన్న సమయంలోనే బ్యారేజీల్లో భారీగా సీపేజీలు ఏర్పడ్డాయని అన్నారు. ప్రస్తుతం మేడిగడ్డలో నీటిని నిల్వ చేయకున్నా పంపింగ్ చేయడానికి అవకాశం ఉందని, అయితే అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేయాలంటే ఎన్‌డీఎస్ఏ సిఫారసులు కీలకమని పేర్కొన్నారు.



వేల కోట్లు దోచారు..

కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం రూ.వేల కోట్లు కొట్టేసి.. సిగ్గులేకుండా మాట్లాడుతోందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన తప్పిదాలకు తండ్రీకొడుకులు కేసీఆర్, కేటీఆర్.. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరు ఇష్టం లేకనో, కాంగ్రెస్‌కు మంచిపేరు వస్తుందనో ప్రాణహిత-చేవెళ్లను పక్కన పెట్టారని, వ్యయం పెరిగితే కమీషన్లు పెరుగుతాయనే ఉద్దేశంతో రీడిజైన్ చేశారని ఆరోపించారు. అబద్ధాలను పదే పదే చెప్పి.. నిజాలుగా నమ్మించాలని చూస్తున్న కేటీఆర్.. తన పేరును గోబెల్స్‌గా మార్చుకోవాలన్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ పూర్తయిందని, కాళేశ్వరం కమిషన్ విచారణ అనంతరం దోషులుగా తేలినవారిని వదలబోమని ప్రకటించారు.

ఏ సీఎం చేయని తప్పు చేసిన కేసీఆర్..!

స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయని తప్పును కేసీఆర్ చేశారని, రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే, ఒక్క స్టేజీ పంపింగ్‌తో ఎల్లంపల్లిలో నీటిని ఎత్తిపోసే గ్రావిటీ ప్రాజెక్టు ప్రాణహిత-చేవెళ్లను పక్కనపెట్టారని అన్నారు. సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చిందంటూ తప్పుడు సమాచారంతో తెలంగాణను తాకట్టు పెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని ఆక్షేపించారు. కాళేశ్వరం వైఫల్యానికి కేసీఆర్ వన్‌మ్యాన్ షోనే కారణమని మండిపడ్డారు. బ్యారేజీ దెబ్బతిన్నప్పుడు కాంగ్రెస్ నేతలు సహా ఎవరినీ అక్కడికి అనుమతించలేదని, కానీ.. తమ ప్రజాపాలనలో బ్యారేజీల పైకి అనుమతిస్తున్నామని తెలిపారు. ఇక ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతున్నందున.. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు నీటిని వదిలేసి.. మిగిలిన నీటిని రెండు, మూడురోజుల్లో పంపింగ్ ప్రారంభిస్తామని మంత్రి ప్రకటించారు. ఎల్లంపల్లి నీటిని పంపింగ్ చేసి, మిడ్‌మానేరు, లోయర్ మానేరు, అనంతగిరి, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ జలాశయాలను నింపుతామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లింక్-1లో ఉన్న సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ కాంపోనెంట్లు మినహా.. ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ దాకా అన్ని కాంపోనెంట్లను వినియోగించుకుంటామని స్పష్టం చేశారు.

విహారయాత్రకే కేటీఆర్ టూర్: జీవన్‌రెడ్డి

కేటీఆర్ విహారయాత్ర కోసమే కాళేశ్వరం పర్యటనకు వెళ్లారని కాంగ్రెస్ శాసనమండలి పక్షనేత జీవన్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి వాస్తవాలు వారికి తెలిసి ఉండి కూడా.. తప్పును కప్పి పుచ్చి.. ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకే ఈ యాత్ర తలపెట్టారని ఆరోపించారు. ఇకనైనా చేసిన తప్పునకు కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనడానికి కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కాగా, తెలంగాణకు కల్వకుంట్ల శని వదలడంలేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. మేడిగడ్డ డిజైన్ లోపాలపై విచారణ జరుగుతుందని తెలిసీ.. ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి కేటీఆర్ రాజకీయానికి బయలు దేరారన్నారు.

కంది, మినప, మసూర్ పప్పును ప్రభుత్వం కొంటుంది

» కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

» రాజ్యసభను కుదిపేసిన ఎమ్మెస్పీ

న్యూఢిల్లీ, జూలై 26: రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం కంది, మినప, మసూర్ పప్పులను ఈ-సమృద్ధి ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని శుక్రవారం కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) కింద రైతుల నుంచి అత్యధికంగా కొనుగోళ్లు జరిపినట్టుచెప్పారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఎమ్మెస్పీ కింద కేవలం 45 కోట్ల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని, ఎన్‌డీఏ ప్రభుత్వం మొత్తం 69.18 కోట్ల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిపినట్టు తెలిపారు. ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఆరోపించారు. రైతులు ఖర్చు చేసిన దానిపై 50 శాతం లాభాన్ని స్వామినాథన్ కమిటీ సూచించిందని, అయితే దీన్ని యూపీఏ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాగా, ఎమ్మెస్పీకి చట్టబద్ధమైన హామీని కల్పించే అంశం శుక్రవారం రాజ్యసభను కుదిపేసింది. చట్టబద్ధమైన హామీ ఇవ్వడానికి సంబంధించి శివరాజ్ సింగ్ ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని విపక్షాలు సభా కార్యకలాపాలకు అడ్డుకున్నాయి. ప్రశ్నోత్తరాల సమయంలో చౌహాన్ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించారు. ఎమ్మెస్పీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే అంశాన్ని కమిటీ చూస్తోందన్నారు. అయితే చౌహాన్ ఇచ్చిన సమాధానం అసంపూర్ణంగా ఉందంటూ కాంగ్రెస్ ఎంపీలు రణదీప్ సుర్జేవాలా, జైరామ్ రమేష్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపు చేయడానికి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రయత్నించారు. మంత్రి వివరణాత్మక సమాధానం ఇచ్చారని, సభ్యులు సంతృప్తి చెందకపోతే సమాధానాలు కోరడానికి అవకాశం ఉన్న మార్గాలను ఉపయోగించుకోవాలన్నారు. కాగా, తేయాకు రైతులను కూడా ఎమ్మెస్పీ పరిధిలోకి తీసుకురావాలని డీఎంకే సభ్యుడు ఎం షణ్ముగం డిమాండ్ చేశారు.

జంతర్ మంతర్‌కు రండి!

» తెలంగాణకు కేంద్రం నిధులిచ్చినట్టు తేలితే ముక్కు నేలకు రాయాలి

» రేవంత్, కేటీఆర్‌కు రఘునందన్ సవాల్

» కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్లు కలిపి 50 వేల కోట్లు.. కేంద్రం ఇచ్చేవి కావా?



న్యూఢిల్లీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నిధులివ్వలేదంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్దకు వస్తే కేంద్రం నిధులు ఇచ్చినట్లు తాము నిరూపిస్తామని, వారిద్దరూ ముక్కు నేలకు రాస్తారా? అని సవాల్ విసిరారు. ఈ మేరకు రఘునందన్‌రావు శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డిల పాలనలో తేడా ఏమీ లేదని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ రూ.20 కోట్లకు కొంటే.. తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రూ.5 కోట్లకే కొంటున్నామని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో చెప్పారని గుర్తు చేశారు. మూసీ ప్రక్షాళనకు కేంద్రం నిధులివ్వలేదని సీఎం చెబుతున్నారని, కానీ.. డీపీఆర్ ఇవ్వకుండానే నిధులెలా వస్తాయని ప్రశ్నించారు. తెలంగాణ బడ్జెట్‌లోనే కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా రూ.26వేల కోట్లు, గ్రాంట్ల రూపంలో మరో రూ.21వేల కోట్లు చూపించారని గుర్తుచేశారు. ఈ రెండూ కలిపి సుమారు 50వేల కోట్లు అవుతాయని, ఇవి కేంద్రం నుంచి వచ్చేవి కావా? అని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌లో మైనారిటీల పండుగలకు రూ.33 కోట్లు కేటాయించిన విషయాన్ని రఘునందన్‌రావు గుర్తు చేస్తూ.. రాష్ట్రంలో హిందువులు లేరా? హిందూ పండుగలు లేవా? అని ప్రశ్నించారు. కొడంగల్‌కు డిగ్రీ కాలేజీ, నర్సింగ్ కాలేజీలు వచ్చాయని, రాష్ట్రంలో మిగిలిన 118 నియోజకవర్గాలు కనిపించలేదా?అని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ కట్టుబడి ఉన్నారని తెలిపారు.

డయల్-100కు వచ్చే ఫోన్లకు సత్వరమే స్పందించండి: డీజీపీ

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు సాయం కోసం డయల్-100కు వచ్చే ఫోన్ కాల్స్‌కు సిబ్బంది సత్వరమే స్పందించాలని రాష్ట్ర డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఈ మేరకు సిబ్బంది పని చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్లు, ఎస్పీలను ఆదేశించారు. డయల్-100, 112 పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అత్యవసర సర్వీస్ సేవలు మెరుగుపరిచేందుకు తీసుకున్న చర్యల్ని అధికారులు ఈ సందర్భంగా డీజీపీకి వివరించారు. అదనపు డీజీపీలు మహేష్ భగవత్, వీవీ శ్రీనివాస్, ఐజీలు రమేష్, సత్యనారాయణ, హైదరాబాద్ జాయింట్ సీపీ పరిమళ హన నూతన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

2 వరకు గడువు

(మొదటి పేజీ తరువాయి)

కలిసి శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బ్యారేజీలను కేటీఆర్ సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వర్షాలు పూర్తి స్థాయిలో లేక రైతులు ఇబ్బంది పడుతుంటే.. ప్రభుత్వం భేషజాలకు పోయి కాళేశ్వరం నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ప్రభుత్వానికి ఆగస్టు 2 వరకు గడువు ఇస్తున్నామని, లేదంటే అసెంబ్లీ సమావేశాలు ముగిశాక కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అసెంబ్లీ, మండలిలో తమ సభ్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని.. స్పందించకుంటే వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, పాలేరు, సూర్యాపేట, భువనగిరి, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ నుంచి 50 వేల మందికి పైగా రైతులను కన్నెపల్లి పంప్ హౌస్‌కు తరలించి, వారితో మోటార్లను ఆన్ చేస్తామని ప్రకటించారు. మహారాష్ట్రలోని బాబ్లీ నుంచి గోదావరిలోకి ఇప్పట్లో వరద కష్టమేనని, దీంతో కాళేశ్వరం ఎగువన గోదావరి ఎడారిగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కన్నెపల్లిలో 17 మోటార్లు కండిషన్‌లోనే ఉన్నాయని, ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్, మిడ్‌మానేరు, ఎల్ఎండీ, కొండపోచమ్మ, మల్లన్నసాగర్, నిజాంసాగర్, వరద కాలువకు ఎత్తిపోస్తే 100 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందన్నారు. 30 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నప్పటికీ కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయొచ్చని ఇంజనీర్లు చెబుతున్నారని, ప్రస్తుతం 10లక్షలకు పైగా క్యూసెక్కుల ప్రవాహం ఉందని, మోటార్లు రన్ చేసి రోజుకు 3 టీఎంసీల గోదావరి నీటిని లిఫ్ట్ చేయొచ్చన్నారు.

నీటి నిల్వపై ఎన్‌డీఎస్ఏవి పచ్చి అబద్ధాలు

కేసీఆర్ పంచభక్ష పరమాన్నాలను పళ్లెంలో పెట్టి ఇస్తే.. ఎలా వినియోగించుకోవాలో ప్రభుత్వానికి తెలియడం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం వందకు పైగా విభాగాలతో ముడిపడి ఉందని, మేడిగడ్డలో చిన్న లోపాన్ని చూపించి మొత్తం ప్రాజెక్టే పనికిరాదనేలా ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మేడిగడ్డ నుంచి 10.60 లక్షల క్యూసెక్కుల వరద వెళ్తున్నా బ్యారేజీకి ఎలాంటి ముప్పు తలెత్తని విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, మేడిగడ్డ లోపాన్ని అడ్డుపెట్టుకుని కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూశారని అన్నారు. కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోస్తే కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందోననే అక్కసుతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేయొద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదికలు పచ్చి అబద్ధమని కొట్టిపడేశారు. గోదావరిలో నీళ్లున్నాయని, బటన్ ఒత్తితే తీసుకెళ్లవచ్చునని, లేనిదల్లా రాజకీయ సంకల్పమేనని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో గోదావరి నిండుకుండాలా ఉండేదని, ఇప్పుడు ఎండిపోయిందని అన్నారు. కాగా, కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో కేటీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. గోదావరిలో ప్రాణహిత కలిసే త్రివేణి సంగమం వద్దకు వెళ్లి ప్రాణహిత ప్రవాహాన్ని పరిశీలించారు. కన్నెపల్లిలో మోటార్లను పరిశీలించారు. ఇంజనీర్లతో మాట్లాడారు.

గొర్రెలు ఏ తొర్రలో దూరెనో..!?

2013లో తెలంగాణలో గొర్రెల సంఖ్య 1.28 కోట్లు

» 2019లో 1.90 కోట్లకు చేరాయన్న కేసీఆర్ సర్కారు!

» తాజా పశుగణన ప్రకారం గొర్రెల సంఖ్య 1.24 కోట్లే..!

» 34.99 శాతం తగ్గుదల



హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గొర్రెల సంఖ్య మిస్టరీగా మారింది! అసలు ఎన్ని గొర్రెలు ఉన్నాయన్నది చర్చనీయాంశమైంది! 2013తో పోలిస్తే 2019 నాటికి గొర్రెలు భారీగా వృద్ధి చెందినట్లు గత ప్రభుత్వం లెక్కలు చూపింది. అదే విషయాన్ని రికార్డుల్లోనూ నమోదు చేసింది. కానీ, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వేలోని గొర్రెల లెక్కలు మాత్రం దానికి విరుద్ధంగా ఉన్నాయి! 2024 నాటికి గొర్రెల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఐదేళ్లలో రాష్ట్రంలో పంపిణీ చేసిన జీవాలన్నీ ఏమైపోయాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. గొర్రెల పంపిణీ పథకం ద్వారా రాష్ట్రంలో ఉన్న గొల్ల, కుర్మలను కోటీశ్వరులను చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందులో భాగంగానే గొర్రె పిల్లలను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించింది. 2017లో ఈ పథకాన్ని ప్రారంభించింది. గొర్రెల పంపిణీ పథకం కోసం రూ.5,500 కోట్లు ఖర్చు పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 2013లో గొర్రెల సంఖ్య 1,28,35,761 ఉండగా 2019లో వీటి సంఖ్య 48.78 శాతం పెరిగి 1,90,94,836కు చేరిందని రికార్డుల్లో పేర్కొన్నారు. అయితే ఇటీవల గొర్రెల పంపిణీలో జరిగిన అక్రమాలను కాగ్ బహిర్గతం చేసింది. ఈ పథకం నిర్వహణ, లబ్ధిదారులకు గొర్రెల కేటాయింపు, కొనుగోళ్లలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని తన నివేదికలో పేర్కొంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024కి సంబంధించి పశుగణన చేపట్టింది. దీని ప్రకారం రాష్ట్రంలో గొర్రెల సంఖ్య 34.99 శాతం తగ్గిపోయి.. 1,24,14,299కి చేరింది. మరి పంపిణీ చేసిన గొర్రెలు ఏ తొర్రలో దూరాయో అధికారులకే తెలియాలని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

రెండో విడతకు దక్కని గొర్రెలు

రెండో విడత కింద గొర్రెల పంపిణీలో 85,488 మంది తమ వాటా కింద 25 శాతం నగదు చెల్లించారు. సుమారు రూ.430 కోట్లు ఇప్పటికీ జిల్లా కలెక్టర్ల ఖాతాల్లోనే ఉన్నాయి. ఇదే పథకానికి సంబంధించి మరో 2,20,792 మంది లబ్ధిదారులు డీడీలు తియ్యాల్సి ఉంది. మొత్తం మీద పథకం నిర్వహణ గొర్రెదాటు వ్యవహారంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్ని పంచినా గొర్రెల సంతతి పెరగకపోగా తాజా పశుగణనలో 34.99 శాతం తగ్గడం అనుమానాలకు తావిస్తోంది.

ఫోన్ ట్యాపింగ్ నిందితులకు 31 వరకు రిమాండ్

» ఆలోగా ప్రభాకర్‌రావు, శ్రవణ్ విషయంలో నివేదిక ఇవ్వాలన్న కోర్టు

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, భుజంగరావు, తిరుపతన్న జుడీషియల్ రిమాండ్‌ను నాంపల్లి కోర్టు జూలై 31 వరకు పొడిగించింది. రిమాండ్ గడువు ముగియడంతో వీరిని దర్యాప్తు అధికారులు శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం నాంపల్లిలోని 12వ ఏసీజేఎం కోర్టు న్యాయమూర్తి ఈశ్వరయ్య నలుగురు నిందితుల రిమాండ్‌ను పొడిగించారు. దర్యాప్తు అధికారులు చార్జిషీట్‌లో పొందుపర్చిన పత్రాల్లో కొన్నింటిని నిందితులకు ఇవ్వలేదని నిందితుల తరపు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. దీంతో దర్యాప్తు అధికారుల తరపు న్యాయవాదిని న్యాయమూర్తి ప్రశ్నించారు. గడువు కావాలని అభ్యర్థించగా తదుపరి విచారణలోగా నివేదిక ఇవ్వాలంటూ విచారణను వాయిదా వేశారు.

ఉద్యోగులకు చేనేత యూనిఫామ్

» అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు..

» 'చేనేత కార్మికుల సంస్థ' ప్రతినిధులతో భేటీ

హైదరాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి): హ్యాండ్లూమ్స్, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్టీసీతో పాటు యూనిఫామ్ సర్వీసులైన పోలీసు, వైద్యారోగ్య శాఖ, ఇతర శాఖల్లోని ఉద్యోగుల యూనిఫామ్‌కు కావాల్సిన వస్త్రాలు చేనేత కార్మికుల నుంచే తీసుకోవాలని అధికారులకు సూచించారు. శుక్రవారం సచివాలయంలో తెలంగాణ చేనేత కార్మికుల సహకార సంస్థ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఆగస్టు 15 తర్వాత అన్ని ప్రభుత్వ విభాగాల్లో యూనిఫామ్ కోసం వస్త్రాలు సేకరించే సంస్థలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళా గ్రూప్ సభ్యులకు డ్రెస్ కోడ్ కోసం ప్రత్యేక డిజైన్‌ను పరిశీలించాలని సూచించారు.

బీజేపీలో విలీనం దిశగా బీఆర్‌ఎస్ అడుగులు

» కేంద్రం రాష్ట్రానికి నిధులు ఇవ్వకపోయినా కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదు?: మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీలో విలీనం దిశగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోందని, ఆ మేరకు తనకు, ముఖ్యమంత్రికి సమాచారం ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా, వ్యవసాయం, సాగునీటి పారుదల రంగాలకు రూ.లక్ష కోట్లకు మించి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే ప్రశంసించాల్సింది పోయి, ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని మాజీ సీఎం కేసీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్‌ని చూస్తే జాలేస్తోందని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పినా ఆయనలో ఇంకా మార్పు రాలేదని, ఇప్పటికైనా బీఆర్‌ఎస్‌ని మూసేసి శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకోవాలని సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ గురించి కనీస ప్రస్తావన లేకపోయినా కేసీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజలే బీఆర్‌ఎస్‌ను చీల్చి చెండాడారు: జూపల్లి



హైదరాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చీల్చి చెండాడుతామంటూ మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటరిచ్చారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలే బీఆర్ఎస్‌ను చీల్చి చెండాడారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన ఆ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్నాకు పరిమితమైందని అన్నారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యమంటే కేసీఆర్‌కు చులకన భావమని, అందువల్లే అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి వెళ్లలేదని, ప్రతిపక్ష నేతగా ఇన్నాళ్లూ శాసనసభకు రాలేదని విమర్శించారు. తనకంటే చిన్నవాడైన రేవంత్‌రెడ్డి సీఎం కావడాన్ని కేసీఆర్ జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను రాజకీయంగా, ఆర్థికంగా ఆగం పట్టించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. లక్ష్మీదేవి రిజర్వాయర్‌ను పూర్తి చేయలేదని, కాళేశ్వరాన్ని కాలగర్భంలో కలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులపట్ల చిత్తశుద్ధికి బడ్జెట్టే నిదర్శనం: అన్వేష్

వ్యవయసాయ రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 25% నిధులు కేటాయించారని, రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ఏటా రుణమాఫీకి బడ్జెట్‌లో నిధులు కేటాయించడమే తప్ప ఖర్చు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతు రుణమాఫీకి, సన్నధాన్యానికి బోనస్, విత్తన సబ్సిడీ, వ్యవసాయ కార్మికులకు సాయం వంటి వాటన్నింటికీ బడ్జెట్లో నిధులు కేటాయించిందని తెలిపారు. కాగా, నామినేటెడ్ పదవుల్లో మహిళా నేతలకు అవకాశాలు కల్పించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు కోరారు. ఈ అంశంపై పార్టీ పెద్దలకు ఇప్పటికే వినతి పత్రాలు ఇచ్చామని, ఈసారి నియామకాల్లో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు.

టీపీసీసీ మీడియా కమిటీ కన్వీనర్‌గా గీత

టీపీసీసీ మీడియా కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా అయినాల గీత నియమితులయ్యారు. ఖమ్మం జిల్లా వల్లభి గ్రామానికి చెందిన గీత.. సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించారు. రిజర్వేషన్లకు సంబంధించి అమిత్‌షా వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్న ఆరోపణపై ఢిల్లీ పోలీసులు కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగానికి చెందిన పలువురు నేతలపై గతంలో కేసు నమోదు చేశారు. ఆ నేతల్లో అయినాల గీత కూడా ఉన్నారు.

గోల్కొండ కోటలో స్వాతంత్ర్య వేడుకలు: సీఎస్

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎప్పటిలానే ఈసారి కూడా స్వాతంత్ర్య దినోత్సవాలను గోల్కొండ కోటలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ఈ మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 15న సీఎం రేవంత్ ముందుగా పరేడ్ గ్రౌండ్‌లోని సైనిక అమరుల స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించి, అనంతరం గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని ఆమె తెలిపారు.

అక్టోబరుకల్లా 'యాదాద్రి'లో 2 యూనిట్లు

» 2025 మార్చికల్లా మిగతా 3 యూనిట్లు సిద్ధం చేయాలి

» జెన్‌కో సీఎండీ రొనాల్డ్‌రాస్

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే అక్టోబరుకల్లా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్)లోని మొదటి దశలో రెండు యూనిట్లు(ఒక్కోటి 800 మెగావాట్లు) పూర్తి కావాలని ఇంధన శాఖ కార్యదర్శి, జెన్‌కో సీఎండీ రొనాల్డ్‌రాస్ ఆదేశించారు. శుక్రవారం విద్యుత్ సౌధలో బీహెచ్ఈఎల్ సీఎండీ కె.సదాశివమూర్తి, ఇతర అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్లాంట్‌లోని మిగతా మూడు యూనిట్లను 2025 మార్చికల్లా పూర్తిచేయాలన్నారు. ఇక భద్రాద్రి, కేటీపీఎస్ ఏడో దశలో ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ) పనులను నిర్ణీత షెడ్యూల్‌లోగా పూర్తి చేయాలని కోరగా దీనికి బీహెచ్ఈఎల్ అధికారులు అంగీకారం తెలిపారు. నిర్ణీత వ్యవధిలోగా పనులు పూర్తిచేయడానికి అవసరమైన మానవ వనరులను సమకూర్చుకోవాలని రొనాల్డ్ రాస్ సూచించారు. వైటీపీఎస్‌లో అన్ని యూనిట్లను నిర్ణీత వ్యవధిలోగా పూర్తిచేయడానికి, జెన్‌కో ప్లాంట్లలో ఏ సమస్యలు ఉత్పన్నమైనా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని బీహెచ్ఈఎల్ సీఎండీ తెలిపారు. ఈ సందర్భంగా అడ్వాన్స్‌డ్ అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ, కోల్ గ్యాసిఫికేషన్ వంటి అధునాతన సాంకేతికతలపై రొనాల్డ్ రాస్ ఆరా తీశారు.

సాగర్ నీటి విడుదలకు మా సమ్మతి అక్కర్లేదా?

» కృష్ణాబోర్డు చైర్మన్ ఏకపక్ష నిర్ణయంపై రాష్ట్ర అధికారుల విస్మయం

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తమను సంప్రదించకుండానే నాగార్జున సాగర్ కుడికాలువ నుంచి 3 టీఎంసీల నీటి విడుదలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ శుక్రవారం ఇచ్చిన ఉత్తర్వులపై తెలంగాణ అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. ఏకపక్షంగా ఉత్తర్వులిచ్చే అధికారం చైర్మన్‌కు ఎక్కడిదంటూ ఆక్షేపించారు. ప్రధానంగా నీటి విడుదలపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నా త్రిసభ్య కమిటీకే అధికారం ఉంటుంది. ఈ కమిటీలో కృష్ణాబోర్డు సభ్య కార్యదర్శి కన్వీనర్‌గా.. తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీలో ఏ ఒక్కరు సమ్మతి తెలపకపోయినా.. నీటి విడుదలకు ఆదేశాలు జారీ చేయడానికి వీల్లేదు. ఏకాభిప్రాయం కుదరకపోతే కృష్ణాబోర్డు సమావేశంలో చర్చించాలి. అయినా అంగీకారం కుదరకపోతే కేంద్ర జలశక్తిశాఖ మంత్రి నేతృత్వంలోని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుండే అపెక్స్ కౌన్సిల్‌లో తేల్చుకోవాలి. అవన్నీ పట్టించుకోకుండా ఉత్తర్వులిచ్చిన బోర్డు చైర్మన్‌ను నిలదీయాలని రాష్ట్ర అధికారులు భావిస్తున్నారు.

317 జీవోతో నష్టపోయిన వారి వివరాలివ్వండి

» అధికారులను ఆదేశించిన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జీవో 317 వల్ల అన్యాయం జరిగిన వారిని గుర్తించి, వివరాలను త్వరలోనే అందజేయాలని మంత్రివర్గ ఉప సంఘం అధికారులను ఆదేశించింది. వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన ఉపసంఘం శుక్రవారం సచివాలయంలో సమావేశమైంది. కమిటీలో సభ్యులుగా ఉన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి అధికారులతో దామోదర సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక అందించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. శుక్రవారం నాటి సమావేశంలోనూ కొన్ని శాఖల నుంచి పూర్తి సమాచారం అందినా, మరి కొన్ని శాఖల నుంచి 317 జీవో బాధిత ఉద్యోగులకు సంబంధించిన నిర్దిష్టమైన సమాచారం రావాల్సి ఉందని ఉపసంఘం అభిప్రాయ పడింది. వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాత 30-40 శాతం మంది ఉద్యోగులు చేసుకున్న దరఖాస్తులు పునరావృతం అయినట్లు ఉప సంఘం గుర్తించింది.

ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం

అందుకు మరింత లోతుగా అధ్యయనం చేయండి.. పైలట్ ప్రాజెక్టుగా ఓ మండలాన్ని తీసుకోండి

ప్రజల నుంచి సూచనలు స్వీకరించండి.. భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర చట్టం చేయాలి

విస్తృత సంప్రదింపులు, అఖిలపక్ష భేటీ తర్వాతే నిర్ణయం.. ధరణిపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ధరణితో తలెత్తుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మరింత లోతుగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దేశించారు. భూ సమస్యలు నానాటికీ ఎక్కువవుతున్న నేపథ్యంలో సమగ్ర చట్టం రూపొందించాల్సి ఉందని స్పష్టం చేశారు. ధరణి సమస్యలపై శుక్రవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఒకప్పుడు గ్రామ స్థాయిలోనే అందుబాటులో ఉండే రికార్డులు చట్టాల మార్పుతో క్రమంగా మండల కేంద్రానికి, తర్వాత జిల్లా కేంద్రానికి, రాష్ట్ర స్థాయికి వెళ్లిపోయాయి. భూ సమస్యల పరిష్కారానికి అప్పీలు చేసుకునే అవకాశం గతంలో ఉండేది. ధరణితో గ్రామ, మండల స్థాయిలో ఏ సమస్యకు పరిష్కారం లేకుండాపోయింది. సమస్త అధికారాలను జిల్లా కలెక్టర్‌కే అప్పజెప్పారు. అయినా.. అక్కడ కూడా సమస్య పరిష్కారం కావడం లేదు. కలెక్టర్లు తీసుకునే ఏ నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా ధరణిని రూపొందించారు" అని తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారానికి విస్తృతస్థాయి సంప్రదింపులు చేపట్టాలని, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలతో సమగ్ర చట్టం తీసుకు రావాల్సి ఉందని స్పష్టం చేశారు. భూదాన్, పోరంబోకు, బంచరాయి, ఈనాం, కాందిశీకుల భూముల సమస్యలున్న ఓ మండలాన్ని ఎంపిక చేసుకొని, అక్కడ ఎదురవుతున్న సమస్యలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందిస్తే ఆయా సమస్యలపై పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. అవసరమైతే వాటిపై శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ధరణి సమస్యల పరిష్కారానికి ఆర్వోఆర్ చట్టంలో తీసుకు రావాల్సిన మార్పులపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కూడా ఇచ్చారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి జానా రెడ్డి, ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, సునీల్ కుమార్, రేమండ్ పీటర్, మధుసూదన్, సీసీఎల్ఏ నవీన్ మిత్తల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శులు వేముల శ్రీనివాసులు, సంగీత సత్యనారాయణ, అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

దీపావళి తర్వాత స్థానిక ధమాకా!

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు ఇప్పటికే నిలిచిపోయాయి. ఈ నిధులు సాధించుకోవాలంటే సాధ్యమైనంత తొందరగా స్థానిక ఎన్నికలను నిర్వహించాలనే ఆలోచనలో సర్కారు ఉంది. అలాగే, రుణమాఫీ ప్రక్రియ పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఈ ప్రక్రియ ఆగస్టు 15వ తేదీనాటికి పూర్తి కానుండడంతో ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించాలని పావులు కదుపుతున్నారు. ముందుగా సర్పంచ్, తరువాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. మునిపాలిటీలకు మాత్రం వచ్చే ఏడాది జనవరి తరువాత ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.



బీసీల రిజర్వేషన్ ఎంత!?

రిజర్వేషన్లు 50 శాతాన్ని మించరాదన్న సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఈసారి కూడా బీసీలకు 23 శాతమే అమలవుతుందా!? లేక బీసీలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నట్లు చట్ట సవరణ చేసి వాటిని పెంచే అవకాశం ఉంటుందా!? అనే అంశంపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. నిజానికి, గత బీఆర్ఎస్ సర్కారు 2018లో పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేసింది. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించింది. ఆ ప్రకారమే 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం తమకు రిజర్వేషన్లు పెంచి అమలు చేయాలని బీసీలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కానీ, రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీం కోర్టు ఆదేశాలు ఇందుకు ప్రతిబంధకంగా మారాయి. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. సుప్రీం కోర్టు నిర్దేశించిన 50 శాతం కోటా మించకుండా ఆయా రాష్ట్రాలు బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే, బీసీల ఆకాంక్షలను నెరవేర్చడానికి వారి జనాభాను తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు ఆదేశించిన విషయం తెలిసిందే. కానీ, అది ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేదు. దాంతో, ఓటర్ల జాబితా ప్రకారమే ఈ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. దాని ప్రకారమే బీసీల జనాభా ఎంతనే విషయాన్ని తేల్చనుందని సమాచారం. ఈ మేరకు ఎన్నికల సంఘం నుంచి తాజా ఓటర్ల జాబితాను పంచాయతీరాజ్ శాఖ తీసుకుంటుంది. గ్రామాలు, వార్డులు, మండలాలవారీగా వివరాలు సేకరించి బీసీ కమిషన్‌కు అందజేస్తుంది. క్షేత్రస్థాయిలో బీసీలు ఎంత మంది ఉన్నారనే వివరాలను పరిశీలించి.. బీసీలు రాష్ట్రంలో ఎంతమేర వెనకబాటుకు గురయ్యారు? వారికి ఎంతమేర రిజర్వేషన్లు కల్పించాలనే అంశంపై ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. కాగా గ్రామ, వార్డు, మండలవారీగా స్థానిక వివరాల సేకరణకు సుమారు 35-45 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. అనంతరం బీసీ కమిషన్ వాటిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదించేందుకు సుమారు 55-65 రోజుల సమయం పడుతుంది. ఈ ప్రక్రియ మొత్తం అక్టోబరు- నవంబరు మధ్య పూర్తి కానుంది. దాంతో, నవంబరు చివరి వారంలో ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కానున్నట్లు సమాచారం. అయితే, ఇక్కడ బీసీ కమిషన్ ఇచ్చిన నివేదిక మేరకు రిజర్వేషన్లపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దాని ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంటుంది. కానీ, బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని బీసీ కమిషన్ సిఫారసు చేసినా.. ఇప్పటికిప్పుడు దానిని పెంచి అమలు చేసే అవకాశం లేదు. అందుకు భారీ ప్రక్రియనే చేపట్టాల్సి ఉంటుంది. పంచాయతీరాజ్ చట్టంలో చట్ట సవరణ చేయాల్సి ఉంటుంది.

స్థానికానికి సిద్ధంకండి!

» అధికారులకు సీఎం రేవంత్ నిర్దేశం

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని, ముందుగా నిర్దేశించిన ప్రకారం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి గడువులోగా బీసీ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభించేందుకు ఎదురయ్యే ఆటంకాలు, వాటిని అధిగమించేందుకు ఏం చేయాలన్న దానిపై చర్చించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) నూతన ఓటర్ల జాబితా రావాల్సి ఉందని, ఇప్పటికే రెండు రాష్ట్రాలకు పంపిందని, తెలంగాణతోపాటు మరో ఆరు రాష్ట్రాలకు వారంలో పంపనున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. దాంతో, ఓటరు జాబితా రాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని, వారంలోపే ఆయా స్థానిక సంస్థలకు తగినట్లు ఓటర్ల జాబితాలు రూపొందించాలని నిర్దేశించారు.

ప్రస్తుత కమిషన్ నేతృత్వంలోనే..

బీసీ రిజర్వేషన్ల అంశంపై గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని బీసీ కమిషన్‌నే అప్పటి ప్రభుత్వం పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్‌గా నియమించింది. అప్పటి నుంచి ఈ కమిషన్ రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్‌ను ఖరారు చేసే అంశంపై కృషి చేస్తూ వస్తోంది. దీని గడువు ఆగస్టుతో ముగియనుంది. ఇదే సమయంలో ప్రభుత్వం స్థానిక ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించింది. మళ్లీ కొత్త కమిషన్‌ను నియమిస్తే అది కసరత్తు చేయడానికి సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో వకుళాభరణం కృష్ణమోహన్ కమిషన్ గడువునే పొడిగించి దాని ఆధ్వర్యంలోనే బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసి, ఎన్నికలకు వెళ్లాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది.

'ఎల్‌ఆర్‌ఎస్' పరిశీలనకు జిల్లాకో ప్రత్యేక బృందం!

» దరఖాస్తుల పరిశీలనకు 33 బృందాలు

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు

» 25.29 లక్షల దరఖాస్తుల పెండింగ్

» కొత్తగా దరఖాస్తులకూ అవకాశం?



హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): లే-అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) పెండింగ్ దరఖాస్తులకు త్వరలోనే మోక్షం లభించనుంది. దరఖాస్తుల పరిష్కారానికి జిల్లాకో బృందాన్ని ప్రత్యేకంగా నియమించనుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 33 బృందాలు ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులను పరిశీలించనున్నాయి. ఎల్ఆర్ఎస్ కింద ఇప్పటికే లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. వాటి పరిష్కారంతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కల్పించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రెవెన్యూశాఖ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటితో కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. లే-అవుట్ అనుమతుల కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని భట్టి సూచించారు. ఇందుకోసం 33 జిల్లాల్లో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేయాలని, సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలని చెప్పారు. ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ కింద 25.29 లక్షల దరఖాస్తులు ఉన్నాయి. వీటి క్రమబద్ధీకరణతో భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. అపరిష్కృత దరఖాస్తుల్లో గ్రామ పంచాయతీల పరిధిలో 10,83,394, మునిసిపాలిటీల్లో 10,60,013, నగర పాలక సంస్థల పరిధిలో 4,16,155 దరఖాస్తులు ఉన్నాయి. స్థలానికి రూ.1,000, లే అవుట్లకు రూ.10,000 చొప్పున ప్రభుత్వం రుసుము వసూలు చేసింది. దీంతో దరఖాస్తు ఫీజు కిందే రూ.257.47 కోట్ల ఆదాయం వచ్చింది. వాటిని పరిష్కరిస్తే ఖజానాకు మరింత ఆదాయం సమకూరుతుందని రేవంత్ సర్కారు భావిస్తోంది.

ముందుచూపుతోనే హైదరాబాద్ అభివృద్ధికి

రూ.10 వేల కోట్లు కేటాయించిన సీఎం రేవంత్

బడ్జెట్‌ను చూసి కేసీఆర్‌కు మైండ్ బ్లాంక్ అయిపోయింది

» పదేళ్లలో మీరిచ్చిన నిధులెన్ని?

» విజన్‌తో ముందుకెళ్తున్న కాంగ్రెస్ సర్కార్: తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముందుచూపుతోనే హైదరాబాద్ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి బడ్జెట్లో రూ.10 వేల కోట్లు కేటాయించారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లలో హైదరాబాద్ అభివృద్ధి కోసం కేసీఆర్ ఈ మేరకు బడ్జెట్‌ను ఏనాడైనా కేటాయించారా అంటూ నిలదీశారు. అసలు అధికారంలో ఉన్న పదేళ్లలో ఇట్లాంటి ఆలోచనే కేసీఆర్ చేయలేదని పేర్కొన్నారు. రేవంత్ పెట్టిన బడ్జెట్‌ను చూసి కేసీఆర్‌కు మైండ్ బ్లాంక్ అయిపోయిందన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజల అభివృద్ధి బడ్జెట్‌ను పెట్టిందని కొనియాడారు. వాస్తవానికి హైదరాబాద్ అభివృద్ధికి ఈ మేరకు నిధులు కేటాయించినందుకు కేసీఆర్, కేటీఆర్‌లు.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కలకు అభినందనలు తెలపాలన్నారు. "పిట్టకథలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట! హుస్సేన్‌సాగర్ నీళ్లను కొబ్బరినీళ్ల లెక్కన చేస్తనన్నడు. పదేళ్లు గడిచినా ఎందుకు చేయలేదు?" అంటూ నిలదీశారు. హైదరాబాద్ పాత నగరంలో మౌలిక సదుపాయాలు లేవని, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ వంటి చోట్లా వర్షం వస్తే నీట మునిగే కాలనీలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోనియా, రాహుల్‌గాంధీల నాయకత్వంలో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించిన సీఎం రేవంత్‌రెడ్డి.. జీహెచ్ఎంసీకి రూ.3065 కోట్లు, హెచ్ఎండీఏకి రూ.500 కోట్లు, హైడ్రాకి రూ.200 కోట్లు, పాతనగరంలో మెట్రో కోసం రూ.500 కోట్లు బడ్జెట్లో కేటాయించారని వివరించారు. కేసీఆర్‌కు విజన్ ఉంటే పదేళ్లలో హైదరాబాద్‌కు నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విజన్ ఉంది కాబట్టే హైదరాబాద్ నగరానికి రూ.10 వేల కోట్లు కేటాయించిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మంచి చేస్తే శభాష్ అంటూ మెచ్చుకునే ధైర్యం తమకు ఉందని, కానీ మంచి పని చేస్తే మెచ్చుకునే పెద్ద మనసు కేసీఆర్‌కు లేదని జగ్గారెడ్డి అన్నారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

నేడు బడ్జెట్‌పై సాధారణ చర్చ

హైదరాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి): 2024-25 వార్షిక బడ్జెట్‌పై శాసనసభ, మండలిలలో శనివారం సాధారణ చర్చ జరగనుంది. శాసనసభలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, శాసన మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు గురువారం బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సభ్యులు అడిగే ప్రశ్నలకు శాసనసభలో భట్టి, శాసన మండలిలో శ్రీధర్ బాబు సమాధానాలు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఉభయ సభల్లో శనివారం ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేశారు.

స్మితపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: కోదండరాం

హైదరాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి): చట్టాలను అమలు చేయాల్సిన స్థానంలో ఉండి దివ్యాంగులను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని టీజేఎస్ అధినేత కోదండరాం కోరారు. తద్వారా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన అన్నారు. స్మిత వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన తెలిపారు. దివ్యాంగుల చట్టం- 2016లోని ఆర్టికల్ 3 ప్రకారం వైకల్యం కలిగిన ప్రతి ఒక్కరికీ అందరితో సమానంగా ఎదిగే అవకాశం, ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితులను ప్రభుత్వమే కల్పించాలన్నారు. వైకల్యం పేరుతో హక్కులను హరించడానికి వీల్లేదని, ఆర్టికల్ 7 ప్రకారం దివ్యాంగులను దూషించినా, అవమానించినా, వారిపై దాడికి దిగినా పెద్ద నేరాలుగానే పరిగణించాలని పేర్కొన్నారు. చాలా మంది వైకల్యం కలిగిన వారు మామూలు వారి కంటే బాగా రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటి చెప్పారని కోదండరాం తెలిపారు.

90 రోజుల్లో 30 వేల ఉద్యోగాల భర్తీకి పరీక్షలు

» సమస్యలుంటే మంత్రులు, అధికారులకు చెప్పండి

» నిరసనలు వద్దు: సీఎం రేవంత్‌రెడ్డి

» అండగా ఉంటానని నిరుద్యోగులకు హామీ

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రానున్న 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాల భర్తీకి పోటీ పరీక్షలను నిర్వహించబోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 90 రోజుల్లో 31 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చాం. డీఎస్సీ నోటిఫికేషన్‌తో 11 వేల టీచర్ పోస్టులు, గ్రూప్ 1, 2, 3లతోపాటుగా ఇతర శాఖల్లో ఖాళీలు కలిపి దాదాపుగా ఇంకో 30 వేల ఉద్యోగాలకు పోటీ పరీక్షలు నిర్వహిస్తాం. అంటే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లు అవుతుంది. తద్వారా మా చిత్తశుద్ధిని నిరూపించుకుని, నిరుద్యోగ యువతకు మా ప్రభుత్వం పట్ల విశ్వాసం కల్పించి, ప్రభుత్వంలో ఏర్పడే ప్రతి ఖాళీనీ జాబ్ క్యాలెండర్ ద్వారా భర్తీ చేయాలన్నదే మా లక్ష్యం." అని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగులు నిరసనలు, ఆందోళనలకు దిగొద్దని.. రేవంత్ అన్నగా వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వారికేవైనా సమస్యలు ఉంటే మంత్రులు, అధికారుల్ని కలిసి చర్చించాలన్నారు. వట్టినాగులపల్లిలోని తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 483 మంది ఫైర్‌మెన్ల పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించిన సీఎం.. ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో నిరుద్యోగ సమస్యే అత్యంత కీలకమైనదని గుర్తుచేశారు. కానీ రాష్ట్రం ఏర్పాటయ్యాక పదేళ్లపాటు అధికారంలో ఉన్న గత పాలకుల ప్రధాన లక్ష్యాల్లో ఈ అంశం లేకపోవడం దురదృష్టకరమన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన 90 రోజుల్లోపే 31 వేల ఉద్యోగ నియామక పత్రాలు తెలంగాణ రాష్ట్ర యువకులకు అందించామని.. ఆ 31 వేలలో ఇక్కడ శిక్షణ పొందిన 483 మంది అగ్నిమాపక సిబ్బంది కూడా ఉన్నారని పేర్కొన్నారు. కఠినమైన శిక్షణ పూర్తి చేసుకుని సమాజానికి తమ వంతు సేవలు అందించడానికి వస్తున్న వారికి అభినందనలు తెలిపారు. "మీరు తీసుకుంటున్న బాధ్యత ప్రతి నెల మొదటి తారీఖున వచ్చే జీతభత్యాలకోసం కాదు. జీతభత్యాల కోసం ఎవరూ ప్రాణత్యాగాలకు సిద్ధపడరు. అగ్నిప్రమాదాలు జరిగినా, వరదలు వచ్చినా, అనుకోని దుర్ఘటనలు జరిగినప్పుడు.. అందరి కంటే ముందు ఉండేది అగ్నిమాపక సిబ్బంది. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడే బాధ్యత అగ్నిమాపక సిబ్బంది తీసుకుంటారు. సమాజాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ఉద్యోగంలో చేరి బాధ్యతలు నిర్వహించేందుకు వచ్చినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నా" అని సీఎం వారిని ప్రశంసించారు. కొత్తగా 157 మందికి నియామక పత్రాలు.. శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీ, ప్రశంసా పత్రాలు అందించారు. కాగా, ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా.. విపత్కరమైన, క్లిష్టపరిస్థితుల్లో చిక్కుకున్నవారి ప్రాణాలను, ఆస్తులను కాపాడే అగ్నిమాపక సిబ్బందిని ప్రశంసించారు. రాష్ట్రంలో పారదర్శకంగా పెద్దఎత్తున నియామకాలు చేపట్టేందుకు టీఎస్పీఎస్సీలో పూర్తిస్థాయి అవగాహన ఉన్న వ్యక్తుల్ని సీఎం నియమించారని.. ఆయన వెల్లడించారు. మున్ముందు జాబ్ క్యాలెండర్‌తో మరిన్ని నియామకాలు చేపడతామని మంత్రి వెల్లడించారు.



ఫైర్‌మెన్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

అంబులెన్స్‌లో పంపండి...

కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్ ప్రసంగిస్తున్న సమయంలో.. పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఉన్న ఒక ఫైర్‌మెన్ స్పృహ తప్పి కిందపడిపోయాడు. దీన్ని గమనించిన సీఎం.. తన ప్రసంగాన్ని వెంటనే నిలిపివేశారు. అతణ్ని వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించాలని అధికారులకు సూచించారు. అనంతరం తన ప్రసంగాన్ని కొనసాగించారు.

సీఎంకు ధన్యవాదాలు: నాగిరెడ్డి

ప్రాణాలు పణంగా పెట్టి పనిచేసే అగ్నిమాపక సిబ్బందికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ఆ శాఖ డీజీ వై. నాగిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. "అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్, డ్రైవర్ ఆపరేటర్ల విధులు చాలా ముఖ్యమైనవి. ఈ మధ్యనే సీఎం చొరవ తీసుకుని ప్రతి జిల్లాలో జిల్లా ఫైర్ అధికారిని ఏర్పాటుచేశారు. సిబ్బంది వరదలు, అగ్ని ప్రమాదాల్లో ప్రాణలు ప్రణంగా పెట్టి పనిచేస్తారు. కొన్నిసార్లు అలాంటి పరిస్థితుల్లో గాయపడతారు. మరికొన్ని సందర్భాల్లో దురదృష్టవశాత్తు ప్రాణాలు కూడా కోల్పోతారు. అలాంటి పరిస్థితుల్లో వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ఎక్స్ గ్రేషియా పాలసీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది" అని ఆయన అన్నారు.

జగన్ పత్రికకు జనం సొమ్ము

ఐదేళ్లలో రూ.371 కోట్ల ప్రకటనలు.. ఇతర పత్రికలకు రూ.488 కోట్లు

- 'ఆంధ్రజ్యోతి'కి పూర్తిగా నిలిపివేత
- శాసనసభ సాక్షిగా ప్రభుత్వం వెల్లడి
- ఈ వ్యవహారంపై విచారణ చేయిస్తాం
- అవసరమైతే సభా సంఘం ఏర్పాటు
- ఏపీ మంత్రి పార్థసారథి వెల్లడి



అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జగన్ తన సొంత పత్రికకు ఐదేళ్లపాటు జనం సొమ్మును దోచిపెట్టారు. గత ప్రభుత్వంలో 'సాక్షి' పత్రికకు ఏకంగా రూ.371 కోట్ల విలువైన ప్రకటనలు ఇచ్చారు. మిగిలిన అన్ని పత్రికలకూ కలిపి రూ.488 కోట్ల విలువైన ప్రకటనలు జారీ చేశారు. 'ఆంధ్రజ్యోతి'కి ఉద్దేశపూర్వకంగా ప్రకటనలు ఇవ్వలేదు. శుక్రవారం అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం గణాంకాలతో సహా ఈ వివరాలను వెల్లడించింది. ప్రకటనల జారీలో సర్క్యులేషన్‌ను ఎక్కడా ప్రాతిపదికగా తీసుకోలేదని, కేవలం పక్షపాత ధోరణితోనే ప్రకటనలు జారీ చేసిందని తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేయిస్తామని, అవసరమైతే సభాసంఘాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. గత ప్రభుత్వంలో వార్తా పత్రికలకు ప్రకటనల జారీ అంశంలో పక్షపాత ధోరణిపై ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, బెందాళం అశోక్, తెనాలి శ్రవణ్‌కుమార్ అడిగిన ప్రశ్నలపై శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో చర్చ జరిగింది. ఈ ప్రశ్నకు సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమాధానమిచ్చారు. జీవో 431 ప్రకారం ప్రకటనల జారీలో ఐ అండ్ పీఆర్ శాఖకు విచక్షణాధికారం ఉందని, దీనిని అడ్డం పెట్టుకుని గత ప్రభుత్వంలో అడ్డగోలుగా ప్రకటనలు ఇచ్చారని తెలిపారు. పూర్తిగా పక్షపాతంతో ప్రకటనలు ఇచ్చారన్నారు. ఈనాడు లాంటి పత్రికలు ప్రభుత్వం బిల్లులు ఇవ్వట్లేదనే కారణంతో ప్రకటనలు వద్దని చెప్పాయని తెలిపారు.

'ఆంధ్రజ్యోతి'కి ఎందుకు ఇవ్వలేదు?

ప్రభుత్వాన్ని ఇప్పటికీ ఐ అండ్ పీఆర్ అధికారులు తప్పుదారి పట్టిస్తున్నారని ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్‌కుమార్ ఆరోపించారు. పత్రికల ఏబీసీ వివరాలు సభ ముందు పెట్టాలని కోరారు. సర్క్యులేషన్ ప్రకారం ప్రకటనలు ఇవ్వాల్సి ఉందని, 'ఆంధ్రజ్యోతి'కి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సాక్షికి అత్యధిక స్థాయిలో ఎందుకిచ్చారని నిలదీశారు. ఇది పెద్ద కుంభకోణమని, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డిని రిలీవ్ చేయొద్దని డిమాండ్‌చేశారు. ప్రభుత్వం మారినా అధికారులు ఇంకా మారలేదని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. పక్షపాత ధోరణి కనిపిస్తున్నా పక్షపాతం లేదనే కోణంలో మంత్రికి సమాచారం ఇచ్చారన్నారు. సాక్షికి అప్పనంగా ప్రకటనలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇచ్చిన ప్రకటనల విలువ ఇదీ..

పత్రిక	ప్రకటనల విలువ
ఈనాడు	243.37 కోట్లు
సాక్షి	371.12 కోట్లు
ఆంధ్రజ్యోతి	27.98 లక్షలు
ఆంధ్రప్రభ	16.49 కోట్లు
టైమ్స్ ఆఫ్ ఇండియా	27.21 కోట్లు
డెక్కన్ క్రానికల్	45.82 కోట్లు

అరకొర సమాచారమే...

జగన్ పత్రికకు సమాచార శాఖ ద్వారా జారీ అయిన ప్రకటనల విలువే రూ.371 కోట్లు. జగన్ చానల్‌కు కూడా కోట్లలో జనం సొమ్ము గుమ్మరించారు. ఇక.. జిల్లా స్థాయిలో జగన్ పత్రికకు ఇచ్చిన ప్రకటనల విలువ కూడా సభ దృష్టికి తీసుకురాలేదు. ఇవన్నీ కలిపితేగానీ జగన్ మీడియాకు దోచిపెట్టిన జనం సొమ్ము నికరంగా ఎంతనేది తెలియదు. మరోవైపు... జిల్లాల్లో జగన్ పత్రికకు జారీ చేసిన ప్రకటనల విలువ ఎంతో తెలియచేయాలంటూ శుక్రవారం అన్ని జిల్లాల డీపీఆర్వోలను ప్రభుత్వం ఆదేశించింది.

పాత అధికారుల రోత పనులు!

మంత్రిని తప్పుదోవ పట్టించేలా సమాచారం

గత ప్రభుత్వం పత్రికలకు ప్రకటనల జారీ అంశంపై చర్చలో సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథిని, మొత్తంగా సభనూ తప్పుదారి పట్టించారు. ఆ శాఖలో జగన్ హయాంలో పని చేసిన అధికారులే కీలక స్థానాల్లో కొనసాగుతున్నారు. '2019-24 మధ్య కాలంలో వార్తా పత్రికలకు ప్రకటనల జారీలో పక్షపాత ధోరణి వాస్తవమేనా?' అని ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నకు... అధికారులు 'లేదు' అని సమాధానమిచ్చారు. మంత్రి పార్థసారథి ఇదే సమాధానాన్ని సభకు చెప్పారు. కానీ... ఆయనే విడుదల చేసిన ప్రకటనల గణాంకాలు జగన్ పత్రికకు ఎక్కువ ప్రకటనలు ఇచ్చిన విషయాన్ని స్పష్టంగా ధ్రువీకరించాయి. దీంతో... ఓవైపు భారీగా ప్రకటనలు ఇచ్చినట్లు అంకెలు చెబుతుంటే, పక్షపాతం లేదని ఎలా చెబుతారని సభ్యులు నిలదీశారు. దీంతో మంత్రి పార్థసారథి ఇరకాటంలో పడ్డారు. జీవో 341 ప్రకారం శాఖకు విచక్షణాధికారం ఉన్నందున తాను అలా చెప్పానని, అంతేకానీ వాస్తవాలు దాయాలని కాదని వివరణ ఇచ్చారు. వాస్తవాలు దాచే ఉద్దేశం ఉంటే గణాంకాలు ఎందుకు విడుదల చేస్తామని ప్రశ్నించారు. సభ్యుల డిమాండ్‌తో సభా సంఘం అంశాన్ని కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

ఏపీకి 2 పారిశ్రామిక నగరాలు

- బిహార్‌కు ఒకటి.. మొత్తంగా 12 కొత్త నగరాల ఏర్పాటు
- ఉపాధి, ఉద్యోగాలకు అవకాశం: డీపీఐఐటీ

న్యూఢిల్లీ, జూలై 26: ఏపీలో రెండు కొత్త పారిశ్రామిక నగరాలను ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర పరిశ్రమల ప్రోత్సాహకం, అంతర్గత వాణిజ్య విభాగం(డీపీఐఐటీ) కార్యదర్శి రాజేశ్‌కుమార్ సింగ్ వెల్లడించారు. ఏపీలో రెండు, బిహార్‌లో ఒకటి చొప్పున మొత్తం 12 అందుబాటులోకి రానున్నట్టు తెలిపారు. స్వదేశీ ఉత్పత్తులకు భారీ ఊతమిచ్చేలా ఇవి దోహదపడనున్నాయని వివరించారు. ఇప్పటికే యూపీలోని నోయిడా, గుజరాత్‌లోని ధోలెరాలో ఏర్పాటు చేస్తున్న నగరాల మాదిరిగానే కొత్తవి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కొత్తగా ప్రకటించిన 12 నగరాల్లో ఇప్పటికే 8 చోట్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన వంటివి జరుగుతున్నాయని పేర్కొన్నారు. ధోలెరా(గుజరాత్), ఔరిక్(మహారాష్ట్ర), విక్రమ్ ఉద్యోగ్‌పురి(మధ్యప్రదేశ్), కృష్ణపట్నం(ఏపీ)లో భారీ మౌలిక సదుపాయాలను కల్పించామని, పరిశ్రమలకు భూముల కేటాయింపు కూడా జరుగుతోందని రాజేశ్‌కుమార్ వివరించారు. ప్రస్తుతం బడ్జెట్‌లో ప్రకటించిన 12 నగరాలు, ఇప్పటికే అభివృద్ధి చెందిన 8 నగరాలతో కలిపి మొత్తంగా దేశంలో 20 నూతన పారిశ్రామిక నగరాలు అందుబాటులోకి రానున్నట్టు చెప్పారు.

నేనింకా రెడ్ బుక్ తెరవ లేదు

- అప్పుడే జగన్ గగ్గోలు పెడుతున్నారు: ఏపీ మంత్రి లోకేశ్



అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తాను ఇంకా రెడ్ బుక్ తెరవనేలేదని టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్ అన్నారు. దాన్ని తెరవకముందే వైసీపీ నేత జగన్ ఢిల్లీ వెళ్లి గగ్గోలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు ముచ్చటించారు. 'నా దగ్గర రెడ్ బుక్ ఉందన్న విషయం రహస్యమేమీ కాదు. రెడ్ బుక్‌లోకి ఎక్కిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని చేసిన ప్రకటనకు నేను కట్టుబడి ఉన్నాను. మేం చట్టాన్ని చేతుల్లోకి తీసుకోం. చట్ట ప్రకారం వ్యవహరిస్తాం. జగన్ తాను బయట చెబుతున్న అసత్యాలను అసెంబ్లీకి వచ్చి ప్రస్తావిస్తే వాస్తవాలు ఏమిటో మేం వివరంగా చెబుతాం' అని అన్నారు.

సైనికుల త్యాగం చిరస్మరణీయం: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధాన్ని భారత్ గెలిచి పాతికేళ్లు అవుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యుద్ధంలో మన సైనికులు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఆయన ఒక ప్రకటనలో కొనియాడారు. దేశ రక్షణ వ్యవస్థకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.6,21,940.85 కోట్లను రక్షణ శాఖకు కేటాయించామని తెలిపారు. 'వన్ ర్యాంక్-వన్ పెన్షన్' పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. 2014లో సైనికుల పెన్షన్ కోసం రూ.40 వేల కోట్లు కేటాయిస్తే, ఈసారి బడ్జెట్ లో రూ. 1.41 లక్షల కోట్లు కేటాయించామని వివరించారు. పదవీ విరమణ చేసిన సైనికుల కుటుంబాలకు వైద్య సదుపాయాల కోసం రూ. 6,968 కోట్లను కేటాయించామని తెలిపారు.

గిరిజన విద్యార్థిని చదువుకు అడ్డుగా పేదరికం

- గాంధీనగర్ ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు
- ఫీజులు చెల్లించలేక సాయం కోసం ఎదురుచూపు

వాజేడు, జూలై 26: జేఈఈలో మెరుగైన ర్యాంకు సాధించిన గిరిజన విద్యార్థిని చదువు కొనసాగించేందుకు పేదరికం అడ్డుగా నిలిచింది. ఫీజులు చెల్లించే స్థోమత లేక ఆపన్న హస్తం కోసం ఆమె ఎదురుచూస్తోంది. ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి చెందిన వాసం సుస్మిత జేఈఈ ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో 159వ ర్యాంకు సాధించి గుజరాత్‌లోని గాంధీనగర్ ఐఐటీలో సీటు తెచ్చుకుంది. అయితే ఐఐటీలో చేరేందుకు సుమారు రూ.7లక్షల ఖర్చు అవుతుందని, రోజువారీ కూలీతో కుటుంబాన్ని పోషించే తన తల్లిదండ్రులు అంత ఖర్చు భరించలేరని సుస్మిత తెలిపింది. సుస్మిత చదువుకు ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వాన్ని, దాతలను ఆమె తల్లిదండ్రులు కోరుతున్నారు. సుస్మిత బ్యాంకు అకౌంట్ 73223035722 (ఏపీజీవీబీ బ్యాంక్), ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఏపీజీవీ0004143వాజేడు బ్రాంచ్‌కు లేదా ఫోన్‌పే నంబరు 9390786082కు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్టీసీకి బకాయిల చెల్లింపుల మాటేమిటి?

- ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

హైదరాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసమే బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఆర్టీసీని గాలికి వదిలేసిందని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఈ. వెంకన్న విమర్శించారు. మహాలక్ష్మి పథకానికి రూ.4,083 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే ఉద్యోగుల పీఎఫ్, సీసీఎస్ నుంచి దారి మళ్లించిన రూ.2 వేల కోట్ల నిధుల చెల్లింపులపై బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేదని వారు విమర్శించారు. అలాగే 2013 పీఆర్‌సీకి సంబంధించిన బాండ్స్ బకాయిలు రూ.200 కోట్లు, ఆర్పీఎస్- 2017కు సంబంధించిన వేతన సవరణ బకాయిలు, 2021 పీఆర్‌సీ అమలుకు, కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సుల కొనుగోలుకు నిధులు ప్రతిపాదించలేదని పేర్కొన్నారు.

దురుద్దేశంతో హెచ్ఆర్‌డీసీఎల్ ఏర్పాటు!

- అప్పుల కోసం గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది: ఎఫ్‌జీజీ

హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం దురుద్దేశంతో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డీసీఎల్)ను ఏర్పాటు చేసిందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి ఆరోపించారు. రహదారుల నిర్మాణం, నిర్వహణ జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నప్పటికీ అప్పులు తీసుకునే వెసులుబాటు కోసం స్పెషల్ పర్పస్ వెహికిల్‌గా ఆ సంస్థను ఏర్పాటు చేశారన్నారు. బడ్జెట్ విడుదల నేపథ్యంలో శుక్రవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అప్పులతోపాటు తమ అనుయాయులకు కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు గత సర్కారు హెచ్ఆర్‌డీసీఎల్‌ను ఏర్పాటు చేసిందని ఆరోపించారు. రెండో దశలో చేపట్టిన పనులు పూర్తికాకున్నా.. రూ.1,500 కోట్లతో మూడో దశ పనులు చేపట్టేందుకు ఇటీవల అనుమతిచ్చారని (జీవో 296), ఇది ప్రస్తుత ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తుందన్నారు. దీనిపై పునరాలోచించి పారదర్శకంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

నిర్మాణ కార్మికుల బకాయిలు ఇవ్వండి: కూనంనేని

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారి బిల్లుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వెంటనే భవన నిర్మాణ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించాలని కోరుతూ కార్మికశాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్యను కోరారు. కాగా, తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, వేలంపాటను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్రను చేపడుతున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.వీరయ్య తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో సోమవారం ఈ యాత్రను ప్రారంభిస్తారని శుక్రవారం వెల్లడించారు.

'టీజీ క్యాబ్'కు రూ.5000 కోట్ల ప్రభుత్వ గ్యారెంటీ రుణం!

- జాతీయ సహకారాభివృద్ధి సంస్థ అంగీకారం
- రుణమాఫీకి వాడొద్దంటూ షరతు

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గ్యారెంటీ అప్పులపై కేంద్రం ఆంక్షలు కొనసాగుతోన్న వేళ.. రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీతో ఓ ప్రభుత్వ రంగ సంస్థకు రుణం లభించనుంది. తెలంగాణ సహకార అపెక్స్ బ్యాంక్(టీజీక్యాబ్)కు రూ.5000 కోట్ల రుణం ఇచ్చేందుకు జాతీయ సహకారాభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) అంగీకరించింది. అయితే, ఈ నిధులను రుణమాఫీకి వినియోగించకూడదని, మూలధన నిధి(క్యాపిటల్ ఫండ్)కి లేదా రైతులకు రుణాలు ఇవ్వడానికే వాడాలని షరతులు పెట్టింది. ఈ రుణానికి సంబంధించిన వడ్డీ రేటుపై ప్రస్తుతం ఇరువర్గాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. రైతు రుణ మాఫీ కోసం ప్రభుత్వం నిధుల వేట సాగిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఎన్‌సీడీసీ నుంచి రూ.10 వేల కోట్ల రుణం కోరుతూ టీజీక్యాబ్ ద్వారా దరఖాస్తు చేయించింది. బడ్జెట్ ఆవల తీసుకునే ఈ రుణానికి గ్యారెంటీ ఇస్తానని తెలిపింది. దాంతో ఐదేళ్ల కాలపరిమితితో పది శాతం వడ్డీ రేటుతో రూ.5000 కోట్లు రుణం ఇవ్వడానికి ఎన్‌సీడీసీ సమ్మతించినట్టు తెలిసింది. అయితే, ప్రస్తుతం ఆర్‌బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న బహిరంగ మార్కెట్ రుణాలపై వర్తించే వడ్డీ 8 శాతం లోపే ఉంటుంది. దాంతో ఎన్‌సీడీసీని కూడా వడ్డీ రేటును తగ్గించాలని కోరుతున్నారు. నిజానికి, ప్రభుత్వ గ్యారెంటీ రుణాలపై ప్రస్తుతం నిషేధం అమలులో ఉంది. వివిధ కార్పొరేషన్లకు ప్రభుత్వ గ్యారెంటీలతో తీసుకుంటున్న రుణాలకు బడ్జెట్ నుంచే కిస్తీలు, వడ్డీలు చెల్లిస్తుండటంతో వాటిని బడ్జెట్ అప్పులుగానే పరిగణిస్తామని కేంద్రం అన్ని రాష్ట్రాలకు ఇదివరకే చెప్పింది. 2021-22 నుంచి ఈ గ్యారెంటీ రుణాలను నిషేధించింది. గ్యారెంటీ రుణాలు ఇవ్వొద్దంటూ అన్ని బ్యాంకులను ఆదేశించింది. దాంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా మూడేళ్లుగా ఏ కార్పొరేషన్‌కూ గ్యారెంటీ ఇవ్వలేదు. కానీ, రైతురుణ మాఫీ పథకానికి రూ.26వేల కోట్లు కావాల్సిన నేపథ్యంలో ప్రభుత్వం గ్యారెంటీకి ముందుకొచ్చింది.



ఆరోగ్యకర ఆహారం అందడం లేదు!

- దేశంలో 55.6% జనాభా పరిస్థితి ఇది
- ప్రపంచంలో ప్రతి 11 మందిలో ఒకరికి క్షుద్బాధ: సోఫీ నివేదిక

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మన దేశ జనాభాలో సగం మందికి పైగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారు. ఇలాంటి వారు 55.6 శాతం మంది ఉన్నారని ఐరాసకు చెందిన 'స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషియన్ ఇన్ ద వరల్డ్' (సోఫీ) నివేదికలో వెల్లడించింది. ఇది దక్షిణాసియా దేశాల సగటు(53.1) కంటే ఎక్కువగా ఉందని పేర్కొంది. 2017లో మన దేశంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేని వారి శాతం 69.5గా ఉందని వెల్లడించింది. 2021-23 మధ్య కాలంలో 19.46 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడ్డారని తెలిపింది. మన పొరుగు దేశమైన పాకిస్తాన్‌లో 58.7శాతం మంది ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం లేదని పేర్కొంది.

సోఫీ నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు..

- ప్రపంచంలో ప్రతి 11మందిలో ఒకరు ఆకలితో బాధపడుతున్నారు. ఆఫ్రికాలో ప్రతి ఐదుగురిలో ఒకరిది ఈ పరిస్థితి.
- తక్కువ బరువుతో జన్మించేవారు, బాల్యంలో అధిక బరువుతో బాధపడేవారి సంఖ్య ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా స్తబ్ధుగా ఉంది. అయితే 15-49 వయసు మహిళల్లో రక్తహీనత పెరిగింది. 2012లో ఇది 28.5% ఉండగా 2019 నాటికి 29.9 శాతానికి చేరుకుంది. ఈ దశాబ్దం చివరికి అది 32.3 శాతానికి పెరుగుతుందని అంచనా.
- ఇక ఐదేళ్లలోపు చిన్నారుల్లో వయసుకు తగ్గ ఎత్తు లేకపోవడమనేది 2012లో 26.3 శాతం ఉండగా.. 2022 నాటికి 22.3 శాతానికి తగ్గింది. ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడమనేది కూడా 2012లో 7.5 శాతం ఉండగా, 2022నాటికి 6.8 శాతానికి తగ్గింది.
- 2022లో ప్రపంచ జనాభాలో 280 మంది కోట్ల మంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోలేని స్థితిలో ఉన్నారు. ఇది అధికాదాయం ఉన్న దేశాల్లో 6.3శాతం, మధ్యస్థ ఆదాయదేశాల్లో 21.5శాతం, తక్కువ ఆదాయమున్న దేశాల్లో 52.6 శాతం, అల్పాదాయ దేశాల్లో 71.5శాతంగా నమోదైంది.
- 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 58.2 కోట్ల మంది దీర్ఘకాలిక పోషకాహార లోపంతో బాధపడతారు. ఇందులో సగానికిపైగా ఆఫ్రికా దేశాల్లోనే ఉంటారు.
- ఆహార కొరత 2019లో 9.1 శాతం ఉండగా.. 2020 నాటికి 10.6 శాతానికి పెరిగింది.
- 2012లో ప్రపంచ జనాభాలో 12.1 శాతం ఊబకాయులు ఉండగా.. అది 2022 నాటికి 15.8 శాతానికి పెరిగిందని నివేదిక వెల్లడించింది.

రెండో దశ కౌన్సెలింగ్‌కు.. 29,777 ఇంజనీరింగ్ సీట్లు

మొదటి దశలో.. సీట్లు వచ్చినా కాలేజీల్లో చేరనివారు పెద్ద సంఖ్యలోనే!

- 27, 28 తేదీల్లో వెబ్ ఆప్షన్లు.. రెండో దశలో 31న సీట్ల కేటాయింపు
- వెబ్ ఆప్షన్లకు ఒక్కరోజు ముందు కొత్తసీట్లకు అనుమతిపై అనుమానాలు



హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ సంఖ్యలో ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. మొదటి దశలో సీట్లు పొందిన వారిలో ఎక్కువ మంది కాలేజీల్లో చేరలేదు. దీంతో 22,753 సీట్లు మిగిలిపోయాయి. తాజాగా శుక్రవారం మరో 7,024 సీట్లకు కొత్తగా అనుమతిచ్చారు. ఫలితంగా రాష్ట్రంలో రెండవ దశ కౌన్సెలింగ్‌కు మొత్తం 29,777 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులోకి వచ్చినట్లయింది. రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి సంబంధించి ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మొదటి దశకు ముందు 78,694 ఇంజనీరింగ్ కన్వీనర్ కోటా సీట్లకు అనుమతించారు. అభ్యర్థులు పెట్టుకున్న ఆప్షన్ల ఆధారంగా 75,200 సీట్లను మొదటి దశలో కేటాయించారు. ఈ సీట్లు పొందిన అభ్యర్థుల్లో చాలా మంది కాలేజీల్లో చేరలేదు. సీట్లు పొందిన వారిలో 55,941 మంది విద్యార్థులు మాత్రమే కాలేజీల్లో రిపోర్ట్ చేశారు. మిగతా సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. ప్రస్తుతం రెండవ దశ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా ఇప్పటికే స్లాట్‌ల నమోదు గడువు ముగిసింది. 27, 28 తేదీల్లో అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా 31న సీట్లను కేటాయించనున్నారు. కాగా, వెబ్ ఆప్షన్లకు ఒక్క రోజు ముందు కొత్తగా సీట్లను అనుమతించడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొదటి దశలోనే ఈ సీట్లను అనుమతిస్తే.. విద్యార్థులకు ప్రయోజనం కలిగేదన్న అభిప్రాయం ఉంది.. ఈ విషయంలో విద్యా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. నిజానికి ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందుగానే రాష్ట్రంలో కొత్తగా 10 వేల సీట్లను అనుమతించాలనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతించిన సీట్లకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం అధికారులు ప్రతిపాదనలను పంపించారు. వాటిలో రెండు వేలకు పైగా సీట్లకు మాత్రమే మొదటి దశ కౌన్సెలింగ్‌కు అనుమతించారు. మిగిలిన సీట్లపై ఏలాంటి నిర్ణయం తీసుకోలేదు. తీరా మొదటి దశ కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మిగిలిన 7 వేలకు పైగా సీట్లకు అనుమతిచ్చారు. దీని ద్వారా ప్రతిభ గల విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందన్న అభిప్రాయం ఉంది. మొదట్లోనే ఈ సీట్లను అనుమతించి ఉంటే అందుకు తగ్గట్టుగా విద్యార్థులు తమ వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకునేవారు. దాంతో మెరుగైన కాలేజీల్లో తాము అనుకున్న కోర్సులో సీటు లభించేది. కానీ.. ఈ సీట్లను రెండోదశలో అనుమతించడంతో, మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపరు. ఇప్పటికే ఏదో ఒక కాలేజీలో సీటు రావడంతో సర్దుబాటు అవుతారు. పైగా రెండవ దశ కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవడానికి ఒక్కరోజు ముందు ఈ సీట్లకు అనుమతివ్వడం వల్ల.. విద్యార్థుల్లో కొంత గందరగోళం ఏర్పడి వెబ్ ఆప్షన్లను సరిగ్గా నమోదు చేసుకోలేదు. ఫలితంగా ఈ సీట్లు భారీ సంఖ్యలో మిగిలే అవకాశం ఉందని.. వాటిని చివరకు ఆయా కాలేజీలే మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ చేసుకుంటాయనే వాదన వినిపిస్తోంది. మేనేజ్‌మెంట్ కోటా అంటే భారీగా డబ్బు వసూలు చేసే అవకాశం ఉంటుంది. దానివల్ల కాలేజీలకు ఆర్థికంగా ప్రయోజనంకలుగుతుంది. దీన్ని నివారించడంలో.. విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి.

యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీ ఎప్పుడు?

పెండింగ్‌లో నియామక బోర్డు.. ఇప్పటికీ 5 వేలకు పైనే ఖాళీలు

- అసెంబ్లీలో నిర్ణయం తీసుకుంటేనే ముందడుగు పడే అవకాశం

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూనివర్సిటీల్లోని ఖాళీ పోస్టుల భర్తీని ఎప్పుడు చేపడతారనే విషయంలో స్పష్టత రావడం లేదు. యూనివర్సిటీల్లో కొన్నేళ్లుగా నియామకాలు లేకపోవడంతో ప్రొఫెసర్ పోస్టులతో పాటు, బోధనేతర పోస్టులు కూడా భారీ సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీ విషయంలో కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికను ప్రకటించలేదు. ఈ అంశంపై అసెంబ్లీలో నిర్ణయం తీసుకుంటేనే ముందడుగు పడే పరిస్థితి ఉంది. ప్రస్తుతం వర్సిటీల్లో భర్తీ చేయాల్సిన పోస్టులు 5వేలకు పైగానే ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇందులో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఉన్నాయి. గతంలో అంచనా వేసిన ప్రకారం 11 వర్సిటీల్లోనే సుమారు 4 వేలకు పైగా ఖాళీలు ఉన్నట్టు గుర్తించారు. తర్వాత మరో నాలుగు వర్సిటీలను కూడా ఈ జాబితాలోకి తీసుకురావడంతో ఖాళీ పోస్టుల సంఖ్య మరో వెయ్యి పెరగనుంది. ప్రస్తుతం వర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సాంకేతిక సమస్య అడ్డంకిగా మారింది. ఈ పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం కామన్ నియామక బోర్డును ఏర్పాటు చేసింది. హెల్త్ యూనివర్సిటీ మినహా.. మిగిలిన 15 వర్సిటీల్లోని బోధన, బోధనేతర పోస్టుల ఖాళీలను ఈ బోర్డు ద్వారా భర్తీ చేసేలా దీన్ని రూపొందించారు. ఈ బోర్డుకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో ఒక బిల్లును ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపించారు. అయితే.. దీనికి గవర్నర్ ఆమోదం లభించలేదు. రాష్ట్రపతి పరిశీలన కోసం ఆ బిల్లును పంపించారు. దాంతో దానిపై ముందుకు వెళ్లలేని, వెనక్కి రాలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి చర్యల్ని చేపట్టింది. అందులో భాగంగా అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో వర్సిటీల్లోని ఖాళీ పోస్టుల భర్తీ అంశంపై కూడా అసెంబ్లీలో చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలంటే.. గతంలో ఆమోదించిన నియామక బోర్డు బిల్లును ప్రభుత్వం ఉపసంహరించుకోవాల్సి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. అనంతరం మరోసారి బిల్లును ప్రవేశపెట్టి, దానికి చట్టబద్ధతను కల్పించడానికి అవకాశం ఉంటుంది. అలా కాని పక్షంలో టీపీఎస్సీ ద్వారా కూడా ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి వీలుంటుందని భావిస్తున్నారు.

గతంలో ఇలా...

గతంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ఆయా వర్సిటీలే భర్తీ చేసుకునే విధానం ఉండేది. వర్సిటీలలోని ప్రత్యేక కమిటీ ద్వారా ఆ ప్రక్రియ జరిగేది. ఎలాంటి రాత పరీక్ష ఉండేది కాదు. అభ్యర్థులకు ఆయా డిగ్రీ చదువుల్లో వచ్చిన మార్కులు, నెట్, స్లెట్ వంటి పరీక్షల వంటి వాటి వెయిటేజీకి 50% మార్కులు, ఇంటర్వ్యూకు మరో 50% మార్కుల పద్ధతిలో ఈ నియామకాలను చేపట్టేవారు. ఈ విధానంలో నియామకాల్లో నాణ్యత ఉండడం లేదన్న విమర్శల నేపథ్యంలో యూజీసీ సూచనలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం పలు మార్పులను సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పోస్టుల భర్తీపై విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంటుంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.